- వీరశైవ సాహిత్యం - పాల్కురికి సోమనాథుని కృషి
- తెలుగువారి 'ఉగాది' వైశిష్ట్యం
- నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్‌తో మూసీ ముచ్చట
- ఆధునిక తెలుగుపాట - పర్యావరణ స్పృహ
- 'ఒగ్గు' జానపద కళారూపం - విశిష్టత
- నల్లగొండ 'లక్ష్మీనరసింహ స్వామి' జాతర
- తెలుగులో స్త్రీల ఆత్మకథలు
- కె.వి.నరేందర్ కథల్లో స్త్రీ సామాజిక చిత్రణ


# మూసీ


# MUSI


• Samputi : 26 • Sanchika : 05 • Pages : 64 • Rs. 20


• March 2023

UGC Care List Approved Journal


## శోభకృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు







వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 26 సంచిక : 5
మార్చి - 2023
'శుభకృత్' ఫాల్గుణ మాసం

**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)**
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

వీరశైవ సాహిత్యం - పాల్కురికి సోమనాథుని కృషి ... ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు 7
పద్య మనోహరం - 40 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 12
బాకీ (బందారం కథలు -16) ... డా. నందిని సిధారెడ్డి 13
తెలుగువారి 'ఉగాది' వైశిష్ట్యం ... డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి 17
భారతీయీకరణ10 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార21
మునగాల పరగణా కథలు : గాథలు (గ్రంథాంతరంగం-22) ... ఘట్టమరాజు 25
నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్‌తో మూసీ ముచ్చట ... అట్టెం దత్తయ్య 29
ఆధునిక తెలుగుపాట - పర్యావరణ స్పృహ ... వర్ధ వేణు 33
'ఒగ్గు' జానపద కళారూపం - విశిష్టత ... ధరంసోత్ సరిత 39
నల్లగొండ 'లక్ష్మీనరసింహ స్వామి' జాతర ... ప్రవీణ్ కుమార్ బోళ్ళ 41
తెలుగులో స్త్రీల ఆత్మకథలు ... డా. వెంకటరామయ్య గంపా 43
కె.వి. నరేందర్ కథల్లో స్త్రీ సామాజిక చిత్రణ - సాధికారత, సమస్యలు ... తాడూరి రవీందర్49
స్వర్ణకమలం (కె.విశ్వనాథ్ చిత్రాలు-సామాజిక అవలోకనం:30).. టి. లక్ష్మీనారాయణ53

### కవితలు

మకర హృదయం... ఆచార్య అనుమాండ్ల భూమయ్య - 5; గతం చదివితేనే ... కొమురవెల్లి అంజయ్య -6; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ -6; తీగ ... అమ్మంగి వేణుగోపాల్ - 20; రాలుతున్న మొగ్గలు ... బాటసారి - 38; మా చిరునామాలు ... ముత్యంపేట గంగాధర్ - 38; వెతుకుదాం రండి ... అరుణ ధూళిపాళ - 48; మధ్యతరగతి మకరందం ... ఎజ్జు మల్లయ్య - 48; జీవితపాఠం ... కె. నిఖిత - 52; చైత్ర ఉగాది - సంస్కృతి ప్రోది ... సోమయాజులు వి.ఆర్.ఎస్. - 56; బాకీ ... ఎన్.గోపి - 62.

### సమీక్షలు

తెలుగు స్వీయ చరిత్రలో కొత్త ఒరవడి - బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్ర ... డా. మల్లెగోడ గంగాప్రసాద్ 57
తెలంగాణ తొలి ద్విభాషా స్మృతి కావ్యం 'శ్రీవత్సాంకం' ... డా. అమ్మిన శ్రీనివాసరాజు 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 4 హైదరాబాద్ మార్చి : 2023

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# గమ్యం

చేరవలసినది గమ్యం. దానికి చేయాల్సింది గమనం. ఇది ఏ ప్రయాణానికైనా వర్తిస్తుంది. సాధారణంగా కదిలే ప్రతి జీవి తన కదలికలతో ప్రయాణం చేస్తూనే ఉంటుంది. శరీరం కదలించే ప్రయత్నంలో ఉంటుంది. జీవిక కోసమో, ఆహ్లాదం కోసమో, అధ్యయనం కోసమో ఎప్పటికప్పుడు ఎక్కడికో ఒక దగ్గరికి నిరంతరం గమనం కొనసాగించాల్సిందే. రోజు చివర అయితే మళ్ళీ గూటికి చేరి విశ్రాంతి తీసుకొని మళ్ళీ తెల్లవారి ఉదయం ప్రయాణాన్ని ప్రారంభించాల్సిందే. ఒక బస్సు, రైలు, విమానం అన్నీ కూడా ఈ కదలికలకు అందరికీ వినియోగపడుతున్నవే. అన్నీ ఒక గమ్యానికి చేరడానికే కష్టపడుతున్నాయి. వ్యక్తి సంబంధమైన అంశాలను గమనిస్తే ఒక ప్రత్యేకమైన హోదా కలిగిన ఉద్యోగ స్థాయి కోసం, ఆర్థిక విస్తరణ కోసం తన జీవితమంతా ప్రయాణం చేస్తూనే ఉంటాడు. గుర్తింపు, హోదాలు, కీర్తికోసం కొందరికి, సుఖసంతోషాదుల కోసం మరికొందరికి ఈ గమనం తప్పడం లేదు. ఇదంతా లోక వ్యవహారం. వస్తువుకైనా, వ్యక్తికైనా, జీవులకు వేనికైనా ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, ఎక్కడికో ప్రయాణం చేయడం తప్పడం లేదు. అయితే గమ్యం ఎక్కడికో స్పష్టంగా తెలిసినప్పుడే సరియైన ప్రయాణం ఉంటుంది. అది తెలియనప్పుడు మార్గం తెలియకుండా వెళ్ళిపోతూనే ఉంటాం. తిరిగిన చోటనే తిరుగుతూ, చేసిన పనినే చేస్తూ కాలయాపన చేసి అర్థం కాని స్థితిలో ఆగిపోతుంటాం.

మార్గం తెలిసి ప్రయాణం చేయడం మన లక్ష్యం అయితే తక్కువ సమయంలో ఎక్కువ ప్రయాణం చేయగలం. మార్గం తెలియనప్పుడు మాత్రం ఎక్కువ సమయం ప్రయాణం చేసినా చేరవలసిన గమ్యం చేరలేము. తాత్కాలికమైన వ్యవహారాల్లో నిమగ్నమైన వారికి చేరవలసిన గమ్యం తెలియదు. గమ్యం అర్థమైతే ఏ పని చేసినా ఆ మార్గం చేరడానికి అనువుగా మార్చుకుంటూ అక్కడికి సన్నిహితం అవుతుంటాం. ఉద్యోగం కోసం, వ్యాపారాలకోసం మనం చేసే ప్రయాణాలకు ఒక లక్ష్యం, గమ్యం ఉంటాయి. అదేవిధంగా ఈ లోకానికి మనం వచ్చిన కార్యం అర్థమై, చేరవలసిన గమ్యం తెలిస్తే ఆ వైపు ప్రయాణం కొనసాగుతుంది. గమ్యం తెలియకపోతే ప్రయాణం వ్యర్థమౌతుంది.

శరీరం చేసే ప్రయాణం కన్నా మనస్సు చేసే ప్రయాణంపై దృష్టి ఎక్కువగా కేంద్రీకరించాలి. శరీర ప్రయాణాలన్నీ అలసటతో కూడుకున్నవే. మనస్సు చేసే ప్రయాణమై క్లిష్టమైంది. అది ఎక్కడ ఆగుతుందో, ఎక్కడ సాగుతుందో, ఎటువంటి త్రోవల్లో పోతుందో అర్థం కాదు. కొన్నిసార్లు మన ప్రమేయం ఉన్నా, చాలాసార్లు మన ప్రమేయం లేకుండానే దాని మార్గం మళ్ళించాల్సి వస్తుంది. గమ్యం అర్థం కాని వారికి, అర్థం చేసుకోలేని వారికి ఇటువంటి మార్పులు బాధాకరంగా, ఇబ్బందిగా ఉంటాయి. గమ్యం అర్థమైన వారు ఆ యా మార్పులను తమకు అనుగుణంగా మార్చుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకుండా వేసే ప్రతి అడుగు కూడా గమ్యం వైపు మాత్రమే వేస్తారు. వారిపై తాత్కాలిక ప్రలోభాలు పనిచేయవు.

ఆలోచనలకు మూలమైన మనస్సును చిన్నచిన్న బలహీనతలకు గురి చేసి, బలాలకు దూరమైతే ఈ శరీరంతో సాధించాల్సిన పరమార్థాలను సాధించడం కష్టం. మనస్సును శక్తి స్థానాల్లో కేంద్రీకరించి నప్పుడే అతి వేగంగా చేరవలసిన గమ్యాలకు చేరుతుంటారు. ఎంత అందమైన, పెద్ద వాహనం ఉన్నా దానిలో బ్యాటరీ బలమైనది లేకపోతే ప్రయాణం కొనసాగదు కదా. గమ్యం చేరలేము కదా. బలమైన బ్యాటరీతో కూడుకున్న వాహనంలో ప్రయాణంలాగా మానసిక ప్రయాణం ఎటువంటి లోటు లేకుండా కొనసాగాలి. గమ్యం తెలుసుకొని చేరక తప్పదు. అప్పటిదాకా గమనమూ తప్పదు.

# మకర హృదయం





బ్రతుకు నొసగెడి ఈ పవిత్రమగు కొలను
పట్ల కడలేని ప్రేమ భావమ్ము మాకు,
హృదయమున కృతజ్ఞత పొంగులెత్తు; నీటి
తల్లి కొల నొకండే సమస్తమ్ము మాకు.

శుద్ధ చైతన్యమూర్తివి! చూడవలె న
టన్న మా వలెనే నీకు కన్ను లేల?
వినగవలె నన్నచో నీకు వీను లేల?
పరుగులెత్తగా వలెనన్న పదము లేల?

జ్ఞానమన నీవు, శ్రీహరీ! జ్ఞాన మీవు
ఎచట నేమి కలదొ, ఎప్పుడేది జరుగ
గలదొ? ఎవ్వరేదొ? ఎరుగగలవు నీవు;
ఉందువు కదే! హృదయముల యందె నీవు.

మ్రొక్కినట్టి వారల దప్ప, మ్రొక్కనట్టి
వారెవరిని నీ వెపుడు కాపాడదలప
వటవె? గుండెలో గల భక్తి నరయ వటవె?
పైన కనుపించవలెనొ లోలోన గలది?

కఱచి నే పట్టుకొంటి ఆ కరి పదముల,
బెదర కాతడు నన్నెత్తి చెదర మీటె
తన నిశిత దంతముల క్రుమ్మి, తప్పి పోవు
నతని వాలము కఱచి పట్టితిని నేను.

ఈ జగతిని సృష్టించి, రక్షించుచున్న
శక్తియే నన్ను సృష్టించి సాకుచుండె
నని యెఱుగుదు, నా శక్తి నీవని యెఱుగుదు;
కాని నీ విట్లు నను చంపబూను టెఱుగ!

ఈ ప్రపంచమును, నను సృష్టించినట్టి
శక్తి ఒక్కటే, రక్షించు శక్తి అదియె,
దైవమే అన్నిటికిని బాధ్యత వహించు
నని తలచి యుండ, ఇదియె బాధ్యత? హరి!హరి!


ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారి
'మకర హృదయం' పద్య కావ్యం నుండి.
ఫోన్ : 88970 73999

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5  UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2023

# గతం చదివితేనే...

అప్పుడప్పుడు నేను
గతం నల్లపూసలు ఏరుకుంటాను
మనసు బొమ్మ విరిగినప్పుడల్లా
నన్ను నేను అతికేసుకున్న సందర్భాలెన్నో
ఆ అతుకుల మానని బఁరలు గతం వెతలు

బట్ట కాల్చి పైన వేసిందెవరో
బాట సాగకుండా వేసిన ముళ్లకంపలు
కాలడ్డం పెట్టి పడేసేందుకు చేసిన ప్రయత్నాలు
భుజంపై చేయేసి వెన్నుపూసలు విరిచే చేష్టలు
అప్పుడప్పుడు నేను గతం నుంచి గమనిస్తా
చేసిన తప్పులు మళ్ళీ చేయకుండా








గతం పునాదులపైనే భవిష్యత్తు చదరంగం
అనుభవసారాన్ని మీటా పాన్‌లా ఇచ్చింది
కోరికలు, కొరుకుడు పడనివి అందించింది అదే
పొగడ్తలతో సరిపెట్టుకోవడానికి కాదు గతం
రేపటి చరిత్ర రూపకల్పనకు కావాలి నాంది

అప్పుడప్పుడైనా పాత డైరీలు తిరగేస్తేనే
గడచిన ఎత్తు పల్లాలు తలపుల నుండి దాటవు
పాత సాహిత్యం చదివితేనే
వర్తమాన మార్పులు తెలివి తెస్తాయి
వచ్చే తరానికి అందించాల్సిన
సాహిత్య రంగుల చిత్రం అవుతుంది సిద్ధం



కొమురవెల్లి అంజయ్య
ఫోన్ : 9848005676

# తుకారాం అభంగం

నిన్ను కన్నవారే నిజ దైవములు
నీలకంఠ దేవుని ప్రతిరూపాలు
ముక్కోటి తీర్థాలు వారి దివ్య చరణాలు
కాశీ ప్రయాగ గయా మహా పుణ్యక్షేత్రాలు

చూపే పుండరీకుడు త్రోవ
దిద్దుకోర నిన్ను నీవు జీవా
పథము పాండురంగని చేర
నిక్కమైనదిదే అమ్మయ్య సేవ

కాల మహిమ ఎంచలేననిది
కరిగిపోయే మంచు వంటిది
కళ్ళు తెరువు కరగక ముందే
కొలిచి గెలువు పరమాత్మని

తుకా పలికెనిదే ఉపాయము
రాజయోగ పరమ రహస్యము
లోకమందు తత్త్వ వికాసము
అమ్మానాన్న సేవలోన సాకారము




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

# వీరశైవ సాహిత్యం – పాల్కురికి సోమనాథుని కృషి

**ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు,** అధ్యక్షులు, తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం.ఫోన్ : 9989628049

తెలుగు, కన్నడ ప్రాంతాల్లో వీరశైవ సాహిత్యాన్ని ప్రచారం చేసిన వారిలో పాల్కురికి సోమనాథుడు ప్రముఖుడు. తెలుగు భాషతో పాటు కన్నడం, సంస్కృతంలో పాండిత్యం ఉన్నవాడు. ఈ భాషల్లో రచనలు కూడా చేశాడు. కర్ణాటకలోని బసవేశ్వరుని ప్రభావంతో ఈయన వీరశైవాన్ని ప్రచారం చేసేదిశగా తన రచనలను కొనసాగించాడు. నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమనలను శివకవిత్రయంగా సాహిత్యచరిత్రకారులు భావిస్తారు. వీరశైవ సాహిత్యానికి పాల్కురికి సోమనాథుడు చేసిన కృషిని పరిశీలించాల్సి ఉంది. పాల్కురికి జన్మస్థలం, సంవత్సరంవంటి విషయాల్లో పండితుల్లో ఏకాభిప్రాయం లేదు. అయినప్పటికీ ప్రస్తుతం లభిస్తున్న ఆధారాల ప్రకారం ఈయన తెలుగువాడిగాను, అది కూడా **"పాల్కురికి"** ప్రాంతానికి చెందిన వాడిగాను, క్రీ.శ. 1160–1240 ప్రాంతాల్లో జీవించినట్లు చెప్తున్నారు. త్రిపురాంతక శాసనం (1291), ద్రాక్షారామ శాసనం (1293), పలివెల శాసనం (1317) మొదలైన వాటివల్ల ఈ కాలాన్ని సరైనదిగా పరిశోధకులు భావిస్తున్నారు. పాల్కురికి గ్రామం పూర్వపు వరంగల్ జిల్లా, ప్రస్తుత జనగామ జిల్లాలో ఉంది. పాలకుర్తి గ్రామనామమే ఆయన ఇంటిపేరుగా స్థిరపడింది. పాలకుర్తిని పాలకురికి, పాల్కురికి అని పిలిచినట్లే ఈయన ఇంటిపేరు కూడా జనవ్యవహారంలో'పాల్కురికి'గా మారిపోయింది.

## పాల్కురికి రచనలు – వీరశైవం

పాల్కురికి సోమనాథుడు తెలుగు, కన్నడ, సంస్కృతభాషల్లో రచనలు చేశాడని చెప్పుకున్నాం. ఈయన తన పాతికేళ్ళప్రాయంలోనే శ్రీశైల దర్శనానంతరం తనకు కలిగిన శివానుభవాన్ని *'అనుభవసారం'* పేరుతో వర్ణించాడు. శ్రీశైలానికి వచ్చే భక్తుల ద్వారా బసవన్న గురించి తెలుసుకున్నాడు. కర్ణాటక ప్రాంతంనుండి ప్రారంభించిన వీరశైవమతోద్యమానికి తనవంతు కృషిచేసిన వారిలో బసవేశ్వరుడు అగ్రగణ్యుడిగా నిలుస్తాడు. బసవేశ్వరుని ప్రభావంతోనే వీరశైవంలో కులభేదాలు లేవని చాటేటట్లు పాల్కురికి సోమన బసవపురాణం రాశాడు. దీన్ని రాసేటప్పటికి పాల్కురికి సోమనకు ముప్పైయేళ్ళు దాటాయి. కనుక, సామాజిక అంతరువులను కూడా బాగా గ్రహించగలిగాడు. ఈ గ్రంథమే వీరశైవానికి ఈయన చేసిన సేవను ప్రధానంగా తెలియజేస్తుంది. అయినప్పటికీ మిగతా రచనల్లో కూడా వీరశైవనియమావళి, గురుదీక్ష, వీరమాహేశ్వరవ్రతం మొదలైన వెన్నింటినో తెలిపాడు. తెలుగులో ***బసవపురాణం***తోపాటు, ***పండితారాధ్య చరిత్ర, సోమనాథ స్తవం, అనుభవ సారం, చెన్నమల్లు సీసాలు, శివతత్త్వసారం, చతుర్వేద సారం, బసవోదాహరణం, బసవ***



***రగడ*** మొదలైన రచనలు చేశాడు. పాల్కురికి సోమనాథుడు కన్నడంలో కూడా కొన్ని రచనలు చేసినట్లు తెలుస్తోంది. ***బసవ రగడ, బసవాద్యరగడ, సద్గురు రగడ, శిలాసంపదనె, సహస్ర గణనం, పంచరత్న*** మొదలైనవన్నీ కన్నడంలో రాశారు. తెలుగులోని బసవపురాణాన్ని అదే పేరుతో కన్నడంలో భీమకవి అనువాదం చేశాడు. ఈయన వీరశైవానికి చేసిన కృషిని సమీక్షించుకునేముందు, వీరశైవం గురించి ప్రస్తావించుకోవాలి.

## శైవం – వీరశైవం పరిణామం :

హిందూమతం ప్రకారం త్రిమూర్తుల్లో ఒకరైన శివుణ్ణి తమ దేవుడిగా భావించే శాఖను 'శైవం' అనిపిలుస్తారు. శైవంలోని ఒక శాఖను 'వీరశైవం'అంటారు. ప్రాచీన శైవమత శాఖలైన ***పాశుపత, కాపాలిక, కాలాముఖ, గోరక్షానాథం, రసేశ్వరం*** అనే ఐదుశాఖ లున్నాయి. ఈ శాఖలనే శివసంప్రదాయాలని కూడా పిలుస్తారు. కొన్ని సంప్రదాయాల్లో వర్ణవ్యవస్థను పాటించేవారున్నారు; మరికొన్నింటిలో వర్ణవ్యవస్థను నిరసించినవారున్నారు. ఆర్యులు కూడా శివుణ్ణి 'పశుపతి'గా అంగీకరించడం, అతనిచ్చే అస్త్రాన్ని 'పాశుపతాస్త్రం' అనీ పిలిచారు. జీవులు సహజంగా పశువులనీ, వారిని

అదుపులో పెట్టగల పతియె శివుడని, అందుకే శివుడిని 'పశుపతి' అని పిలుస్తారని భావిస్తున్నారు. **పాశుపతులు** వైదికమతంలోని యజ్ఞయాగాదుల్ని నిరసించారు. ప్రకృతి శక్తుల్ని దేవతలుగా భావించారు. కానీ, వర్ణవ్యవస్థను కొనసాగించారు. **కాలముఖులు** పెళ్ళి చేసుకోరు. శాకాహారం తింటారు. యజ్ఞయాగాదుల్ని నిరసిస్తారు. అహింసను పాటిస్తారు. శివలింగాన్ని ధరించి, నల్లని బొట్టుని పెట్టుకుంటారు. అందువల్లనే వీరిని కాలముఖులు అంటారు. వీరు మద్యాన్ని సేవిస్తారు; వర్ణవ్యవస్థను పాటిస్తారు. వీళ్ళనే మహావ్రతులని పిలుస్తారు. **కాపాలికులు** ఎముకల్ని, జింక చర్మాన్ని ధరించి, శరీరానికి బూడిద పూసుకుంటారు. కొంతమంది దీన్ని పాశుపతంలోని అంతర్భాగమే కాపాలికశాఖ అని అంటారు. శవాలను, మలమూత్రాలను తినడం, పుర్రెలను దండలుగా వేసుకోవడం, అవసరమైతే మనుషుల్ని కూడా బలివ్వడం వంటివి చేస్తారు. కాపాలికులు కుల భేదాల్ని పాటించరు. కాపాలికుల సంప్రదాయంలోనే వీరశైవ బీజాలున్నాయని కొంతమంది పరిశోధకుల అభిప్రాయం.

వేదాల్ని ప్రమాణాలుగా భావిస్తూ, కర్మఫలితంగా జన్మాదికాల గురించి వైదికమతం ప్రబోధిస్తుంది. తర్వాత కాలంలో జ్ఞానపరమైనప్పటికీ, యజ్ఞయాగాదుల ఫలం నుండి మోక్షమార్గాన్ని ఉపదేశించింది. కర్మకాండలకు – జ్ఞానకాండలను బోధించే వారి మధ్య సంఘర్షణ మొదలైంది. వేదాల్లోని మంత్రాల్ని బ్రాహ్మణలు సమన్వయం చేయలేక కర్మలు పరిహాస పాత్రలైన చారిత్రక నేపథ్యంలో జైన, బౌద్ధాది మతాలు బయలుదేరాయి. జైన, బౌద్ధాలు ప్రజాజీవనం ద్వారా ధర్మమార్గాన్ని ప్రబోధించాయి. విగ్రహారాధనను వ్యతిరేకించాయి. అహింసను ప్రబోధించాయి. కానీ దైవారాధన లేకపోవడం, ఆ మత ధార్మిక భావనల్ని సరిగ్గా అవగాహన చేసుకోలేకపోవడం వల్లా, ఆ సూత్రాల్ని సరిగ్గా అన్వయం చేసుకోలేకపోవడం వల్ల క్రమేపీ వాటిలో రకరకాల విభాగాలు ఏర్పడి కొన్నింటిలో అసాంఘిక కార్యక్రమాలు మొదలైయ్యాయి. అయినప్పటికీ, బ్రాహ్మణాధిపత్యం తగ్గడం, బ్రాహ్మణుల్లోను, బ్రాహ్మణేతరుల్లోనూ 'వర్ణవ్యవస్థ' పట్ల భిన్నాభిప్రాయాలు రావడానికి కారణమయ్యాయి. ఈ పరిస్థితుల్లోనే వీరశైవం ప్రవేశించింది. శివుడే దేవుడనీ, దేవుడు అందరివాడనీ, కుల, లింగ, ప్రాంత భేదాలు లేవనీ వీరశైవం ప్రబోధిస్తూ ముందుకొచ్చింది. ఎద్దుని దైవంగా మార్చింది. ఎద్దు నందీశ్వరునిగా, నందీశ్వరుడు శివుడు పంపిన దూతగా దైవీకరించారు. కొన్ని నియమాల్ని రూపొందించి దీన్ని ఒక ఉద్యమంగా ముందుకి తీసుకెళ్ళినవాడు బసవేశ్వరుడు.

### వీరశైవం – బసవేశ్వరుని బోధనలు

**బసవేశ్వరుడు** (1134–1196) కర్ణాటక ప్రాంతానికి చెందినవాడు. బిజ్జలుడు–1 (క్రీ.శ.1153) ఆస్థానంలో ఉద్యోగిగా, ప్రధాన అధికారిగా, తత్త్వవేత్తగా ప్రఖ్యాతి గాంచాడు. ఇతడు కర్ణాటకలోని బాగేవాడిలో క్రీ.శ.1105 ప్రాంతంలో జన్మించినట్లు పరిశోధకులు చెప్తున్నారు. ఒకవైపు రాజ్యాన్ని కాపాడడంలో సహకరిస్తూనే, వీరశైవ వ్యాప్తికి ఎంతగానో పాటుపడ్డాడు. 12 వ శతాబ్దంలో వీరశైవాన్ని ప్రచారం చేసిన గొప్పసంస్కర్తగా పేరు పొందాడు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర దక్షిణభారతదేశ రాష్ట్రాల్లో నేటికీ వీరశైవప్రభావం కనిపిస్తూనే ఉండటానికి కారణమైనవాడు బసవేశ్వరుడుగా పరిశోధకులు చెప్తున్నారు. బసవేశ్వరుడినే బసవన్న, బసవడు, విశ్వగురువు అనికూడా పిలుస్తుంటారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యేరీతిలో, లయాత్మకంగా బసవేశ్వరుడు కొన్నివేల వచనాలను బోధించాడు. కుల నిర్మూలనకు పాటుపడ్డాడు. వర్ణాంతర వివాహాలు చేశాడని కూడా చరిత్ర చెబుతోంది. కుల, మత ప్రత్యేకతలను తెలిపేలా ఉపనయనం చేయడాన్ని ఇష్టపడేవాడు కాదు. శివుడే దేవుడనీ, శివుణ్ణి మించినవారెవరూలేరనీ బోధించేవాడు. కుల భేదాలతో పాటు స్త్రీ, పురుష భేదాల్ని నిరసించాడు. శ్రమను మించిన గొప్పసాధనం లేదని, భక్తికన్నా సత్ప్రవర్తనెంతో ముఖ్యమని ప్రబోధిస్తూ వీరశైవమతవ్యాప్తికి ఎంతగానో కృషిచేశాడు.

భూలోకంలోశివుని ఆజ్ఞ నెరవేర్చడానికి, శివభక్తిని వ్యాప్తి చేయడానికి, శివతత్త్వం ప్రబోధించటానికి 'వృషభమూర్తి' బసవేశ్వరుడిగా పుట్టాడని నమ్ముతారు. తన ఎనిమిది సంవత్సరాల వయస్సులో బసవన్న తండ్రి చేయతలపెట్టిన ఉపనయన కార్యక్రమాన్ని తిరస్కరించి, కర్మ సూత్రాలు విడిచిపెట్టి భక్తిమార్గంలో కూడలి సంగమేశ్వరం వెళ్ళి పరమేశ్వరుని అనుగ్రహం వలన భక్తి ప్రపత్తులు అలవరచుకొని, తర్వాత విజ్జలుడి కోరిక మేరకు భాండారి మంత్రియై వీరశైవమత వ్యాప్తికి కృషి చేసాడు. శివుడే పరమ దైవం, శివ భక్తే జీవం, కుల, వర్ణ, వర్గ వివక్షతలు చూపరాదు. భగవంతుడి భక్తి విషయంలో, హక్కుల విషయంలో స్త్రీ పురుషులకి సమాన అవకాశాలు కల్పించబడ్డాయి. వైదిక మత కర్మ కాండలను విడిచిపెట్టాలనేది వీరశైవంలో ఒక నియమం.

బసవన్నకు పెండ్లి అయిన తర్వాత గురుదేవుని దర్శించడానికి కూడలి సంగమ క్షేత్రం వెళ్ళినప్పుడు సంగమేశ్వరుడు చెప్పిన వీరశైవ సంప్రదాయం ఇలా వుంది. శివభక్తి తత్పరత కలవారై ఉండాలి, శివభక్తులు ఎటువంటి వారైనప్పటికీ వారిని గూర్చి వేరేవిధంగా భావింపరాదు. భక్తి తత్పరత కొరకు ప్రాణం సైతం లెక్కచేయరాదు. శివనింద భరించరాదు, నింద చేసిన వారిని చంపటానికి కూడా వెనకడుగు వేయరాదు. శివభక్తులు తిట్టినా, తన్నినా వారిని ఓర్పుతో క్షమించాలి. భార్య తప్ప ఇతరుల భార్యలను, స్త్రీలను కన్నెత్తి చూడరాదు. సోదరిలాగా, తల్లిలాగా భావించాలి. శివభక్తి లేని వారికి, కానివారికి ప్రసాదం ఇవ్వరాదు. శివభక్తులు కులం లేనివారు. కులం పేరు అడగరాదు. ధర్మానికి భక్తే మూలం. శివభక్తులు జంగాలు ఇచ్చిన ప్రసాదం తిరస్కరించకుండా తీసుకోవాలి. శివభక్తులను

ఎల్లవేళలా పొగుడుతూ ఉండాలి. శివుడు పరీక్షింపదలచి తప్పదారులు వెళ్ళేటట్లు ఇతరులు ప్రయత్నించినప్పటికీ శివభక్తి ధర్మాన్ని విడవకూడదు. శివుడికి, శివ భక్తుడికి తేడాలేదు గుర్తించాలి.

సమాజంలో నిమ్న కులాలుగా పిలుస్తున్న వారిని వీరశైవ మతం ద్వారా ఆకర్షించి, కుల భేదాలు లేవని చాటే ప్రయత్నం చేసిందని తెలుస్తుంది. మాదిగ, చాకలి, మంగలి మొదలైన కులాల వారికి సమాజంలో గౌరవాన్ని కల్పించిన ఘనత వీరశైవానికే దక్కుతుంది. దానితో ఈ కులాలవారు అత్యధిక సంఖ్యలో వీరశైవంపట్ల ఆకర్షితులయ్యారు. కొలనుపాకలో ఒక్కో కులానికి ఒక్కో మఠం కట్టారంటే ఈ ప్రాంతాలలో వీరశైవ ప్రభావం ఎంత ఉధృతంగా ఉందో తెలుస్తుంది. శిథిలమైపోయిన ఆ మఠాలు వీరశైవ ప్రాభవాన్ని తెలియజేస్తున్నాయి. ఇంత ప్రభావాన్ని చూసిన వీరశైవ మతవ్యాప్తికి పాల్కురికి సోమన చేసిన సేవను ఆయన రచనల ద్వారా విశ్లేషించుకోవచ్చు.

**పాల్కురికి సోమనాథుని కృషి**

పాల్కురికి సోమనాథుడు వీరశైవాన్ని ప్రతిపాదించిందీ, ప్రచారం చేయడానికి ప్రధాన సాధనమైందీ బసవపురాణం. పేరులో 'పురాణం' అని ఉన్నా సామాన్యులు కూడా భక్తులుగా మారి మహాత్ములుగా మారిన గాథలే దీనిలో కనిపిస్తాయి. సామాన్యుడైనా పరమ భక్తుడైతే పురాణవీరుడికే మాత్రం తీసిపోడనే లక్ష్యమే పేరులో కనిపిస్తుంది. ఏడు ఆశ్వాసాలు గల ***బసవపురాణం***లో నందికేశ్వరుని అవతారమూర్తిగా బసవనను భావించాడు. అతడే కావ్యనాయకుడు. అతని జననం, దీక్ష, మాహాత్మ్యం, ధర్మరక్షణ, జంగమసేవ, లింగైక్యం మొదలైన అంశాలద్వారా వీరశైవాన్ని స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశాడు. బసవునితో పాటు ఈ కావ్యంలో 75 మంది శివభక్తుల కథల్ని వర్ణించాడు. వీరశైవమత ప్రచారానికి తన సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకున్న పాల్కురికి సోమన కింది అంశాల్ని వ్యక్తీకరించాడు.

1. వర్ణాశ్రమధర్మాల మీద తిరుగుబాటు చేశాడు. శివుణ్ణి ఆరాధించడానికి కుల, వృత్తి, లింగ భేదాలు అడ్డురావని చెప్పాడు.
2. జంగమపూజకు ప్రాధాన్యమివ్వడం, వీరమాహేశ్వర వ్రతదీక్షను పాటించడం.
3. సహపంక్తి భోజనాల ద్వారా కుల భేదాలు పోతాయన్నాడు.
4. సనాతన ధర్మవాదుల కర్మకాండలను నిరసించాడు.
5. స్త్రీలకు కూడా పురుషులతో సమానంగా మోక్షసాధనాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉందన్నాడు.
6. ఉపనయన సంస్కారాన్ని తిరస్కరించాడు.
7. మద్యమాంసాలను విసర్జించాలన్నాడు.
8. మరణించినవారికి చేసే శ్రద్ధకర్మలను నిరసించాడు.
9. జంగమపూజకు ప్రాధాన్యాన్నిచ్చారు.



వీరశైవమతానికి బసవేశ్వరుడెలా పాటుపడ్డాడో పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణం కావ్యంలో చెప్పాడు. బసవేశ్వరుడు ఉపనయన సంస్కారాన్ని వ్యతిరేకించిన తీరుని వర్ణించాడు.

*'వడుగని యిది యేమి గడియించెదీవు –*
*జడుడ వెట్లయితివీశ్వరుని గొల్చియును*
*బరమాత్ముగురునిగా దుర్మరుల –*
*గురులని తలచుట నరకంబుగాదె?*
*గతపూర్వజన్మసంస్కారుడైన పిదప–*
*వితతద్విజత్వంబు పతితంబుగాదె?*
*యగ్గురుపాదంబులర్చించునతని –*
*కగ్గిలో హవి వేల్చుటదప్పుగాదె?'* (బసవపురాణం, 18,19)

ఈశ్వరుణ్ణి కొలిచేవాడు ద్విజత్వం కోసం ప్రత్యేకించి కర్మకాండలను, ఉపనయన సంస్కారాన్ని చేపట్టాల్సిన అవసరం లేదంటాడు కవి. యజ్ఞయాగాదులను కూడా తిరస్కరిస్తున్నాడు. వీరశైవంలో పూర్వజన్మ సంస్కారాల్ని, యజ్ఞయాగాదుల్ని తిరస్కరిస్తారు. దీన్నే ఇక్కడ కవి వరిస్తూ సమర్థించాడు. వడుగు చేయడాన్ని క్షుద్ర ముద్రలను తాల్చడంతో సమానంగా అభివర్ణించాడు.

*"శూలి భక్తుల కెత్తుకేలది త్రాటి –*
*మాలలకెత్తుట మఱితప్పుగాదె?*
*కర్మపాశంబు లొక్కటదెగ నీల్గి –*
*కర్మంబు త్రాళ్ళు దాగట్టుకోదగునే?*

*రుద్రాక్షిభసితాదిముద్రలు దాల్చి -*
*క్షుద్రముద్రలు దాల్పగూడునే చెపుమ?*
*యారీతిద్రాటికి దూరమై యున్న -*
*వీరమాహేశ్వరాచార దీక్షితుని*
*నిర్మితోభయకర్మనిర్మూలు నన్ను -*
*గర్మాబ్ధి ముంచుట ధర్మమే నీకు ?*
*గ్రప్ప గన్నుల గానవు గాక -*
*వచ్చునే బసవని వడుగ సేయంగ"*

**బసవేశ్వరుని మాహాత్మ్యాల ప్రచారం**

బసవేశ్వరుని మాహాత్మ్యాలను పాల్కురికి సోమన అద్భుతంగా వర్ణించాడు. నందీశ్వరుడు మాదాంబకు పుత్రుడుగా జన్మించాడు. ఆ బాలుడు పుట్టినప్పుడు కూడలి సంగమేశ్వర దేవుడు తాపసి వేషంలో వచ్చాడు. బసవేశ్వరుని వివాహసమయంలో కూడా సంగమ దేవుడు మునివేషంలో కనిపించాడు. అప్పుడే సంగమదేవుడు కొన్ని శివనియమావళిని బోధించాడు. తర్వాత సంఖ్యదేవుడు అంతర్ధాన మయ్యాడు. ఇలా బసవేశ్వరుని వర్ణనను చేయడం వల్ల పాల్కురికి సోమనాథుడు ప్రజల్ని వీరశైవులుగా ఆకర్షించే ప్రయత్నం చేశాడని భావించవచ్చు.

**కుల నిరసన**

*'బ్రహ్మశిరోహరు బ్రమథైక వంశ్యు -*
*బ్రహ్మవంశ్యుండని భావించెదెట్లు?*
*జాతి గోత్రాతీతు సద్గురుజాతు -*
*జాతిగోత్రక్రియాశ్రయు జేసెదెట్టు?*
*అకులస్థుడైయున్న యభవుని భక్తు-*
*నికనేకులంబని నిర్ణయించెదవు?"* (బసవపురాణం,19)

సూరసానమ్మ ఒక వితంతువు. ఆమె ఒక బ్రాహ్మణకుటుంబానికి చెందినామె. అయినా, వీరశైవదీక్ష తీసుకున్న వాళ్ళతో కలిసి మెలిసి ఉండేది. ఒకనాడు ఒక దళితుని ఇంటిలో ఆమె అన్నం వండుతుంటే, దీన్ని సహించని బ్రాహ్మణులు ఆమెను అవమానించాలనుకున్నా, తన మహిమతో అందర్నీ మెప్పించినట్లు పండితారాధ్యచరిత్ర వల్ల తెలుస్తుంది. మధుపయ్య అనే బ్రాహ్మణుని కుమార్తెను, హరళయ్య అనే చర్మకారుని కొడుకుకి యిచ్చి బసవన్న పెళ్ళి చేయతలపెట్టాడు. శివభక్తులంతా కలిసి క్రీ.శ.1196 ఫిబ్రవరి 12 వ తేదీన ఈ కులాంతర వివాహాన్ని జరిపించారు. బ్రాహ్మణకన్యను మాదిగవాడి కివ్వడం పట్ల సనాతన బ్రాహ్మణులంతా కోపోద్రిక్తులయ్యారట! ఈ పెళ్ళిని రాజుకూడా అంగీకరించలేదు. వారిని శిక్షించాడు. శివభక్తులు రాజుపై తిరుగుబాటు చేశారు. రెండు నెలల తర్వాత 1196 ఏప్రిల్ 3 వతేదీన రాజుని శివభక్తులు హత్యచేశారు. ఇది జరిగిన మరో మూడు నెలలకు బసవన్న లింగైక్యం చెందాడు. ఇవన్నీ పాల్కురికి సోమనాథుని రచనల వల్లనే తెలుస్తున్నాయి. అంటే కులనిర్మూలనకు వీరశైవం అవసరమైతే ప్రభుత్వంపై తిరగబడ్డానికి కూడా వెనుకాడకూడదనే స్ఫూర్తినిస్తుందీ చారిత్రక సంఘటన. 'పండితా రాధ్యుడు బ్రాహ్మణత్వాన్ని వదల్లేక 'భక్తిమీద వలపు, బ్రాహ్మణ్యంబుతో పొత్తు బాయలేను నేను బసవలింగ" అని చెప్పినా, శివభక్తిని మాత్రం గొప్పగా ప్రచారం చేశాడు. కానీ, పాల్కురికి సోమనాథుడు త్రికరణ శుద్ధిగా తన జీవితాన్ని వీరశైవానికే అంకితం చేశాడు.

**జంగమ సేవ**

వీరశైవంలో శివభక్తుడికి విశేషమైన ప్రాధాన్యం ఉంది. దీని గురించి సోమన ఇలా వర్ణించాడు. తనకంటే తన భక్తునికే ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వాలని శివుడు చేత చెప్పించినట్లుగా వర్ణించాడు కవి.

*'మద్భక్త సేవయే మత్పాద సేవ;*
*మద్భక్త దేహంబు మాదు దేహంబు*
*సన్నుతావళిని మాజంగమావళిని;*
*మన్నింప కున్నను మది నిష్ఫలంబు"*

**శైవేతర కవులపై ప్రతిఘటన**

వీరశైవంలో శివుణ్ణి గానీ, శివభక్తునిగానీ వ్యతిరేకిస్తే వారిపై ప్రతిఘటించడం వీరు చేసే ప్రధానమైన ఒక పని. శివభక్తుల్ని, వారి సాహిత్యాన్ని దూషించేవారికి తగిన బుద్ధి చెప్పే ప్రయత్నం కూడాచేస్తారు."ప్రతాపరుద్రుడు రాజ్యానికి వచ్చిన కొత్తలో ఓరుగల్లు లోని స్వయంభూదేవుని ఆలయానికి వెళ్ళాడట. ఆ మంటపంలో బసవపురాణం పఠనం జరుగుతుందట. ఆ విషయాలన్ని తెలుసుకోవా లనుకున్న రాజు ఆ సాహిత్యాన్ని తృణీకరించారని పాల్కురికి సోమనాథునికి తెలుస్తుంది. రాజుకీ, అక్కడున్న ప్రజలకూ శివభక్తుల గొప్పతనాన్ని తెలిపేలా తన వాదనను వినిపించి, తన మాహాత్మ్యాన్ని కూడా ప్రత్యక్షంగా చూపాడట. శివభక్తుల్ని వ్యతిరేకించేవాళ్లను ఎలా ఎదుర్కొని తగిన బుద్ధి చెప్పాలో, చెప్పేవారో కూడా పండితారాధ్య చరిత్రలో వర్ణించాడు.

***వీరశైవ నియమాల ప్రచారం***

పండితారాధ్య చరిత్రంలో మల్లికార్జునపండితారాధ్యుని చరిత్రను, బసవపురాణంలో చెప్పని శివభక్తుల కథలను, మరికొన్ని వీరశైవ నియమాల్ని వర్ణించాడు. చతుర్వేదసారములో శివపారమ్యాన్ని వివరించాడు. గురుభక్తి మహిమను, శివపూజాధిక విధానాన్ని, భక్తుల లక్షణాల్ని, జంగమసేవను, ఇష్టలింగార్పణాన్ని, శైవధర్మాల్ని "అనుభవసారం" లో తెలిపాడు. చెన్నమల్లు పేరతో 32 సీసపద్యాల్ని వర్ణించాడు. దీనిలో షట్ స్థల వైభవాన్ని కీర్తించాడు. బసవేశ్వరుని ప్రస్తుతి, బసవపురాణ కథాసారాన్ని **"వృషాధిపశతకం"** పేరుతో రాశాడు. సోమనాథభాష్యం అనే సంస్కృత గ్రంథంలో శైవసంప్రదా యాల్ని, లింగార్చనా ప్రాధాన్యాన్ని వివరించాడు. రుద్రభాష్యంలో

యజుర్వేదంలోని రుద్రాధ్యాయానికి దీన్ని భాష్యంగా పండితులు భావిస్తున్నారు. బసవోదాహరణంలో బసవేశ్వరుణ్ణి స్తుతించాడు.

**సామాన్య ప్రజలకు చేరువలో సాహిత్యం**

పాడుకొనుటకు వీలుగా శైవసాహిత్యాన్ని 'ద్విపదలు' గా వర్ణించాడు. దీని ద్వారా సామాన్య ప్రజలు కూడా పాడుకుంటూ శివుని గొప్పతనాన్ని తెలుసుకోవడానికి, ప్రచారం చేయడానికి వీలుగా భావించాడు. ***'వీరశైవ మతాన్ని కావ్యరూపంలో సుస్థిరం చేయడంలో గానీ, కవిత్వంలో కొత్తదారులు వేయడంలో గాని ఇతడికితడే సాటి'*** అని డా.సి.నారాయణరెడ్డి అన్న మాటలు పాల్కురికి సోమనాథుని స్థానాన్ని తెలియజేస్తున్నాయి. సామాజికంగా కింది వర్ణాలుగా భావించే వారిని గౌరవవాచకాలతో సంబోధించాడు. స్త్రీలకు ప్రాధాన్యమిచ్చాడు. అక్కమహాదేవి, నీలాంబిక, గంగాంబిక, నాగమ్మ మొదలైన బ్రాహ్మణ స్త్రీలతో పాటు మంగలి తదితర కులాలకు చెందిన మంగమ్మ, కాలవ్వ, లక్కమ్మ, మల్లమ్మ వంటి వారిని ప్రస్తుతించాడు. వారి భక్తికి ప్రశంసించాడు.

మొత్తం మీద వీరశైవులు, అందులో పాల్కురికి సోమనాథుని వీరశైవ కృషిని అంచనా వేయాలంటే దాన్ని ఇలా సంక్షిప్తంగా చెప్పుకోవచ్చు. యజ్ఞయాగాదులతో లక్షలాది జీవితాల్ని బలిపేరుతో హింసిస్తున్నప్పుడు భారతదేశంలో జైన బౌద్ధమతాలు అహింసను ప్రబోధించడం వల్ల వాటి పట్ల ప్రజలు ఆసక్తిని చూపారు. దానితో హిందూమతంలో అలజడి ప్రారంభమైంది. క్రమేపీ వైష్ణవం, శైవం తమ ఉనికిని కోల్పోవటం ప్రారంభించాయి. హిందూమతానికి ప్రమాదానికి ముంచుకొచ్చిన తరుణంలో ద్వైతం, అద్వైతం విశిష్టాద్వైతం వంటి మతధోరణులు ప్రారంభమయ్యాయి. ఈ పరిస్థితుల్లో పరోక్షంగా హిందూ మతాన్ని నిలబెట్టుకునే ప్రణాళికతోనే వీరశైవం ఆవిర్భవించింది. సనాతన సంప్రదాయ హిందూమతంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. యజ్ఞయాగాదుల సమయాల్లో బలిపశువుల్లో ఆవులు, ఎద్దుల్ని చంపడాన్ని ఆపడంలో జైన, బౌద్ధాలకంటే ఒకడుగు ముందకు వేసి, ఎద్దుని నందీశ్వరునిగా పవిత్రీకరించారు. శివుడు నందీశ్వరుని రూపంలో బసవేశ్వరుని భూలోకానికి పంపించినట్లుగా వర్ణించారు. నందీశ్వరుని అవతారమైన బసవేశ్వరుని బోధనలను ఆచరణలో చూపించడమే పాల్కురికి సోమనాథుడి ప్రధాన లక్ష్యం.ఆ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన గురు దీక్ష, జంగమసేవ, వీరమాహేశ్వర వ్రతదీక్ష, సామాన్యులను సైతం పురాణ పురుషులుగా కీర్తించడం వంటివన్నీ పాల్కురికి సోమనాథుడు తన రచనల ద్వారా ప్రచారం చేశాడు. దీనిలో భాగంగానే కుల, లింగ భేదాలను ఖండించడం కూడా. ఇంకా లోతుగా చెప్పాలంటే హిందూ మత సంస్కరణలో భాగమే పాల్కురికి సోమనాథుని వీరశైవం! దీన్ని శక్తివంతంగా ముందుకు తీసుకొచ్చిన వాడు పాల్కురికి సోమనాథుడు.

ఈ విధంగా కర్ణాటకలో బసవేశ్వరుడెలా వీరశైవాన్ని ప్రచారం చేశాడో, దాన్ని తెలుగు ప్రాంతాల్లో పాల్కురికి సోమన తన సాహిత్యం ద్వారా వ్యాపించేలా కృషిచేశాడు. తెలుగు సాహిత్య చరిత్రలో పాల్కురికి సోమన సాంస్కృతిక విప్లవానికి పాదులు వేసిన గొప్ప సాంస్కృతిక వైతాళికుడిగా గుర్తింపబడుతున్నాడు. నేటికీ ఆయన రచనలు బసవేశ్వరుని జీవితాన్ని, శివభక్తుల కథలను, శైవారాధన విధానాన్ని తెలుసుకోవడానికి ప్రామాణిక గ్రంథాలుగా నిలుస్తున్నాయి. 11-12 శతాబ్దాలలో వీరశైవ సాహిత్యం శరణం సాహిత్యంగా ఉజ్వలంగా ప్రజ్వలించిందని ప్రముఖ పరిశోధకురాలు ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి అన్నారు. బసవేశ్వరుడు తీవ్రమైన ఉద్యమాన్నే సాగించాడనీ, అందరిని కలుపుకుని, ఇంటింటికీ శైవమత ప్రచారాన్ని వచనాల రూపంలో అందజేశారన్నారు. ***"సమాజమంతా ఒక్క తాటిపై నడవడం కన్నడ సాహిత్య చరిత్రలో ఒక్క శరణసాహిత్య కాలంలోనే చూడగలం"*** అని వ్యాఖ్యానించారు. (పుట.75) దీన్ని బట్టి కేవలం తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా కర్ణాటకలో కూడా పాల్కురికి సోమనాథుని వీరశైవ సాహిత్య ప్రభావం విస్తృతంగానే వ్యాపించిందని స్పష్టమవుతుంది.

**ఆధారాలు**


1. ఆరుద్ర. ***సమగ్ర ఆంధ్ర సాహిత్యం*** (మొదటి సంపుటి). హైదరాబాదు: తెలుగు అకాడమి, 2002.

2. ఎస్.బాబు. ***బసవపురాణం -ఒకపరిశీలన*** (అముద్రిత సిద్ధాంతగ్రంథం), అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, 2008.

3. కె.ఆశాజ్యోతి, ***ఆశాజ్యోతీయం (తెలుగు-కన్నడ సాహిత్య విమర్శ),*** ముంబై : హిమాలయ పబ్లిషింగ్ హౌస్, 2016.

4. జె.మల్లయ్య, (సం.) ***ప్రథమాంధ్ర ప్రజాకవి పాల్కురికి సోమనాథుడు,***(జాతీయసదస్సు సంచిక). జోగిపేట, మెదక్ జిల్లా, తెలంగాణ: తెలుగుశాఖ, ఎస్.ఎమ్.జి.డి.సి.,2014.

5. పాల్కురికి సోమనాథుడు. ***బసవపురాణము*** (పరిష్కర్త : వేటూరి ప్రభాకర శాస్త్రి), తిరుపతి : శ్రీవేటూరి ప్రభాకరశాస్త్రి వ్మాయపీఠం, తిరుమల తిరుపతి దేవస్థానములు, 2013.

6. సి.నారాయణరెడ్డి. ***ఆధునికాంధ్రకవిత్వము-సంప్రదాయములు : ప్రయోగములు***, హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989. (ప్రథమ ముద్రణ: 1967)

7. Carl Olson (2007), The Many Colors of Hinduism: A Thematic-historical Introduction, Rutgers University Press, ISBN 978-0813540689, Pages 239–240

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2023

# పద్యమనోహరం - 40

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**

వరంగల్, ఫోన్ : 994 901 3448



**మరచిపోయిన పదముల మరల వెలసి**
**జారిపోయిన పదముల నేర్చి కూర్చి**
**లుప్త పదజాలమును పునర్వ్యాప్తి జేసి**
**జానుతెనుగు పదమ్ముల చాయలెతిగి**
**స్వీయభాషను లేని శాస్త్రీయ శబ్ద**
**పరికరమ్ము సాంకేతిక వాచకములు**
**పారిభాషిక పదసృష్టి బరగజేసి**
**సంగ్రహింపుడు నూత్న కోశమ్ములందు**

**అన్యభాషలలోనికి అనువదించి**
**అన్యభాషా ప్రసిద్ధి కావ్యస్రవంతి**
**తెలుగు వాఙ్మయ జలధిలో వెచ్చి కలిపి**
**తెనుగు సారస్వతమును విస్తృతమొనర్చు**

ప్రతి తెలుగు భాషాభిమాని ఆలోచించి భాషా విస్తృతికి పాటు పడాల్సిన అవసరాన్ని చెప్పిన ఈ పద్యం డా. పల్లా దుర్గయ్య గారు రచించిన 'పాలవెల్లి' కావ్య సంపుటిలోనిది.

ఏ భాషకైనా పదసంపదే ప్రధానం. పద సంపద పెరిగే ప్రయత్నం చేయవలసిన వారు కూడా ఆ భాషా వ్యవహర్తలే, వారి ప్రయోగాల్లోని పదజాలాన్ని కవులు, రచయితలు, తమ తమ రచనల్లో ఉపయోగించుకుని భాషా విస్తరణకు తోడ్పడాలి. ఈ విషయాన్నే డా. దుర్గయ్య గారు తమ పద్యంలో బోధించారు.

తెలుగు సాహితీ ప్రేమికులు, తెలుగు భాషాభిమానులు అయిన ముందుగా చేయవలసిన పని తమను తాము సరిదిద్దుకొని, తమ భాషను, సంస్కృతిని కూడా సవరించుకోవాలి. మరచిపోయిన పదాలను మరోసారి జ్ఞాపకం చేసుకొని ఆయా పదాలను అవసరాన్ని బట్టి ఏర్చి కూర్చుకోవాలి. భాషకు అవసరమున్నా, కొన్ని పదాలు లోపిస్తూ ఉంటాయి. అటువంటి లుప్తమయిన పద సమూహాన్ని గురించి వాటికి పునర్వ్యాప్తి కలిగించే ప్రయత్నం చెయ్యాలి. ఒక్కోసారి తాము మాట్లాడే భాషలో శాస్త్రీయ శబ్దజాలం సరిపోకపోతే వాటి సాంకేతికతను దృష్టిలో పెట్టుకొని క్రొంగొత్త శబ్దాలను సిద్ధం చెయ్యాలి. ఒక్కోసారి భాషకు, పారిభాషిక పదాల కొఱత ఉంటుంది. దాన్ని పూర్తిచేసి ఈ పారిభాషిక పదాలను సృజించి వాటితో కొత్త పదకోశాలను కూడా సిద్ధం చేసుకోవాలి. మనకు అవసరమైన అన్యభాషా పదాలను కూడా గుర్తించి వాటిని తెలుగు భాషలోకి అనువదించి, కొత్తపదాలతో తెలుగు భాషలోని కావ్యస్రవంతిని మరింత దూరం సారించే ప్రయత్నం చేసి తెలుగు భాషా సముద్రంతో కలపాలి. దానివల్లనే తెలుగు సారస్వతి విస్తృతి సాధ్యమవుతుంది.

ఇంత వివరంగా, ఇంత స్పష్టంగా తెలుగు భాషా వ్యవహర్తలకు, సాహితీవేత్తలకు తెలియజెప్పిన ఈ పద్యం కేవలం తెలుగు భాషకే కాదు, ఏ భాషకైన ఇది వర్తిస్తుంది. అంతేకాదు, ఏ భాషైనా నిలువ నీరు కాదు, ప్రతిభాషా ఒక ప్రవాహమే. ప్రవాహంలో ఎప్పుడు ఉన్న నీటితో కొత్తనీరు కలుస్తుంటుంది. అప్పుడే ఆ ప్రవాహం సజీవంగా ఉంటుంది. భాష కూడా అంతే. అవసరాన్ని బట్టి నూతన పద సంచయ వ్యాప్తి వల్లనే అది విస్తృతమౌతుందన్న సత్యాన్ని డా. పల్లావారు తెలియజేశారు. మరో విషయమేమంటే ఏ భాషకైనా భాషాభివృద్ధికి అన్యభాషల సాయం కూడా ఉండాలని, అనువాదాల వల్ల ఆ లోటు పూడ్చబడుతుందని, కాలానుగుణంగా సాంకేతిక పదాలను, ఆ పారిభాషిక పదాలను కూడా ఇనుమడింపజేసుకోవాలని మనమీదే ఆ బాధ్యత ఉందన్న నిజాన్ని సూటిగా చెప్పారు. "గంగిరెద్దు" కవిగా సుప్రసిద్ధులై తెలుగువారి హృదయాల్లో స్థిరమైన స్థానాన్ని పొందిన డా. పల్లా దుర్గయ్యగారికి మాతృభాషా వ్యాప్తి పట్ల నున్న మక్కువకు ఈ పద్యమే అక్షరసాక్ష్యం.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (13) హైదరాబాద్ మార్చి : 2023

బందారం కథలు
16

# బాకీ

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



ఊదుబత్తీలు ముట్టించి కొంచెం అంటుకోగానే చేత్తో ఆర్పేశాడు బాలయ్యసేటు. సువాసన చిమ్ముతున్న ఊదుబత్తీల పొగను లక్ష్మీదేవి వైపు మళ్ళిస్తూ చుట్టూ తిప్పి లక్ష్మీదేవి పటానికి ఊదుబత్తీల కొసలు చెక్కాడు. కళ్లు మూసుకొని భక్తి శ్రద్ధలు ఉట్టిపడుతుండగా లక్ష్మీదేవికి దండం పెట్టి ఏదో ప్రార్థించాడు. చెంపలు వేసుకుంటూ కళ్లు తెరచి చూసేసరికి వాకిట్లో చంద్రయ్య దంపతులు? నిలుచోని కనిపించారు. గద్దెలాంటి ఆసనం మీద దులుపుకుని కూచున్నాడు సేటు.

**"వారీ, సెంద్రయ్యా, పొద్దుగాల్ల పొద్దుగాల్నే ఇద్దరికిద్దరు కట్ట కట్టుకొని వొచ్చింద్రేం మతలవురా".**

సేటు ప్రశ్నకు జవాబు చెప్పుమని చంద్రయ్య లచ్చవ్వను పొడిస్తే లచ్చవ్వ చంద్రయ్యను పొడిచింది. ఇద్దరు చెప్పటానికి ఇబ్బంది పడుతున్నట్టు బాలయ్యసేటుకు అర్థమైంది.

**"కాని కాలమొచ్చెగద సావుకారి. ఏం జెయ్యాల్నో మన పనే పట్టుకుంట వచ్చె. కష్టకాలంల దేవుని లెక్క ఆదుకునేది నువ్వే గద పని వెట్టుకోని వొచ్చినం".**

"సెప్పు బిడ్డా, సెప్తెనే గద తెలిసేది. ఎనక ముందాడితె ఎట్ల?" లచ్చవ్వ కొంగు చేతుల పట్టుకొని చెప్పసాగింది.

**"నరజల్మ తాసిలి జల్మ. నాశనగాలం. కరువుల వాంతి జేసుకున్నట్టు కర్సు మీన కర్సు. పెంమీదికెల్లి పొయిల పడ్డట్టు ఒకటి సుతులాయించుకోకముందే ఇంకోటి వచ్చి మీద పడవట్టె. ఏం జెప్పాలె సావుకారి. ఇగో... నాతాన ఉన్నది గీ పుస్తె మట్టెలే. గంటె పుస్తె ఇయ్యమని మీ సెంద్రయ్య లొల్లి. నిన్నట్నుంచి ఒకటే లొల్లి. ఏం జెయ్యాలె. గంటె పుస్తలు పెట్టుకోని యాభై రూపాలియ్యమని అడిగెతందుకొచ్చినం".**

**"గంటె పుస్తెలు పెట్టుకున్న పేరు నాకెందుకే. గిప్పుడేమన్న మిద్దెలు భవంతులు గట్టేదున్నదా..."**

**"గట్లంటె ఎట్ల సావుకారి. మా సావుకారివి నువ్వేనాయె. కుదువ గాకపోతే ఖరీదు జేసుకున్నా సరే"** అన్నాడు చంద్రయ్య.

**"గా పేరు మాత్రం మంచదా సెంద్రయ్యా. అయినా గంత కష్టం ఏమొచ్చింది బిడ్డా".**

**"కష్టమంటె కష్టమా... నాశెనగాలం... మీకు తెలువదా... పెద్ద పెద్దొల్లు ఏ మతలవు అయినా మీకే ముందుగాల దెలుస్తది గద"** అని కొంచెంసేపు ఆగి లచ్చవ్వ మళ్లా అందుకున్నది. **"ఊరు కాలిపోతదట గద సావుకారి. గప్పుడు రజాకారోడు ఏడ్పిచ్చుకోని తిన్నడు. దొరోడు కాల్సుకోని తిన్నడు. ఇప్పుడు మెరికోడట కద. ఏందో – ఇడిసి పెట్టిండట మొగులు మీదికి. ఇసగోలం అట ఇసగోలం. అది కూల్తదట గద. కూల్తె .... ఊర్లు గాలి పోతయట. మన సుట్టుపక్కల ఊర్లన్ని కాలిపోతయట. ఇండ్లు మనుసులు, గోజలు ఎవ్వుండయట. మా యిండ్లల్ల అందరు మాట్లాడుకుంటంద్రు. మీదాంక రాలేదా. రేడియల గూడ జెప్పింద్రట".**

**"దానికి మనమేం జేస్తమే పిచ్చిదానా... మనమాపుతె ఆగుతదా ఏంది? అమెరికోడు ఏదో వదిలిండట నిజమే. అందరితోని మనం అందరు వోతె మనం పోతం. దేవుడు రాసింది తప్పుతదా..."** అన్నాడు బాలయ్య.

**"సావుకారీ, గదంత మాకు అర్థం గాదు గని – గిది ఖరీదు జేసుకొని యాభై రూపాయిలియ్యి. నీ కాళ్లు మొక్తం"** అని కొంగు ముడి విప్పి పుస్తె తీసి బాలయ్య సేటు ముందట పెట్టింది లచ్చవ్వ. సేటు ఏమీ మాట్లాడలేదు.

**"అయ్యా, దయుంచుండ్రి. కాదనకుండ్రి"** ఇద్దరు సేటు కాళ్లు మొక్కుతున్నట్టుగా కడపకు మొక్కారు.

**"అది గాదురా, నాకు తెలవక అడుగుత. ఊరు కాలిపోత దనుకుందాం. మనం సుత కాలిపోతమనుకుందాం. గిప్పుడు పైసలెందుకురా, రూపాయలాదుకుంటయా... కాలిపోకుంట కాపాడుతయా...."**

**"ఆదుకోవు బాంచెన్. పొయ్యేముందట జీవి తుర్తిగ పోవలె గద. జీవికి తుర్తి జెయ్యాలెనని మా ఇండ్లల్ల మాట్లాడుకున్నరు. ఆలోశెన జేసింగ్రు. బతికినంతకాలం కష్టాలేనాయె. తిన్నది లేదు, తాగింది లేదు. సుకపడ్డది లేదు. సచ్చేముందట గుడ కష్టాలేనా? గిన్నేండ్లల్ల ఎన్నడు పుర్సత్ లేదు. ఈ నాల్రోజులన్న పుర్సత్‌గుందామని మా వోళ్లు కట్టుకిచ్చింగ్రు. బిడ్డలొస్తరు. సుట్టాలొస్తరు. సియ్యకో... లొట్టికో... బట్టకో... బాతకో... ఎన్నుంటయి. మీరన్నట్టే... అందరితోని మేము.. మా వాడల నాసి ఉండొద్దు. పోతెపాయె. బంగారం మనిషి కంటె ఎక్కువనా...."** ఉన్నదున్నట్టు కుల్లంకుల్ల మాట్లాడేసరికి బాలయ్యకు ఎక్కడెక్కడో కదిలింది. **"తనది మాత్రం ఏం జీవితం? చిన్నప్పటి నుంచి జోకుడు జోకుడు. లెక్కవెట్టుడు, కూడవెట్టుడు... పైసలు... బంగారం... వంకర టింకర వడ్డీలు... వసూళ్లు. సంసారం, పోరగాండ్లు, దుకాణం, సరుకులు, ఉరుకులు, పరుగులు. పుర్సతేది? నచ్చిన బట్ట గట్టిందున్నదా. నచ్చిన తిండి దిన్నదున్నదా. గోలుసేసిందున్నదా? ఎవలకొరకీ సంపాదన... వాళ్లన్నట్టు ఊరు గాలిపోతే... తాను గాలిపోతే... బంగారమక్క రొస్తదా. రూపాయలక్కరకొస్తయా... పుట్టింది పుకారేనా... సావు ముంచుకొస్తున్నదా. మందిని ముంచిండా. ముంచి బావుకున్న దేమున్నది. తనకు మాత్రం పేరొద్దా... సుకమొద్దా... సంబుర మొద్దా... తృప్తివొద్దా... సావు..."** బాలయ్యసేటు ఆలోచనలు కూడా అటువైపు ఆకర్షించాయి.

**"వారీ... సెంద్రయ్య... మీలచ్చవ్వ పుస్తె ఖరీదు జేసుకోని నేను పాపం మూట గట్టుకునే పనెందుకు? వచ్చిన పేరు ఎట్లా తప్పది. ఊరు కాలితే అందరం పోతం. బాకి లేదు బీకి లేదు. బతికితే యాదికి పెట్టుకోని తీర్పుంగ్రి. ఇప్పుడైతే ఉత్తగనే ఇస్త. యాబై రూపాయలు తీసుకోంగ్రి. దుకాండ్ల ఉత్తగ గాలి పొయ్యి బూడిదైతయి. అక్కెరకున్న సరుకులు గూడ తీస్కపోంగ్రి."**

బాలయ్యసేటు జ్ఞానోదయమైనట్టు మాట్లాడాడు. గల్లాపెట్టె తెరిచి చూశాడు. లోపలికి వెళ్ళి కట్టె బీరువాలోంచి యాబై రూపాయలు తెచ్చి లచ్చవ్వ కొంగులో వేశాడు.

మధ్యాహ్నం వేళకి ఊరంటుకుంటుందన్న వార్త ఊరంతా అంటుకున్నది. వాడనుంచి వాడ, మనిషి నుంచి మనిషి, నోటినుంచి నోరు... ముంచుకొస్తున్న ముప్పు ఊరంతటినీ భయపెట్టింది. బాటలన్నీ భయంతో వణికిపోతున్నాయి. అన్ని భయాలు వేరు, ప్రాణభయం వేరు. పుడితే ఒక్కటి. చస్తే రెండు. నిజమే కావచ్చు. పుట్టుకకూ చావుకూ నడుమ అనేకమున్నాయి. అనేకముంటాయి. కష్టం, సుఖం, దుఃఖం, ఆనందం, వయసు, శోకులు, ముచ్చట, ఆట, పాట, సంపాదన, సంసారం, బంధాలు, బంధుత్వాలు, భ్రమలు, ప్రేమలు, ఆరాటాలు, ఆందోళనలు, ఆయాసాలు, అనుభవాలు, అనుమానాలు, భావాలు, భయాలు ఎన్నుంటాయి. అన్నింటికి చివరచూపు. ఆ చావుముందే వొచ్చేస్తుందంటే ఎంత భయం. తెలియకుండా హఠాత్తుగా వొచ్చే చావు నయం. తెలిసివొస్తుందని తెలిపి వొత్తిడి పెట్టి క్షణక్షణం వొణికించే చావు మరీ భయానకం. అందునా – ఊరు మొత్తం కాలిపోతుందంటే... ఊర్లకూర్లే కాలిపోబోతున్నాయంటే ఎంత భయాందోళన. భయాందోళనలో బందారం కలకల పడుతున్నది. సాయంత్రం పంచాయతి రేడియోలో ప్రాంతీయ వార్తలు విన్న తర్వాత మరింత వొణికి పోతున్నది.

స్కైలాబే. అమెరికా అంతరిక్ష ప్రయోగం. విజ్ఞానశాస్త్ర నిర్మాణం. అంచనాలు తారుమారై వేలముక్కలై భూమి తాకబోతున్నదన్న వార్త అతలాకుతలం చేసింది. స్కైలాబ్ ఎన్ని ముక్కలైందో గాని – మనిషి గుండె ముక్కలు ముక్కలై రోదిస్తున్నది. ఎన్ని ఊర్లు ఎంతమంది ఎన్ని తీర్లు ముక్కలయ్యారో... దుఃఖమయ్యారో... భయంతో ఒక్కటయ్యారో... దానికి ఊరు పెట్టిన పేరు విషగోళం.

మూడు బాటల దగ్గర ఏ ఇద్దరు కలిసినా అదే ముచ్చట. ఏ అరుగుమీద నలుగురు కూచున్నా అదే ముచ్చట. ముసలివాళ్లు పడుచువాళ్లు. పిల్లలు, ఆడవాళ్లు, మగవాళ్లు. ఈ వాడ.. ఆ వాడ.. అంతటా అదే భయం. మంటలా మండుతున్న భయం. చావు వెంటబడి తరుముకొస్తున్న భయం. భయంలో ఒక మెరుపు.

ఇద్దరు పిల్లల్ని వెంటబెట్టుకొని వాకిట్లో అడుగుపెట్టింది రాజవ్వ. అలికిడి కాగానే పొయ్యి దగ్గరి నుంచి లేచొచ్చింది లచ్చవ్వ. **"వొచ్చినవా అవ్వ"** కొంగుతో కళ్లు తుడుచుకుంటూ అడిగింది. అప్పటికి రాజవ్వ కళ్లు తడిసిపొయ్యాయి. ఒకరి నడుము చుట్టూ ఒకరు చెయ్యి వేసుకొని దగ్గరయ్యారు. అంతే ఏడుపు పొంగింది. ఒకరి మీదొకరు పడి ఏడ్చారు. **"ఏమి కష్టమొచ్చిందే బిడ్డా... ఎవని కన్ను మండిందే అవ్వా. దేవుడు సూసి ఓర్వలేదే బిడ్డా.... రెక్కల కష్టంతోని బతికినం గాదే అవ్వా... పానమోలె ఉన్నం కాదే... పానానికే కష్టమొచ్చే...."** ఏడుస్తున్నంత సేపు వలపోసుకుంటూ ఏడ్చారు. రాజవ్వ వచ్చినట్టున్నదని ఇరుగు పొరుగు ఆడవాళ్లు వొచ్చారు. వాళ్ల మీద పడి రాజవ్వ ఏడ్చింది. వాళ్లంతా శోకం పెట్టి ఏడ్చారు. మళ్లా వాళ్లే ఓదార్చుకున్నారు. చీదుకున్నారు. కొంగు కొసల్తో కండ్లు తుడుచుకున్నారు.

శియ్యకూర పట్టుకొని చంద్రయ్య చేరుకున్నాడు. పొయ్యి దగ్గర పెట్టి వచ్చి బిడ్డను దగ్గరకు తీసుకున్నాడు. కండ్లకు నీళ్లు తీసుకున్నాడు. **"అందర్ని చేస్తననుకోలేదే అయ్య. అట్లనే పోతె ఆగమైదునే అయ్య".** చంద్రయ్య మనసులో దుఃఖం అణుచుకోలేక బయటకు ఏడ్చాడు. తల్లీ తాత, ఏడుస్తుంటే పిల్లలు ఏడ్చారు. చంద్రయ్య అంతలోనే అదుపు చేసుకొని పిల్లలను, బిడ్డను ఊకుంచాడు. నెత్తిమీది రుమాలు తీసి బిడ్డ కన్నీళ్లు తుడిచాడు.

జాలాట్లకు తీసుకపొయ్యి కాళ్లకు నీళ్లిచ్చాడు. రాజవ్వ కడుక్కున్నది. అవ్వకు సాయంగా పొయ్యి దగ్గరకు చేరింది.

అంబటాల్లయే సరికి రెండో బిడ్డ చేరుకున్నది. అక్కాచెల్లెండ్లు ఆలింగనం చేసుకొని ఏడ్చారు. తల్లి కూడా కలిసింది. ముగ్గురి ఏడుపుకు మూలంతా ఏడ్చింది. అల్లుండ్లు రానందుకు విచారించినా ఆడబిడ్డలు వచ్చినందుకు ఇల్లు పండుగలా ఉన్నది. పాలేరు పనులు పూర్తి చేసుకొని ఇద్దరు కొడుకులు ఇల్లు చేరుకున్నారు. కుటుంబం కలుసుకోవటమే పండుగ. కలిసి తినటమే పెద్ద పండుగ. ఆ వాడకు పెద్దకూర తిండి పెద్ద పండుగ. ఆ ఊరు – వాడ వాడ అందరి ఇండ్లల్లో అదే సంతోషం. అదే ఏడుపు. అదే భయం. అదే ఊరట. చావబోయే భయం. కలిసి చావబోతున్నామన్న ఊరట. ఎవరెవరిని చూడాలనుకున్నారో వాళ్లను పిలుచుకున్నరు. కలుసుకున్నరు. పెద్దల్ని తలచుకున్నరు. దేవుళ్లని కొలుచుకున్నరు. కలిగిన వాళ్లు కల్లు తెచ్చుకున్నరు.

భయం భయంగా రాత్రి గడిచింది. తెగింపుకు సిద్ధపడినట్లు పొద్దు పొడిచింది. **'తెగిన బొక్కెన నూతిల దాకా'** అదొక ధీమా. బాకీ రాసుకోకుండా బాలయ్య సావుకారి సరుకులిస్తున్నాడని వార్త పొక్కింది. బాలయ్య సేటు దుకాణం వైపు బాట సంబురపడుతున్నది.

గుడ్డంలో గడ్డి మేస్తున్న గొర్లకు ముంచుకొస్తున్న ప్రమాదం తెలియదు. గొల్లలకు విషయం తెలిసినా ఏం చేయాలో తెలియలేదు. అన్నిటికి సిద్ధపడి మంద కాస్తున్నారు. ఊర్లో ఏ వాడకా వాడల నుంచి బదులకున్న గుంపులు బయలుదేరాయి. మంద పెద్దలతో బేరసారాలు నడుస్తున్నాయి. బయాన ఇచ్చినా ఇవ్వకున్నా ఉద్దెరకు ఉదారగా గొర్లూ, మేకలూ ఇవ్వటానికి ఒప్పుకోవటం చిత్రం. అదేదో కూలిపడితే అంతా కాలిపోతే గొర్లుమాత్రం ఉంటాయా? తాము మాత్రం ఉంటారా? మందల నుంచి గొర్లు ఒక్కటొక్కటి బేరమై పోతున్నాయి. అన్ని వాడల్లో గొర్లు కోసి కుప్పలేస్తున్నారు. ఏదో ఒక పద్ధతిలో ఇంటింటికీ మాంసం చేరున్నది. చాలా వంటిళ్ల నుంచి మాంసం వాసన గుప్పుమంటున్నది. అయ్యవార్ల, సావుకార్ల ఇండ్లల నుంచి పిండివంటల వాసన గుబాళిస్తున్నది.

సమయం కాకపోయినా గౌడుల మీద ఒత్తిడి పెరుగుతున్నది. తాగే మనుషులే ఉండకపోతే తాటిచెట్లకు కల్లు పారి ఎందుకు? అసలు తాళ్లు మాత్రం ఉంటాయా. కల్లు గీసే గౌడులే ఉండరాయె. పానాలే పోంగ పైసలేం జేసుకోను. పారింది పారినట్టు కుండల్లో, లొట్లల్లో నిండి కల్లు కదిపిపోతున్నది. తాగితే ఐరాని గౌడులు కూడా ఎన్నడూ లేనిది కల్లు రుచి చూసి కదిలిపోతున్నారు. మధ్యాహ్నానికే తాగి తిని తేన్చింది ఊరు. పట్నం మందుతో కొందరు, ప్రకృతి పానకంతో కొందరు, సర్కారు సారాయితో కొందరు పరవశించి పోతున్నారు. ఎక్కువైనవాళ్లు మాత్రం ఎక్కువ తక్కువ మాట్లాడుతున్నారు.

బరిసె కట్టె పట్టుకొని పెద్ద మస్కూరు ఊరంతా చెక్కర్లు కొడుతున్నాడు. అన్ని పనులు బందువెట్టిండు. ఆడాళ్లు అరుగుల మీద ముచ్చట్లు పెడుతున్నరు. పోరగాండ్లు బజార్లలో ఆడుతున్నరు. ముదురు ముసలివాళ్లు రాగమెత్తి పాడుతున్నరు. దాని మీద పనులు బందు. వాడ కొసనుంచి పాట తేలి వస్తున్నది.

**"ఇప్పుడప్పుడనగ రాదు – ఎప్పుడో ఏ వేళకో మరి – గుప్పు గుప్పున దాటి ఏడు గుర్రపడుగులు ఏరుపడును. ఆకాశము ఎర్రనవును. ఆరు మతములు ఒక్కటవును – లోకమందున జనులు అందరు నీరు నిప్పున మునిగిపోదురు"** సీతయ్య నోట్లో వీరబ్రహ్మం పలుకుతున్నాడు.

తాగి జోగుతున్నవాళ్లు కొందరు. ఆ వాడా ఈ వాడా తేడా లేక ధూలా ఆడుతున్నారు. తేడా విడిచి మరికొందరు ఒకళ్ల మీద ఒకళు పడి ఏడుస్తున్నరు. **"ఏమి కష్టమొచ్చెరా తమ్మి, నాకు నువ్వు నీకు నేనూ ఇగ కానరాముర తమ్మీ"** అని లయబద్ధంగా కొందరేడిస్తే **"ఊరు ఎవడు పొందిచ్చిండో, వాని కాదు గాల. కాలిపొయ్యే ఊరు ఎట్ల కాలవెట్టిండో"** అని శాపనార్థాలు పెడుతున్నారు కొందరు

**'వీర భోగ వసంతరాయలు వస్తరు. ఊర్లకూర్లే అంటు వడుతయని వీరబ్రహ్మం చెప్పిన సత్యం ఇదే'** అని తంబూర మీటుతున్నాడు పోశయ్య. పంచాయతి రేడియో దగ్గర వాదించుకుంటున్నారు కొందరు అరాకొరా చదివిన యువకులు. అనుమాండ్ల అరుగుమీద కొందరు పేకాడుతున్నారు. అక్కడ ఆడొద్దని వారిస్తున్నాడు పంతులు.

పాపయ్య సావుకారి ఇంటిముందు భజన జోరుగా నడుస్తున్నది. ఎప్పటిలాగా మళ్లా తెల్లారింది. ఆరోజే స్కైలాబ్ కూలేది. ఏ క్షణమైనా కూలి పడొచ్చు. ఏ మనిషైనా మంటల్లో మాడిపోవచ్చు. తమ ఊరికి ఆఖరి రోజు. తమ బతుకులకు ఆఖరి గడియలు.

కొరికలు తీరకుండా చనిపోతే దయ్యాలయ్యితారట. ఇంత బతుకు బతికి దయ్యాలు గావాల్సిందేనా? ఛీ – ఛీ – అదో చావు.

ఊరికి నాలుగు దిక్కుల పొలిమేరల్లో గుంజలు పాతి తోరణాలు కట్టారు. దార్లో నిమ్మకాయలు పెట్టారు. పంతులు మంత్రాలు చదివాడు. అవి ఆపుతాయా – పైనించి కదా పడేది.

చంద్రయ్య పెళ్ళిళ్లకు తొడుక్కునే అంగీ తొడుక్కున్నాడు. రుమాలు సెల్లాలాగా మెడలో వేసుకున్నాడు. తెల్లటి ధోతి – పదే పదే బజార్లోకి వెళ్లి వస్తున్నాడు. లచ్చవ్వ మంచి చీర కట్టుకున్నది. కూతుర్లకు చీరలు కొనిపెట్టింది. వీరేశం సేటుకేదో మెరిసింది. మనసు పడ్డా ముట్టుకోవలసి వస్తుందని ఎన్నోరోజులునుంచి అణుచుకుంటున్నాడు. మసకపడ్డ తర్వాత కాంతవ్వను శివుని గుడి దగ్గర కలుసుకున్నాడు. చంద్రారెడ్డి విస్కీబాటిల్ పట్టుకొని భాగ్యమ్మ ఇంటికి వెళ్లాడు. బాలయ్య సావుకారి సందుక తెరిచి పట్టుబట్టలు కట్టుకున్నాడు. మెడలో

బంగారు గొలుసు వేసుకున్నాడు. హుషారుగా పలుకరిస్తూ ఊరు తిరిగాడు. ఐదారుగురిని కూచోపెట్టుకొని కల్లు పంచిస్తూ అనుభవం చెపుతున్నాడు బాలిరెడ్డి.

ఆడపిల్లలు కొందరు తలలో పూలు పెట్టుకున్న జడులు ఊగుతుంటే కోలాటమాడుతున్నారు. పక్కన కొందరు యువకులు కబడ్డీలో పోటీ పడుతున్నారు. అవతలి జట్టును కొట్టి వచ్చినప్పుడల్లా యువతుల వైపు చూస్తున్నారు.

అప్పటికే లింగం సేటు ఎట్లయినా బతుకాలని, తనొక్కడన్నా తప్పించుకోవాలని భార్యా పిల్లలకు చెప్పకుండా వెళ్లి గుట్ట సొరికెలో దాక్కున్నాడు. అటో ఇటో చీకటి పడేదాకా తట్టుకున్నాడు. చిమ్మచీకటి కాగానే చిమ్మట్లు అదేపనిగా అరుస్తుంటే భయమైంది. పెద్ద పిట్ట కూయటం మరీ ప్రమాదంగా తోచింది. **'ఒకవేళ విషగోళం సొరికె మీదనే పడితే ఎట్లా? శవం కూడా అనాథగా పోదా – కూలి పడితె ఒంటి దు:ఖం కాదా?'** ఆలోచిస్తుంటే తప్పు చేసినట్టనిపించింది. బతికినా చచ్చినా ఊరుతోనే ఉండాలనిపించింది. ఇన్ని దినాలు ఊరితో ఉండి, ఊరి మనుషులతోటి బతికి ఇప్పుడు తనమటుకు దోస్తులతో ఆపతైనా సంపతైనా పంచుకోవాలె గద, పంచుకున్నప్పుడే గద దృష్టి. ఆనందం. అదే గద మనిషి పుట్టుకకు అర్థం.

బయటికొచ్చాడు లింగం సేటు. ఇంటికి చేరుకోగానే ఊరట. అంత చావు భయంలోనూ మురిపెం. గట్టిగా హత్తుకొని ఏడ్చింది బిడ్డ.

బిక్కు బిక్కుమంటూ దాటుతున్నాయి క్షణాలు. ఎవరి భయం వాళ్లదే. ఎవరి ధైర్యం వాళ్లదే. భజన జోరుగా సాగుతున్నది. **"నిలువదు నిలువదు కాయం. ఇది నిమిషం లోపల మాయం...."** ప్రతివాడకూ ఓపికున్నవాళ్లు కాపలా కాస్తున్నారు. మాట, ముచ్చట, ఆట.

రేడియో స్పెషల్ బులిటన్ వార్తలు వార్త విన్న బాలిరెడ్డి వాడ వాడకు సమాచారం చేరవేశాడు. మస్కూరు విసురుగా తిరుగుతున్నడు. స్కైలాబ్ శకలాలు, శకలాలుగా విడిపోయి సముద్రంలో పడిపోయింది. ప్రమాదం తప్పిపోయింది. భయం పోయింది. ఊరు బతుకు తీపి ముందట చావు ఓడిపోయింది.

చావు ముచ్చట నుండి బయటపడినప్పుడు ఊరి జనాలకు సంబురం. పట్టరాని ఆనందం, ఉత్సాహం, కేరింతలు, విజయహాసాలు. అంతే మళ్ళా ఆలింగనాలు, మళ్ళా ముచ్చట్లు, ఈసారి ఇంటింటికి తోరణాలు, మురిపాలు, మళ్లా బాకి, మళ్లా గొర్లు, మళ్లా కల్లు, మళ్లా పాటలు, మళ్లా ధూలా మరి అదే ఊరు.

## STATEMENT OF OWNERSHIP & OTHER PARTICULARS ABOUT "MUSI" TELUGU MONTHLY FORM IV (See Rule 8)

| | |
|---|---|
| **1.** Place of Publication | Hyderabad |
| **2.** Periodicity of its Publication | Monthly |
| **3.** Printer's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | - |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **4.** Publisher's Name | **B. Ananta Laxmi** |
| a) Whether citizen of India? | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderabad-500027 |
| **5.** Editor's Name | **Dr. Sagi Kamalakara Sharma** |
| a) Whether citizen of India | Yes |
| b) if foreigner, state the country of origin | |
| address | 2-2-1109/BK-LIG-10, Bathukamma kunta, Bagh Amberpet, Hyderabad -500013 (Telangana) |
| **6.** Name and address of individuals who own the Newspapers and partners or share holders holding morethan one percent of the total capital. | **B. Ananta Laxmi** |

I, **B. Ananta Lakxmi,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

*Sd/-*
**B. ANANTA LAXMI**
Publisher

01.03.2023

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5  UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2023

# తెలుగువారి 'ఉగాది' వైశిష్ట్యం

డా. కాకునూరి సూర్యనారాయణ మూర్తి,
అధ్యాపకులు, తెలుగుశాఖ, బి.జె.ఆర్. కళాశాల, ఫోన్ : 9866 542 365

నూట తొంభై అయిదు కోట్ల, యాభై ఎనిమిది లక్షల, ఎనభై అయిదు వేల నూట పదిహేడు సంవత్సరాలకు పూర్వం సృష్టి ప్రారంభమైంది. కాలగణన కూడా ప్రారంభమైంది. అందులో సృష్టి కారకుడైన బ్రహ్మదేవుడి ఆయువులో సగకాలం కూడా అప్పుడే గడిచిపోయింది. ఆయన జీవితంలోని రెండవ భాగంలో మొదటి రోజున, మొదటి ఝాములో మొదటి ముహూర్తంలో ఉన్నాం ఇప్పుడు మనమంతా. మరోవిధంగా చెప్పాలంటే, కృత, త్రేత, ద్వాపర, కలి అనే నాలుగు యుగాలు కలిసి ఒక మహాయుగం అనుకుంటే అందులో ఇరవైఎనిమిదవ మహాయుగంలోని నాల్గవది అయిన కలియుగంలో ఉన్నాం. ఈ కలియుగంలో కూడా ఇప్పటికే అయిదువేల నూట పదిహేడు సంవత్సరాలు గడిచిపోయాయి. ఎన్నో యుగాదులు గడిచాయి. మన్వాదులు నడచాయి. కానీ ఉగాది మాత్రం ఎప్పటికప్పుడు మనకు కొత్తగానే ఉంటుంది. ఉగాది తెలుగువారమైన మనకందరికీ తొలి పండుగ.



### ఉగాది పండుగ పుట్టువు

సృష్ట్యాది ఉగాది. యుగ్మమంటే జంట అని అర్థం. కాలగణనలో రాత్రి పగలు అనే రెండు విభజనలు ఏర్పడ్డరోజు ఉగాది. ఉగస్య ఆది: ఉగాది. 'ఉగ' అంటే నక్షత్రపు నడక. నక్షత్రాల గమనం ప్రారంభం అయినరోజు ఉగాది. సంవత్సరాది అని మనం మరోవిధంగా కూడా పిలుచుకునే పండుగ. ప్రతి సంవత్సరం చైత్రమాసం, శుక్లపక్ష పాడ్యమి నాడు మనం పాటించే పండుగ.

**"చైత్రే మాసి జగద్బ్రహ్మ ససర్జ ప్రథమేహని**
**శుక్లపక్షే సమగ్రంతు తథాసూర్యోదయే సతి"**

అని నిర్ణయసింధుకారుడు ఉగాది ఆరంభాన్ని వర్ణించాడు. సృష్టి ఆరంభం చేయడం కోసం బ్రహ్మ ఎంచుకున్న ముహూర్తం ఇది. ఆయన సృష్ట్యారంభం చేద్దామనుకున్నాడంటే, ముందు ఆయన కూడా, అంతకుపూర్వమే ప్రాదుర్భావమై ఉండాలి. కాలవిభజనతో పాటు ప్రాణి పుట్టువుకు ఆయన సంకల్పం చేసినరోజు చైత్రమాసం, శుద్ధ పాడ్యమి.

మనకు పన్నెండు నెలలున్నాయి. చైత్రం మొదలు ఫాల్గుణం వరకు. చిత్త నక్షత్రం కూడిన పూర్ణిమ ఉన్న కారణంగా ఇది చైత్రమాసం. మరి నక్షత్రాలలో మొదటిది అశ్విని అనుకుంటే, అప్పుడు ఆశ్వయుజమాసం మొదటి నెల కావాలి.

చాంద్రమానం అనుసరించి మనకు చలికాలం పూర్తిగా తొలగి సమశీతోష్ణ కాలమైన వసంత ఋతువు చైత్రంతో ఆరంభం అవుతుంది. ప్రకృతిలో కొత్త జీవం పురుడు పోసుకుంటుంది. జగత్తు అంతా చైతన్యవంతమయ్యే కాలం ఇది. మన బుద్ధి కూడా వికాసం పొందే కాలం ఇది. మనిషి జాతకచక్రం కృత్తికతో వింశోత్తరి గణన ఆరంభం అవుతే చిత్తా నక్షత్రంతో దేహం చైతన్యవంతమవుతుందని ఆయుర్వేదం వర్ణిస్తుంది. అలా చూస్తే చిత్త నక్షత్రం ఉన్న పున్నమరోజు మనిషి దేహంతో పాటు మనసు కూడా పరిపూర్ణమైన చైతన్యంతో ఉట్టిపడుతుంది కనుక, అత్యంత సంతోషప్రదమైన కాలం చైత్రమాసం. అందుకే ఉగాది ఆరు ఋతువుల ఆరంభానికి, ఆరు రుచులతో స్వాగతం పలకడం. మొదటి నెల, మొదటి పక్షం, మొదటి తిథి, మొదటి నక్షత్రం, మొదటి కరణం, మొదటి యోగం జమిలిగా కలిసిన రోజు ఉగాది.

### ఈరోజు ఏం చేయాలి?

"నూతన సంవత్సర కీర్తనాత్ ప్రారంభః – ప్రతి గృహ ధ్వజారోహణం – నింబ పత్రాశనం – సంవత్సర పంచాంగ శ్రవణం – నవరాత్రారంభః" అని పెద్దలు సూచిస్తున్నారు.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (18) హైదరాబాద్ మార్చి : 2023



**1. ప్రతి ఇంట ధ్వజారోహణం :** ధ్వజం అంటే జండా. సంవత్సరం ఆరంభానికి సూచనగా, ఆ సంవత్సరాధిపతికి చెందిన ధ్వజాన్ని ఇంటిపై ఎగురవేయాలి. లేదా కాషాయధ్వజం అయినా ఎగురవేయాలి. నేడు మనం ఇందుకు బదులుగా ఇంటి ముంగిలికి మామిడి తోరణాలు కడుతున్నాం.

**2. తైలాభ్యంగనం :** నువ్వుల నూనెతో శరీరమంతా మర్దన చేసుకొని తలంటుకోవాలి. ఇది మంగళస్నానం అవుతుంది. శరీరంలో చేరిన బద్ధకం తొలిగిపోయి, కొత్త చైతన్యంతో ఆరోగ్యంతో ఉంటాం మనమంతా కూడా. నువ్వులు మనలో వేడి పుట్టిస్తాయి. రక్తప్రసారంలోని హెచ్చుతగ్గుల్ని సరిచేసే శక్తి తైలానికి ఉంది. దేహమంతా మర్దన చేసుకోవడంతో మంచి రాపిడి కలిగి, 'ఓజస్సు' చర్మానికి వచ్చి చేరుతుంది. దాదాపు అన్ని పండుగలలోనూ, తైలాభ్యంగనం తప్పనిసరి. విశేషంగా ఉగాది నాడు మరింత నియమ పూర్వకంగా ఆచరించాలి. మరి మామిడి, నేరేడు, మేడి, జువ్వి అనే అయిదు చెట్ల ఆకులు నీటిలో వేసి ఆ నీటితో స్నానం చేయాలి.

**3. కొత్త బట్టలు ధరించడం :** శరీరంతో పాటు మనసుకు కూడా ఆహ్లాదాన్ని ఇచ్చేవి వస్త్రాలు. "రేవతీస్త్వా" అనే మంత్రంతో కనీసం రెండు వస్త్రాలను ధరించాలి. ఒకటి కట్టుకోవడం, మరోటి కప్పుకోవడం. ఏ సాయంత్రానికో కాకుండా ఉదయమే స్నానం అయిన వెంటనే ధరించాలి. వసనమ అంటే ధరించే దుస్తులు కదా! వాటి వల్లనే మన గౌరవ మర్యాదలు పెరిగేవి. సంతోషంగా, ఉత్సాహంగా ఉండడం కొత్త వస్త్రాల వల్లనే సాధ్యం. ఎవరినైనా సంతోషపెట్టాలంటే వారిని కూర్చుండబెట్టి వస్త్రాలు ఇస్తే చాలు అంటు మన పెద్దలు.

**4. ఉగాది పచ్చడి తినడం :**

**"శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ**
**సర్వారిష్ట వినాశంచ నింబ కందళ భక్షణం"**

వేప, బెల్లం తింటే శరీరం వజ్ర సమానమౌతుందని సంప్రదాయం చెప్తుంది. తీపి, పులుపు, కారం, చేదు, వగరు, ఉప్పు కలిపి ఆరు రుచులలో సిద్ధం చేసుకొనే ప్రత్యేక పచ్చడి ఇది.

కొత్త బెల్లం జీర్ణకారి అలాగే ఆకలి కలిగిస్తుంది. రుచి మట్టుకు తీపి. మనలో పెరిగిన వాతాన్ని చింతపండు పోగొడుతుంది. రుచికి పులుపు. శ్లేష్మాన్ని నియంత్రించే మిరియాలపొడి శరీరంలో చేరిన దుష్ట క్రిముల్ని నాశనం చేస్తుంది. కారం రుచిని అందిస్తుంది. వసంతకాలంలో లభించిన పండు మామిడి. ఇది కాయరూపంలో ఉన్నప్పుడు కొంత ఒగరు రుచితో, నోటిలో లాలాజలాన్ని పుట్టించి జీర్ణక్రియకు తోడ్పడుతుంది. పండ్లలో మామిడి రారాజు. పిత్త లక్షణాన్ని నియంత్రించి, శరీరంలోని కండరాలకు, చర్మానికి బిగువు నిచ్చే వేప చేదు రుచిని ఇస్తే, ఇక చివరగా ఉప్పు ఎముకలకు బలాన్నిచ్చి అన్ని రుచులనూ (అయిదింటిని) ఒకటిగా మార్చి, ఆరవదిగా రుచి అన్న పదానికి పరిపూర్ణార్థాన్నిస్తుంది. అలవాటులో మట్టుకు వేపపువ్వు, బెల్లం, చింతపండు, మామిడి, వీటికి మిరియాల పొడి, ఉప్పు ఆరు రుచులుగా పచ్చడిని సిద్ధం చేయడం అలవాటులో ఉంది. వీటితో పాటు గసగసాలు, కొబ్బరికొరు, మరికొన్ని మధుర మైన పలుకులను (సారపప్పు, కాజు వంటివి) కూడా వేయడం గమనిస్తున్నాం. వ్యాధులేవీ దరి చేరకుండా తీసుకునే టీకా వంటిది ఉగాది పచ్చడి.

**5. పంచాంగ శ్రవణం :** తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే అయిదింటినీ కలిపి పంచాంగం అంటాం. ఈ ఒక్క ఉగాది నాడు మాత్రమే కాకుండా ప్రతిరోజూ ఉదయం మనం ఈ అయిదింటిని గురించి తెలుసుకోవాలి. తిథి శ్రేయస్సును, వారం ఆయువును, నక్షత్రం పుణ్యాన్ని, యోగం ఆరోగ్యాన్ని ఇస్తే కరణం మన తలపెట్టిన ప్రతి పని సఫలం అయ్యేందుకు తోడ్పడుతుంది.

అలాగే పంచాంగ పఠనం అంటే సంవత్సర ప్రణాళిక అనాలి. ఉగాది నాడు మన అదృష్టం కన్నా ఈ సంవత్సరపు మన ఫలితాలు ఎలా ఉన్నాయో తెలిస్తే వాటికి అనుగుణంగా మనం మన వార్షిక ప్రణాళికను తయారు చేసుకోవచ్చు. వర్షకార్తె ప్రవేశాదులు, వాతావరణ సూచనలు, రాబోయే కాలాలలో జరగబోయే శుభాశుభాలు, ఉత్పాతాలు, వర్షాభావాదులు అన్నీ తెలుసుకోవడం ద్వారా పరిస్థితులకు తగినట్లుగా మనం ఉండవచ్చు.

**"ప్రవర్తయామాస తథా కాలస్య గణనామపి**
**గ్రహాన్రాశీనృతూన్ మాసాన్ తథా సంవత్సరాధిపాన్"**

ప్రతి సంవత్సరానికి ఒక అధినాయకుడు, రాజు, మంత్రి, తదితర నవనాయకులు ఉంటారు. వారందరి గురించి తెలుసుకోవాలి. కష్టాలొస్తున్నాయనుకుంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విజయ పరంపరలున్నాయంటే పొంగిపోకుండా స్థిరంగా ఉండాలి. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ అని ఉంటే, సంతోషించాలి.

ఎందుకంటే మనచేత ఖర్చు పెట్టించే సంకల్పం చేసిన కాలం ఆదాయాన్ని కూడా ఏదో రకంగా సమకూరుస్తుంది. అలాగే ఆదాయం అధికం అవుతే మరొకరికి ఆసరా అందించడం ద్వారా సంఘబలాన్ని పెంచుకోవాలి. సూర్య, చంద్ర గ్రహణాలను ఏ పరికరాల సహాయం లేకుండా కచ్చితంగా లెక్కకట్టే మన పంచాంగం ఎప్పటికీ తప్పుకాదు. పంచాంగం చింపేస్తే, నక్షత్రాలు మాసిపోతాయా? కాలంలో మార్పులు ఎలా సహజమో, పంచాంగంలో వాస్తవాలు అంతే సహజం.

**6. మంచినీరు దానం చేయడం :** ప్రపాదానం అన్న పేరుతో ఈరోజు మొదలుగా నాలుగు నెలల పాటు ప్రతిరోజూ దాహార్తితో ఉన్న ప్రయాణీకులకు తోడ్పాటు అందించడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయాలి. లేదా రాగిచెంబులో నీళ్లు నింపి, దానిని ఒక బ్రాహ్మణునకు దానం ఇవ్వాలి. **'ఆపోవై సర్వా దేవతాః'** అని వేదవాక్కు. నీటిలో సమస్త దేవతలున్నారు. నీరు ఔషధం. సూర్యుడు మీనం లేదా మేషంలో ఉంటే వేడి ఎక్కువ అవుతుంది. మేషం సూర్యుడికి ఉచ్చ. ఈ నాలుగు నెలలూ తీక్షణత పెంచుకుంటాడు. అశ్విని కేతు నక్షత్రం. **'కుజవత్ కేతు:'** కుజుడు అగ్నిగ్రహం. ఆ కోణంలోంచి చూసినా కూడా తాపం పెంచే కాలం ఇది. కనుక మనం పుణ్యబలం పెంచుకోవాలంటే నీటిని దానం చేయాలి. మనం తాగే నీరు కూడా రాగిచెంబులోనివి అయితే మరింత క్షేమం మనకు. రాగి సూర్యసంబంధమైన లోహం కదా!

**7. వసంత నవరాత్రుల ప్రారంభం :** సీతమ్మ రామయ్యలకు కళ్యాణం జరిపించడం కోసం సన్నాహాలు ప్రారంభం చేస్తాం ఈరోజు. వసంత నవరాత్రుల పేరిట లలితా మహాదేవిని అర్చిస్తాం కదా, **"శ్రీకృష్ణ శ్యామలాదేవీ శ్రీరామో లలితాంబికా"** అని సాధకుల మధ్య ఒక ఉక్తి ఉంది. బెల్లం పానకం వ్యవహారం శ్రీరామనవమి నాడు తప్పనిసరి ముచ్చట. ఈ ఉత్సవానికి మన్మథుడు అధిష్ఠాత. ఈ కాలంలోనే అనేక పుష్పాలు లభిస్తాయి. పువ్వులలో రాణి మల్లెపూవు లభించే కాలం ఇదే. **"ఆరోమా థెరపీ"** అన్న పేరిట ఆధునికులు పాటించే లక్షణాన్ని ప్రాచీనులు ఏనాడో ఇలా పూజల పేరిట దైవానికి పువ్వులు సమర్పించడం, వాటిని మనం వాసన చూడడం తప్పనిసరి చేశారు. ఈ పుష్ప మకరంద సుగంధాలు మనలో ఉన్న అమృత తత్వానికి దోహదకారిగా పనిచేస్తాయి. ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి.

**8. పెద్దల ఆశీర్వచనాలు అందుకోవడం :** పెద్దలకు, తల్లి దండ్రులకు, పాదాభివందనాలు అర్పించి వారి నోట "దీర్ఘాయుష్మాన్ భవ" అనే ఆశీర్వచనం పొందడం చివరిది. శుభాకాంక్షలు అందజేసుకోవడం దీని కిందికే వస్తుంది.

ఉదయం తల్లి శిరస్సుపై నూనె పోసి మర్దన చేస్తూ **"తల్లిదండ్రుల దండన కలిగి అత్తమామల దండన కలిగి, చుట్ట పక్కాల తోడ్పాటు కలిగి, మంచిబుద్ధితో, విద్యాగంధం రాసుకుని, వివేకంతో పెరిగి**



**ఇంటికి మంచి కీర్తి తెత్తువు గాక"** అనే ఆశీర్వచనం చేస్తుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు ఇలా ఉగాది క్రియగా, ఆచరణగా నమస్కరిస్తే ఆయుర్దాయంతో ఆరోగ్యంగా ఉందువు గాక అంటుంది. ఇలా పెద్దలకు నమస్కరించడం ఈ ఒక్కరోజుకే పరిమితం కాక, రోజువారీ అలవాటుగా మారాలి.

**ముగింపు :** ఉగాది పండుగ వయసు ఎంత? అనే సందేహానికి సమాధానం 'సృష్ట్యాది నుండి' అని. చైత్ర శుద్ధ పాడ్యమి సృష్టికి పుట్టినరోజుగా చేసి ప్రతి సంవత్సరం జరుపుకొంటూ, ఏ సంవత్సరానికా సంవత్సరం జత పరచుకుంటూ కోట్ల సంవత్సరాల కాలం గడిపేశాం. చంద్రుని గమనం ప్రధానంగా ఉన్న జీవితం గడిపేవాళ్లం కనుక మనకు చైత్రశుద్ధ పాడ్యమి ఉగాది. ఈరోజున ఉగాది పచ్చడి తినడం ఎంత తప్పనిసరి అయిన ఆచారామో, అంతే తప్పనిసరిగా చైత్రశుద్ధ పున్నమరోజున పెరుగు అన్నం తినాలి. రోగాలేవీ మనజోలికి రాకుండా తీసుకునే వ్యాక్సిన్ 'ఉగాది పచ్చడి' సంకల్పబలం కల పెద్దలు పలికే ఆశీర్వచన మంత్రాల మాటలు "శతమానం భవతి". అందరూ సంతోషంగా, ఆనందంగా ఉండాలి. అందరికీ సకల శుభాలు కలగాలి అని కోరుకోవడం.



# తీగ



మల్లెతీగ కరెంటు స్తంభానికి అల్లుకుని
పైపైకి పాకిపోయింది
పక్షులు ఊకొడుతుండగా
మల్లెతీగ కథలల్లి తీగలతో చెప్పుకుంది
రాత్రి లైటు వెలిగినప్పుడు సంతోషం పట్టలేక
గాలితో కలిసి నాట్యమాడింది
ఫలితంగా తీగ మొగ్గలు వేసింది
తెల్లవారకముందే వీధిలైటు ఆరిపోతుంది
అప్పుడు మల్లెమొగ్గలన్నీ లైట్లయి వెలుగుతాయి
పరిమళాల జాడ పట్టుకొని వచ్చిన సూర్య కిరణాలు
ముద్దు పెట్టుకుంటాయి పువు పూవును
భూమాత
తీగకు కరెంటును అందిస్తూనే ఉంటుంది
ప్రేమతో





**అమ్మంగి వేణుగోపాల్**
ఫోన్ : 9441054637

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక  సంపుటి -26 : సంచిక - 5    UGC Care List Approved Journal
హైదరాబాద్  మార్చి : 2023

# భారతీయీకరణ – 10

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయీకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయీకరణ. భారతీయీకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయీకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయీకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయీకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయీకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.





మన పూర్వీకులు మనకందించిన బౌద్ధిక సాంస్కృతిక పూర్వ ఔన్నత్యాన్ని మనం వారసత్వంగా పొందినందుకు నేనెంతో గర్విస్తున్నానని అన్నాను. మరి ఈ భూతకాలాన్ని గూర్చి మీరెట్లా భావిస్తున్నారు? అంటూ వారిని ప్రశ్నిస్తూ శ్రీ నెహ్రూ ఇంకా ఇట్లా అన్నారు. మీరు గూడా అందులో భాగస్వాములమనీ, దానికి వారసులమనీ నాకూ మీకూ చెందిన ఈ అంశాన్ని గూర్చి గర్విస్తున్నారా? లేక, దీనికి పరాయి వాళ్లమనుకుంటున్నారా? అట్లా అనుకుంటూ, దాన్ని అర్థం చేసుకోకుండానే, ఈ అపార సంపదకు మనం వారసులమూ, రక్షకులమూ అని భావించడంవల్ల కలిగే అపూర్వనుభూతిని పొందకుండానే వ్యర్థంగా వదులు కొంటున్నారా? ఈ ప్రశ్నలు మిమ్మల్ని ఎందుకడుగుతున్నానంటే, ఇటీవల సంవత్సరాల్లో అనేక శక్తులు ప్రజల బుద్ధిని పెడదార్లు బట్టిస్తూ, చరిత్ర గతిని నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నాయి. మీరు ముస్లింలు, నేను హిందువును, మనం వేరు వేరు మత విశ్వాసాలకు చెందిన వాళ్ళం, లేక, దేనికీ చెందకపోవచ్చు. అయితే, అంతమాత్రాన, మీది నాదీ అయిన ఈ ప్రాచీన సాంస్కృతిక వారసత్వాన్ని అది తొలగించ జాలదు. గతం మనను కలిపి ఉంచింది. మరి, వర్తమానమూ భవిష్యత్తూ భావనలో మననెందుకు విడదీయాలి?

రాజకీయాల్లో వచ్చే మార్పులు కొన్ని ఫలితాలను కలిగించవచ్చు. కానీ, ప్రధానంగా చెప్పుకోవలసినవి జాతి దృక్పథంలో, భావనలో వచ్చే మార్పులు. గడిచిన కొద్దీ సంవత్సరాలుగా, నెలలుగా నన్ను అతిగా బాధపెట్టినవి రాజకీయంగా వచ్చిన మార్పులు కావు. మనమధ్య బోలెడన్ని అడ్డంకులను కల్పిస్తూ ప్రాకి వస్తున్న భావాల మార్పులు. భారతీయ భావనను మార్చడానికి ప్రయత్నించడమంటే, యుగయుగాలుగా మనం సాగి వస్తున్న ఈ చారిత్రక పురోగమనాన్ని తలక్రిందులు చేయడానికి ప్రయత్నించడమే అవుతుంది. చరిత్ర గతిని వెనక్కి త్రిప్పడానికి మనం ప్రయత్నించాము, వినాశానికి లోనయినాము. చరిత్ర సృష్టించే భౌగోళిక రీతులతో, శక్తివంతమైన విధానాలతో మనం సులభంగా ఆటాడుకోలేము.

ప్రస్తుతం మీ బుద్ధికి నిలకడ లేకపోవడం మూలాన ఏ దారిని అనుసరించాలో, ఏం చేయాలో తోచకుండా ఉండవచ్చు. కానీ, కొన్ని ఉద్దేశ్యాల విషయంలో మనకున్న మౌలిక సంబంధాన్ని గూర్చి మనమందరం స్పష్టం చేసుకోవలసి ఉంది. అన్ని మతాల వారికి, విభిన్నోద్దేశాలకూ స్థానం ఉండి, ప్రధానంగా లౌకిక రాజ్యాంగ విధానాన్ని అనుసరించే జాతీయ ప్రభుత్వం గల రాజ్యాన్ని మనం నమ్ముతున్నామా? లేక, ఇతర మతాల వారిని పరాయివాళ్ళుగా భావించి దూరంగా తరిమికొట్టే మత ప్రధాన రాజ్యాంగం గల రాజ్యాన్ని మనం నమ్ముతున్నామా?

ప్రస్తుత పరిస్థితులు ఎంత గజిబిజిగానైనా ఉండవచ్చు. కానీ, గతంలో మాదిరిగానే భవిష్యత్తులో గూడా భారతదేశం ఒక దేశంగా, అనేక మతవిశ్వాసాలను గౌరవిస్తూనే ఉంటుంది. అయితే ఒక దేశంగా ఒకే జాతీయ దృక్పథాన్ని కలిగి ఉంటుంది.

ఈ విధంగా పండిత నెహ్రూ ముస్లిం మేధావి వర్గాన్ని అడిగిన ప్రశ్నలు ఇన్నేళ్లనుంచీ సమాధాన రహితంగా ఉండటం విచారకరమైన అంశం. పండిత నెహ్రూ ఇంత నిరర్గళంగా మాట్లాడిన ఉమ్మడి సంస్కృతి, ఉమ్మడి వారసత్వం, వారికి అంతుబట్టని విషయమై పోయింది. పైగా, భారతీయ సాంస్కృతిక వారసత్వంపై గౌరవం కలిగించి ముస్లింలను జాతీయ జీవిత ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడానికి బదులుగా, వారి బుద్ధి నుండి ద్విజాతి సిద్ధాంత వ్యాధిని తొలగించగలిగిన భారతీయ జీవితం నుంచీ, సంస్కృతీ సంప్రదాయ భావనల నుంచీ ఇంకా ఇతర ప్రభావాల నుంచీ వారిని సంపూర్ణంగా విడదీయడానికి అలీఘర్‌లోనూ, ఇంకా ఇతరత్రా గూడా క్రమబద్ధమయిన ప్రయత్నాలు చేయబడినయి.

ఈ అలీఘరీయమైన భావన ముస్లిం ప్రజానీకంలో వ్యాపించ డానికి జమాయత్-ఇ- ఇస్లామి ఒక వాహనంగా ఉపయోగ పడుతున్నది. ఇది ఇస్లాం ప్రామాణికతకు అంతర్జాతీయ సంస్థ. దీని నాయకుడు పాకిస్థాన్‌లోని మౌలానా మౌదిదీ. ఖురాన్‌లోని నియమాలను కఠినంగా పాటించే ప్రభుత్వాన్ని స్థాపించడం దీని లక్ష్యం. సాంఘిక- ఆర్థికాది విషయాలను గురించి దీనికున్న కాలానుకూలంగాని ప్రవృత్తి, జాతీయతకు బదులు ఇస్లాం యొక్క అంతర్జాతీయతకు ఇది ఇచ్చే ప్రాధాన్యం కారణంగా, జాతీయత ఒక ప్రధాన శక్తిగా పనిచేసే అనేక ముస్లిం దేశాలలో ఈ సంస్థ సందేహ దృష్టితో చూడబడుతున్నది. పాకిస్తాన్ ప్రభుత్వం కూడా దీన్ని సందేహించి, పాకిస్తాన్‌లో క్రమంగా పెరుగుతున్న దీని ప్రభావాన్ని వ్యతిరేకించింది. ఈ సందర్భంలో లౌకిక విధానాన్ని గూర్చిన తప్పుడు భావాలనూ, అధికార కాంగ్రెసు, దాని సంబంధీకుల యొక్క మతతత్వ రాజకీయాలనూ ఈ భారతదేశంలో మళ్ళీ ఒకసారి అభినందించవలసి ఉన్నది. ఎందుకంటే, వీటి ద్వారా ప్రోత్సాహాన్ని పొందుతూ, ఈ సంస్థ భారత ముస్లింలలో తన విషాన్ని శిక్షారహితంగా వ్యాపింప జేస్తున్నది. ప్రస్తుతం ఇది భారతదేశంలో ముస్లింల యొక్క అత్యంత శక్తివంతమైన సంస్థగా రూపొందింది. మౌలానా ఆజాద్ మరణానంతరం తన అత్యంత ప్రధాన రాజకీయాధారాన్ని కోల్పోయిన జమాయత్- ఉల్- ఉలేమా సంస్థను క్రమక్రమంగా జమాయత్- ఇ- ఇస్లామీ తెరవెనుకకు త్రోసివేసింది. ఇది ప్రస్తుతం పునరుజ్జీవితమయిన ముస్లిం లీగుకూ, భారతదేశంలోని ఇంకా ఇతర ముస్లిం సంస్థలకూ కూటమి అయిన మజ్లీస్- ఇ- ముషావరాత్ సంస్థకూ వెన్నెముకగా రూపొందింది. దీనికి అత్యాధునిక ప్రచార సాధనాలున్నయి. పైగా అంతులేని నిధులు గూడా ఉన్నట్టు కనిపిస్తుంది. ఉర్దూ, ఇంగ్లీష్ భాషలో వెలువడే "దావత్" రేడియన్స్ అనే పత్రికలు దీని ప్రధానాంగాలు. ఆ పత్రికలను యథాలాపంగా తిరుగవేసినా గూడా, ఈ సంస్థ యొక్క ప్రేరణలనూ, లక్ష్యాలనూ గూర్చి ఒక అభిప్రాయానికి రావచ్చు. దీనికి ముఖ్యమైన మౌలానా మౌదిదీ 1965లో భారత-పాకిస్తాన్ యుద్ధ సందర్భాన- ముస్లిం లందరూ పాకిస్థాన్‌ను బలపరచాలని ఒక "ఫత్వా" విదుదల చేసినాడు.

భారత ముస్లింలలోని ఒక వర్గం వారిలో వేర్పాటు ధోరణినీ ప్రేరేపించే ఈ వాస్తవాలిట్లా ఉండగా, వీటి అన్నింటికన్నా అత్యంత ప్రధానంగా గుర్తించవలసిన అంశం వీరిపై పాకిస్తాన్ యొక్క ఘోరమయిన ప్రభావం. హిందువులన్నా, హిందూదేశమన్నా సృష్టింపబడిన ద్వేషభావం మీద పాకిస్తాన్ నిర్మాణం జరిగింది. ఆ ద్వేషం ఆధారంగానే పాకిస్తాన్ నిలదొక్కుకున్నది. పాకిస్తాన్‌లోని అనేకమంది ముస్లింలు మత మార్పిడివల్ల ఏర్పడినవారే. ముస్లిమేతరు లయిన ఈ దేశీయులకూ వీరికి సాంస్కృతిక వారసత్వం ఒకటే. జర్మనీ, కొరియా, వియత్నాం, ఐర్లాండ్‌ల విభజనల మాదిరిగానే భారత విభజనగూడా అసహజమయినదే అని పాకిస్తాన్ పాలకులకు తెలుసు. భారత- పాకిస్తాన్‌లు జగడమాడుతూ ఉన్నంత కాలమే ఈ విభజన నిలబడగలదని కూడా తెలుసు. భారత - పాకిస్తాన్‌లు శాంతియుతంగా స్నేహపూర్వకంగా సహజీవనం నెరపడం నేర్చుకున్నట్లయితే, కొంచెం వెనక ముందులుగా ఏకీకరణ శక్తులు సహజంగానే నెలకొనక తప్పదు. అందువల్ల, అహరహమూ, భారతదేశంతో వైరాన్ని నిలబెట్టుకునే విధానాన్నీ, భారతదేశంలో అంతరికంగా అల్లకల్లోలాలను రెచ్చగొట్టే విధానాన్నీ పాకిస్తాన్ ఏర్పడ్డ క్షణం నుంచి దాని పాలకులు బుద్ధిపూర్వకంగా అనుసరిస్తున్నారు. భారతదేశంలో పాకిస్తాన్‌కు సహాయం చేసేవారూ, పాకిస్థాన్ ప్రతినిధులూ చాలా పెద్దసంఖ్యలో ఉన్నారనేది అందరికీ బాగా తెలిసిన సత్యమే. ఏ ద్విజాతి సిద్ధాంతం ప్రాతిపదికగా పాకిస్తాన్ ఏర్పడిందో, దాని బ్రతుకు మొదలయిందో, ఆ ద్విజాతి సిద్ధాంతాన్ని అట్లాగే కొనసాగనీయవలెననీ భారత ముస్లింలను మిగిలిన భారతీయ సమాజంతో ఏకం కానీయరాదనీ పాకిస్తాన్ ఎడతెగని ప్రయత్నాలు సాగిస్తున్నది. ఇట్లాంటి పాకిస్తాన్ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఈ విధమయిన ముస్లిం సంస్థల ద్వారా భారతదేశంలో తన కార్యకలాపా లను నిర్వహిస్తున్నది. దానికి అధికార కాంగ్రెసు పక్షంలోనూ శక్తివంతమయిన "లాబీ" ఒకటి ఉన్నది.

వీటన్నింటి యొక్క సామూహిక ప్రభావం, అధికార కాంగ్రెసు, దానితోపాటు కమ్యూనిస్టులూ అనుసరించే మతతత్వ ప్రేరణలతో, కాంగ్రెసు- కమ్యూనిస్టుల మధ్య ముస్లిం ఓట్లను సంపాదించు కొనడంలో కలిగిన పోటీతో మరింత శక్తివంతమయింది. వెనుకటి నాళ్ళలో అనుసరింపబడిన బుజ్జగింపు - బేరమాడే విధానాలు పునరుద్ధరించబడినాయి. మధ్యంతర ఎన్నికల సందర్భంలో, కేంద్ర ప్రభుత్వోద్యోగుల ఉద్యోగ నిబంధనలోని ఏక భార్యత్వ నిబంధనను, బహుభార్యాత్వాన్ని అంగీకరించే మతానికి చెందిన కేంద్ర

ప్రభుత్వోద్యోగుల విషయంలో సడలించడం, ఏక భార్యత్వానికి సంబంధించిన పౌర సూత్రాలను ముస్లింలకు కూడా వర్తింపజేయ డానికి ప్రభుత్వం మాటిమాటికీ నిరాకరించడంవంటివి, బుజ్జగింపు విధానానికి కొట్టవచ్చినట్లు కనిపించే కొన్ని ఉదాహరణలు. ఈ విధానం, వేర్పాటు ధోరణి గల ముస్లింలు తమ ఒత్తిడులను పునః పునః అధికం చేయడానికి ప్రోత్సహించింది. 1967 ఎన్నికల నాటి నుండి క్రమంగా పెరుగుతున్న ఈ విధమయిన రాజకీయ పరిస్థితి, ఇట్లాంటి ధోరణుల వారికి చక్కని అవకాశాలను చేతికందించింది. వారి దుడుకుదనం దినదినం పెరుగుతున్నదనడానికి, ఏ మార్పు లేకుండా వారే ప్రారంభిస్తున్న మతకలహాలే ఒక స్పష్టమైన ఉదాహరణ.

ఇదంతా విదేశాల ఏజెంట్ల రెచ్చగొట్టుడనం ద్వారా జరిగిందని మాటవరుసకు ఒప్పుకున్నా గూడా, ఏ ముస్లిం నాయకత్వం గానీ, సంస్థలు దీన్ని ఖండించి పోవడాన్ని గురించి ఏ సంజాయిషీ చెప్పగలుగుతారు? అహ్మదాబాదులో జగన్నాథ దేవాలయాన్నీ, కాశీలో శివ దేవాలయాన్నీ అపవిత్రం చేయడం, చైబాసాలో శ్రీరామనవమి ఊరేగింపు మీద, భివాండిలో శివాజీ జయంతి ఉరేగింపు మీద దాడి చేయడం– ఘోరమయిన రక్తప్రవాహాలకూ, విధ్వంసకాండకూ దారితీసిన ఈ దుష్కార్యాలను నిరసిస్తూ ముస్లింలీగ్ గానీ, జమాయత్–ఇ–ఇస్లామీ గానీ, జమాయత్– ఉల్– ఉలేమా గానీ, కనీసం వాటి నాయకుల్లో ఏ ఒక్కరు గానీ ఒక్క మాట గూడా మాట్లాడలేదు. చివరకు, జాతీయ ముస్లింలుగా చెప్పుకొంటున్న కాంగ్రెసు– కమ్యూనిస్టు పార్టీలలోని ఏ ఒక్కరు గూడా నోరెత్తలేదు.

1947లో దేశ విభజన ద్వారా పాకిస్తాన్‌ను సృష్టించిన ఒక పెద్ద ముస్లిం వర్గం యొక్క పూర్వ చరిత్రనూ, ప్రస్తుత వాస్తవాలనూ గమనించితే భారతదేశపు శాంతి భద్రతలు, ఏకత్వం కోసం వీరందరి భారతీయాకరణ అత్యంతావశ్యకం.

**“ఆనాటి జనాభాలో ముస్లిం ఓటర్ల సంఖ్య 13 శాతానికే పరిమితమయి ఉండగా, ముస్లింలలోని ఒక పెద్ద వర్గం పాకిస్తాన్ సృష్టికి ప్రయత్నించిందనడం ఎట్లా కుదురుతుంది?”** అని కొందరు తరచుగా ప్రశ్నిస్తుంటారు. అయితే, వారొక విషయం మరిచి పోతున్నారు. కాంగ్రెసు కూడా ఈ 13 శాతం ఆధారంతోనే భారత జాతీయవాదులందరికీ తాను ప్రాతినిధ్యం వహిస్తున్నారని చెప్పుకున్నది. మరొకటేమిటంటే, ముస్లిం ఓటర్లు ఈ 13శాతంలో, 93 శాతం ఈనాడు భారతదేశంలో చేరి ఉన్న ప్రాంతాలకు చెందిందే. 1946లో జరిగిన ఎన్నికలను నిశితంగా పరిశీలించి అనేకాంశాలను వెలుగులోకి తెచ్చిన శ్రీ అశోక్ మెహతా రచించిన “భారత రాజకీయ మేధ” (Political mind of india) అన్న గ్రంథాన్ని అనుసరించి చూస్తే, ముస్లింలలోని ఈ శాతమే భారత సమైక్యతను భగ్నంచేసి, పాకిస్తాన్‌కు దారి సుగమం చేయడంలో సర్వవిధ ప్రచారాలూ చేసింది. ఈ 22 సంవత్సరాల్లోనూ వారి హృదయాల్లో ఏ విధమయిన మార్పు గూడా రాలేదని వారి ప్రస్తుత ప్రవర్తన స్పష్టం చేస్తున్నది. భారతసేనకు మొట్టమొదటి కమాండర్ ఇన్ చీఫ్ అయిన జనరల్ కరియప్ప యొక్క లౌకిక విధాన దృష్టి, భారత– పాకిస్తాన్ సంబంధాలు మెరుగుపడాలని ఆయనకున్న ఆకాంక్షా అందరికీ తెలిసినదే. అట్లాంటి ఆ వ్యక్తికి గూడా విద్యావంతులయిన ముస్లింలలోని విదేశ విధేయతను గూర్చి విమర్శించక తప్పలేదు. **“మనం మేల్ కొందాము”** (Let us wake up) అని ఆయన వ్రాసిన– ఇటీవల వెలువడ్డ– గ్రంథంలో “భారతదేశంలోని ముస్లింలు (muslim in india) అన్న శీర్షిక కింద ఆయన ఈ విధంగా వ్రాసినారు.

“మనది లౌకిక రాజ్యాంగ విధానం గల దేశం. భారతదేశంలోని అన్ని మతాల వారిని మాదిరిగానే – నా సోదరీ సోదరుల మాదిరిగానే – ముస్లింలను గూడా పరిగణిస్తాను. తరచుగా నేను దేశంలో పర్యటిస్తున్నప్పుడు ఎంతోమంది ముస్లింలను కలుసుకుంటూనే ఉన్నాను. నాకు చాలామంది ముస్లిం మిత్రులు ఉన్నారు. దేశ పరిస్థితులనూ, వ్యక్తులనూ గూర్చి వారితో స్వేచ్ఛగా చర్చించే చనువు నాకున్నది. ఈ చర్చల్లో అనేకమంది తాము తమ కాళ్లను రెండు పడవల్లో– భారతదేశం, పాకిస్తాన్‌లలో పెట్టి ఉన్నారన్న భావన నాకు కలిగించినారు. ఇది నాకు చాలా విచారం కలిగించింది. వారి విధేయత మొట్టమొదట పాకిస్థాన్‌కు చెందుతుంది. ఇది క్షమించరాని గొప్ప నేరం. భారతదేశంలోని ముస్లిమేతర విద్యావంతులలో అనేకమంది ఉద్దేశం గూడా ఇదే. దేశపు అత్యధిక సంఖ్యాక వర్గంలోని అనేకమందికి ఎవరికీ సంతోషకరంగాని భావనలు ఉండటానికి ఇదే మూల కారణం. దీన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

ఈ సందర్భంలో, భారత – పాకిస్తాన్ లలో ఏ దేశానికి తమ విధేయత అంకితమయి ఉన్నదో బహిరంగంగా ప్రకటించవలసిందిగా భారతదేశంలోని నా ముస్లిం సోదరీ సోదరులందరినీ అభ్యర్థిస్తున్నాను. వారి విధేయత ఒకవేళ పాకిస్తాన్‌కే అంకితమయి ఉంటే, వెంటనే మూట ముల్లె గట్టుకొని వారు పాకిస్థాన్‌కు వెళ్లాలె. ఇట్లాంటి వారికి మన పవిత్ర దేశంలో ఒక అంగుళం మేర భూమి మీద కూడా స్వత్వం ఉన్నదనే హక్కు ఏ మాత్రమూ లేదు. ఇక వారి విధేయత భారతదేశానికే అంకితమయి ఉంటే, వారు మనః పూర్వకంగా ఇట్లా భావించి ఉన్నట్లయితే, ఇట్లా భావించే ముస్లింలు చాలామంది ఉన్నారని నాకు తెలుసు. వారు, వారి వర్గంలోని ఈ అవిధేయతా శక్తులను బయటపెట్టి, అవి భారతదేశాన్ని వదిలిపోయేట్టుగా చేయాలె. దీనివల్ల, ఈ దేశంలోని అత్యధిక సంఖ్యాక వర్గం వారు నిస్సంకోచంగా వారి యథార్థ స్వరూపాన్ని అంగీకరించడానికి చక్కని సాక్ష్యం లభిస్తుంది. భారత విధేయత గల ముస్లింలకు, అత్యధిక సంఖ్యాక వర్గం వల్ల కలుగుతుందేమోనని ఆశించే నష్టం కన్నా, వారి సోదరవర్గంలో భారత అవిధేయత కలవారుగా స్పష్టంగా కనిపించేవారి వల్ల ఏ విధంగా చూచినా ఎన్నో రెట్లు అధికంగా నష్టం కలుగుతుంది. ఈ విషయం వారు గుర్తించడం అవసరం. దీనికి వారు ఏం చేయవలెనో తమకు తామే నిర్ణయించుకోవలసి ఉన్నది.

## సాధన పంచకమ్

**క్షుద్వ్యాధిశ్చ చికిత్స్యతాం ప్రతిదినం భిక్షౌషధం భుజ్యతాం**
**స్వాద్వన్నం న తు యాచ్యతాం విధివశాత్ ప్రాప్తేన సంతుష్యతామ్**
**శీతోష్ణాది విషహ్యతాం నతు వృథావ్యాం సముచ్చార్యతాం**
**ఔదాసీన్య మభీప్స్యతాం జన కృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. ఆకలి రోగమును నయం చేసికొనవలెను. 2. ప్రతిదినము భిక్షాన్నమును ఔషధముగా భుజింపవలెను. 3. రుచికరమైన ఆహారమును కోరకుండా ఉండవలెను. 4. విధివశాత్తుగా లభించిన దానితో తృప్తి చెందవలెను. 5. శీతోష్ణాదుల వంటి ద్వంద్వములను సహించవలెను. 6. వ్యర్థమైన మాటలను మాట్లాడకుండా ఉండవలెను. 7. ఉదాసీనమును ఇష్టపడవలెను. 8. జనుల యొక్క కృపను కోపగించుటను (నిష్ఠురత్వమును) విడిచి పెట్టవలనెను.

**వివరణ**


**7. ఔదాసీన్య మభీప్స్యతామ్ –**


ఉదాసీనమును సాధకుడు ఇష్టపడవలెను, కోరుకొనవలెను. అవసరమైన, పనికిరాని, అనుచితమైన విషయాల పట్ల ఉదాసీన వైఖరిని కలిగివుండవలెను. దుమ్ము లేచినప్పుడు వెంటనే ముక్కుకు చేతిగుడ్డను అడ్డుపెట్టుకుంటాం. ఇష్టంకాని వ్యక్తి త్రోవలో ఎదురుగా వస్తున్నట్లయితే, అటో, ఇటో తల త్రిప్పి అతడిని చూడకుండా ప్రయత్న పూర్వకంగా ప్రక్కకు తప్పుకొని వెళ్ళిపోతాం. ఇది అందరికి అనుభవంలో ఉన్నదే కదా! అందువలన **"స్పర్శాన్ కృత్వా బహిః బాహ్యాన్"** (గీత.5/27) బాహ్యమైన విషయ భోగాలను మనసు లోనికి రానీయకుండా బాహ్యంలో ఉంచినప్పుడే ధ్యానం సాధ్యమవుతుంది. బయటి విషయాలను బయటనే ఉంచాలి. లోపలికి రానీయ కూడదు. లోకంలో ఎన్ని ఉన్నా నష్టంలేదు. కాని అవన్నీ మన మనసులోకి వస్తే మాత్రం అంతా కష్టమే. కావున అనవసరమైన విషయాల పట్ల ఉదాసీనంగా ఉండవలెను.

**8. జన కృపా నైష్ఠుర్య ముత్సృజ్యతామ్ –**

జనుల యొక్క కృపను, నిష్ఠురత్వమును ఈ రెండింటిని విడిచి పెట్టవలెనని అంటున్నారు శ్రీ శంకరాచార్యులు. మనము ఇతరుల పట్ల అధికమైన దయనుగానీ, కోపమునుగానీ ప్రదర్శించకుండా ఉండాలి. ఇక, ఇతరులు మనపై చూపే అమితమైన కృపను గానీ, నిష్ఠూరమును గానీ ఉదాసీనంగా చూడగలగాలి. ఇతరుల పట్ల మనలో అధికమైన ప్రేమ ఉంటే మన మనస్సులో వారే ఉంటారు. ఒకవేళ ఎదుటివారు మనలనే అతిగా ప్రేమిస్తే మన మనస్సు వారి చుట్టే తిరుగుతుంది. ఈ రెండింటి వలన మనకు ధ్యానం కుదరదు. పరమాత్మను ధ్యానింపలేము. పరోపకారార్థం లోకంలో జీవించాలి. సేవ చేయాలి. సహాయ సహకారాలు అందించాలి. అంతేకాని, వారిని ఉద్ధరిస్తాం, సమాజాన్ని మారుస్తాం అనేది సరైనది కాదు. ముందుగా ఎవరిని వారు ఉద్ధరించుకోవాలి. **"ఉద్ధరేదాత్మనాత్మానం"** – అంటుంది భగవద్గీత. కావున మనుష్యులు చూపే కృపను, కోపాన్ని ఉపేక్షించాలి.

## సత్సంగం





### ధ్యానం – విచారణ

ధ్యానం విచారణ రెండూ ఒకటే. విచారణ చేసే యోగ్యత లేనివారు ధ్యానం చేసుకోవాలి. తనను తాను మరచి "నేను బ్రహ్మాన్ని" అనో "నేను ఈశ్వరుణ్ణి" అనో ధ్యానిస్తాడు సాధకుడు. ఈ పద్ధతి ద్వారా బ్రహ్మాన్నో ఈశ్వరుడినో విడువకుండా పట్టుకుంటాడు. చివరికిది బ్రహ్మము లేక ఈశ్వరుని ఎరుకగా మిగులుతుంది. అదే శుద్ధస్థితి అనీ ఆత్మ అనీ గ్రహింపు కలుగుతుంది. విచారమార్గాన్ని అవలంబించే వాడు, "నేనెవరిని" అని ప్రశ్నించుకుంటూ తనని తాను విడువడు. దీనివల్ల వానికి ఆత్మ అంటే ఏమిటో విశదమవుతుంది. సచ్చిదానందంగా భాసిల్లే పరమాత్మనే నేను – అని మనస్సులో ఊహించుకోవటమే ధ్యానం. మనస్సుని ఆత్మపై లగ్నం చేసి తద్వారా భ్రమని నాశనం చేసుకోవటం, విచారణ.

ఆత్మ గురించి ఏ భావంతో ధ్యానం చేసినా, ఆ రూపాన్నే అందుకుంటారు. ఏ విధమైన భావం లేకుండా, నిశ్చలంగా ఉండేవాళ్ళు పరమోత్కృష్టమైన, నిష్కళంకమైన కైవల్యాన్ని, రూపం లేని ఆత్మని, అందుకుంటారు.

ప్రారంభ దశలో ధ్యానం తేలికగా ఉంటుంది. నచ్చుతుంది కూడా. ఆ అభ్యాసమే ఆత్మ విచారానికి దారితీస్తుంది. అక్కడ సత్యాసత్యాల విచక్షణ జరుగుతుంది. ఒకదానికొకటి వైరుధ్యం కల అంశాలతో నీవు నిండి ఉన్నప్పుడు సత్యాన్ని పట్టుకొని ఉండటం వల్ల ప్రయోజనమేమిటి? "ఆత్మ ఇంకా సాక్షాత్కారం కాలేదం"టూ నీకు స్ఫురింపచేసే అవరోధాలని ఆత్మవిచారం తొలగిస్తుంది. ఆ విధంగా, నేరుగానే నీకు సాక్షాత్కారం కలుగజేస్తుంది.

సాధకుని పురోగతిని బట్టి ధ్యానం మారుతూంటుంది. యోగ్యతే ఉంటే, యోచించే వాడెవడోనని అన్వేషించడమే నయం. అప్పుడా యోచించేవాడు తన మూలంలో, శుద్ధచైతన్యంలో నిమగ్నమవుతాడు.

గ్రంథాంతరంగం 22

# మునగాల పరగణా : కథలు – గాథలు

**శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు,** ఫోన్ : **9964082076**


మునగాల పరగణా పేరు విన్నవాళ్లు ఈ తరంలో ఏ కొద్దిమందో? అలాంటప్పుడు మునగాల రాజా నాయని వెంకటరంగారావు గారి పేరు విన్నవాళ్లు ఎంతమంది వుంటారో చెప్పలేం. నిజమే మరి. తాత ముత్తాతల కథలు ఎవరికి కావాలి? అయినా నడుస్తున్న చరిత్ర స్థితి గతులు, కథా కమామీషు గురించి తెలుసుకోవాలంటే గతకాలం నాటి వూసులు వినాలి కదా? అవి కాలక్షేపం కలిగించే, ఉబుసుపోక కాకమ్మ, గువ్వమ్మ కథల్లాంటివి కావు, కానే కావు.

గుడిపూడి సుబ్బారావు గారనే పెద్దాయన తన ఎనభైయ్యవ ఏట (ఆగష్టు 2017)లో రాసిన **'మునగాల పరగణా : కథలు – గాథలు'** ఈతరం వాళ్లు, అంతకు ముందుతరం వాళ్లు కూడా చదవాల్సిన గ్రంథమే. 302 పేజీలతో, మునగాల పరగణా గత వైభవాన్నీ, వర్తమాన శైథిల్యాన్నీ, రాజా రాణీల, దివాన్ల, రైతు పెదరాయుళ్ల, కోట కొత్తళాల, రాజభవనాల, విశ్రాంతి గృహాల, గుడి గోపురాల, అనాథ శవాల్లా పడివున్న గడీల ఫోటోలతో కూడుకొన్న ఈ 'మునగాల పరగణా: కథలు– గాథలు' పాఠకుల్లో ఉత్కంఠను కలిగిస్తుంది, ఆవేశాన్ని రేకెత్తిస్తుంది, విషాద నిర్వేదాల్ని పుటం పెడ్తుంది.

గ్రంథకర్త గుడిపూడి సుబ్బారావు తమ తండ్రి, తాత ముత్తాతల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ, మునగాల పరగణాలోని వివిధ ప్రాంతాల్లో జీవితం గడిపిన పెద్దల నుంచి విస్తృత సమాచారం సేకరించి, తాను నేరుగా విన్న, కన్న విషయాల్ని నమోదు చేశారు. ఆ పెద్దాయన గ్రంథ రచనలో తనకు తోడ్పడ్డ పెద్దా చిన్న వ్యక్తులకు 'కృతజ్ఞతలు' సమర్పిస్తూ ఇలా అంటారు– **"మొత్తం మీద యివన్నీ వినికిడి గాథలే. సంఘటనలన్నీ నిజాలే. కాకపోతే, కొంత చూపు మార్చుకున్నాయి. వినికిడి గాథలవడం వల్ల! అంతే తేడా!! ఎవరినీ నొప్పించాలనీ, మెప్పించాలనీ వ్రాసినవి కావు. మునగాల రాజా మీద యిన్ని సంవత్సరాలు గడిచిపోయాక ఎవరికి కుతూహలముంటుంది? రాజాల వల్ల బాధలు పడ్డవారికి, చరిత్ర కారులకు తప్ప!!"** (పేజి : xxxiv).

ఒక దేశం, రాష్ట్రం, ప్రాంతం, జిల్లా, మండల్, ఆఖరికి ఓ గ్రామం చరిత్ర తవ్వి తీయాలన్నా శాసనాలు, కావ్య, నాటక, స్థల చరిత్రలు, దేశ,విదేశీ రాయబారుల గ్రంథాలు, కైఫీయత్తులు చక్రవర్తుల– రాజుల, సామంత రాజుల, బడావ్యాపారస్థుల మధ్య జరిగిన ఒడంబడికలు వగైరాల సాయం ఎంతో అవసరం. అలాగే గ్రామ, నగర ప్రముఖుల మౌఖిక కథనాలు కూడా చరిత్ర రచనకు దోహద మవుతాయి. గ్రంథకర్త గుడిపూడి సుబ్బారావు గారి ఈ పుస్తకం స్వాతంత్ర్య పూర్వ తెలంగాణ, కోస్తా ప్రాంతాల చరిత్ర రచనకు ఎంతగానో ఉపకరిస్తుంది.

గ్రంథకర్త మునగాల పరగణా పరిధిలోని 42 గ్రామాల కథా కమామీషును అన్నవర గూడెం కైఫీయత్ ఆధారంగా వివరించారు. పైగా తమ పూర్వీకుల నుంచి పరంపరాగతంగా వినవచ్చిన కథలు – గాథల నుంచి మునగాల పరగణా చరిత్రను అక్షరబద్ధం చేశారు. కొన్ని నూర్ల ఏళ్ల క్రితం కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి దాడి, మిక్కిలినేని, గుడిపూడి, వున్నం, కొల్లు కమ్మ కులస్థులు పెద్ద ఎత్తున ఇతర కులాల వాళ్లతో పరగణాకు వలస వచ్చి స్థిరపడ్డారు. కాలక్రమంలో పగలనకా, రాత్రనకా కష్టపడి పరగణా గ్రామాలైన వేణుగోపాలపురం, సిరిపురం, జగన్నాథపురం, రేపాల, కరివిరాల, అన్నవర గూడెం,



ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ

మునగాలల్లో పేరు మోసిన భూకామందు లయ్యారు, పేద సాదల పెన్నిధులయ్యారు కూడా. మునగాల పరగణాను గార్లపాటి, కీసర, నాయని అనే మూడు రెడ్డి రాజవంశాలు పాలించాయి. గార్లపాటి వంశస్థుడైన అయ్యప్ప (అయ్యన్న) దేశాయ్ మునగాలలో 17వ శతాబ్దంలో– మట్టికోటను కట్టాడు. తర్వాత కీసర పెద్దిరెడ్డి, ముకుందప్ప, రామన్న సోదరుల వశమైంది. కీసర ముకుందప్ప వ్యవహార దక్షుడై ఎన్నో చెరువులు తవ్వించి వ్యవసాయాన్ని తమ్ముడైన రామన్న ఆధ్వర్యంలో బాగా అభివృద్ధి పరచాడు. రేపాల గ్రామం గఢీ పాలన కేంద్రమయింది. ముకుందప్ప మరణించిన తర్వాత, ఆయన భార్య లచ్చాంబ గఢీని రేపాల నుంచి సిరిపురంకు మార్చింది. ఆమె మృతి చెందిన పిదప పరగణా పాలనాధికారం ఎన్నో చేతులు మారి నాయని వెంకటరంగారావు (1877–1955) గారిని వరించింది. రాజా నాయని వెంకట రంగారావు ఒక విధంగా అదృష్టవంతుడు. ఇంకోవిధంగా దురదృష్టవంతుడు కూడా. హైద్రాబాద్ సుల్తాన్‌బజార్ లో శ్రీ కృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం, వరంగల్లులో రాజరాజ నరేంద్ర భాషానిలయం, మద్రాసులో విజ్ఞాన చంద్రికాగ్రంథ మండలి



మొదలైన సాంస్కృతిక సంస్థల్ని స్థాపించాడు. కొమర్రాజు లక్ష్మణరావుగారి సంపాదకత్వంలో తెలుగు విజ్ఞాన సర్వస్వరచనకు వెన్నెముకగా నిలిచారు. గుంటూరు పట్టణం నడిబొడ్డులో ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారికి ఐదెకరాల భూమినిచ్చి 'శారదానికేతన' మనే అబలాశ్రమ నిర్మాణానికి తోడ్పడ్డారు. ఆచంట లక్ష్మీపతి, పింగళి వెంకయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలైన మేధావుల కాశ్రయమిచ్చారు. కె.ఎల్. రావులాంటి బుద్ధిమంతుడి ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పడ్డారు. కాని ఈ కుశాగ్రబుద్ధుల మేధాబలాన్ని మునగాల పరగణా అభివృద్ధికి ఉపయోగించుకోలేదు దొరగారు. నాయని వెంకట రంగారావు ఇంటికి జ్యేష్ఠ, పొరుగుకి లక్ష్మిలా బతికాడే తప్ప, మునగాల పరగణా శ్రేయోభివృద్ధి చేయగలిగి వుండీ కూడా మిన్నకుండిపొయ్యాడు. మునగాల రాజా నాయని వెంకట రంగారావు గారు హైదరాబాద్‌లో స్థాపించబడ్డ రెడ్డిజన సంఘానికి అధ్యక్షులుగా వుండి పేద రెడ్డి కులస్థులైన విద్యార్థుల చదువులకు తోడ్పడటం మాత్రం ప్రశంసనీయం. కొత్వాల్ వెంకట్రామారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, కట్టమంచి రామలింగారెడ్డి ఇంకా తెలంగాణలోని రెడ్డి సంస్థానాధీశులతో చేతులు కలిపి రెడ్డి జనసంఘ సేవ చేశారే కాని త్రికరణశుద్ధిగా మునగాల పరగణా రైతు కుటుంబాలకు కాని ఇతర పేదసాదలకు గాని ఆసరా అయిన పాపాన పోలేదు. తెలుగు భాషా సంస్కృతులకు ఆర్థిక సాహాయ్యమందించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ద్వారా **'కళా ప్రపూర్ణ'** గౌరవం పొందగలిగారే కాని పరగణా ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకోలేక పొయ్యారు.

రాజా నాయని వెంకటరంగారావు బహద్దరు 42 గ్రామాలకు పెదరాయుడై వుండీ, పల్లె ప్రజల కష్టాల కడగండ్లను కళ్లారా చూసినవాడూ కాదు, చెవులారా విన్నవాడూ కాదు. ఈ ప్రభువు సామాన్య రైతుల్ని ప్రజలే కాదు, మోతుబరి రైతుల్ని కూడా అకారణంగా, ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు. రైతు సంఘంలో చేరి, తనకు వ్యతిరేకంగా ఉద్యమం సాగిస్తారన్న కోపంతో పెద్ద రైతులైన కొల్లు వెంకయ్య, కొల్లు కోటయ్యల ఇళ్లల్లో చాకలి, మంగలి ఇతర వృత్తుల వారెవ్వరూ పని చేయరాదనీ, అలా చేస్తే వాళ్లను శంకరగిరి మాన్యాలకు పంపుతానని బెదిరించాడు చండశాసనుడైన నాయని బహద్దూర్. దాంతో కొల్లు సోదరులు నానా అవస్థలు పడి జెగ్గాడం మీదుగా నడిగూడెం గఢీకి కచ్చడం బండిలో వెళ్తున్న దొరగారి కాళ్లు పట్టుకొని బతిమాలారు. అప్పుడాయన ఎడ్ల బండిని మరింత వేగంగా తోలమని బండివానిని పురమాయించారు. అన్నతమ్ముళ్లిద్దరూ రాజా వారి కాళ్లు గట్టిగా పట్టుకొని శర వేగంతో దూసుకువెళ్లే బండి వెంట ముళ్లపొదల్లో, చిక్కుకొని, నడిచే మోదుగుల్లా రక్తంతో తడిసి ముద్దయ్యారు. అయినా రాజా వారి రాతిగుండె కరగ లేదు. (పేజీలు : 161–162)

రాజావారి ఆగడాలకు అంతు వుంటేగా? గ్రంథకర్త గుడిపూడి సుబ్బారావు గారి మాటల్లో విందామా? **"రాజావారు, తనకు గిట్టని వారిని హత్య చేయించడానికీ వెనుకాడ లేదు. తన నెదిరించిన వారిని – ప్రజా వుద్యమంలో పాల్గొన్న వారి ఇండ్లకు కంప కొట్టించడమే కాదు, పిల్లలు చదువుకునే పాఠశాలక్కూడా, తనకు పడని వారి పిల్లలు ఎందుకు చదవాలని, బడి చుట్టూ కంప అడలు పెట్టించే వరకు తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకున్నాడు. వారి వీపులపై బండలెత్తి తన నిజ స్వరూపం ప్రదర్శించాడు చివరికి, ప్రజలు తాగే మంచి నీటి బావుల్లో మల మూత్రాలు కలిపించారు హేయంగా. యింకేం కావాలి? పరిస్థితులు జీర్రకాకకు రావడానికి!"** (పేజీ: 194)

రాజావారు ఓ రైతు తప్పు చేశాడని, అతనికి యాభైవేల రూపాయల దండం విధించి, చెవులు గుంజి రాబట్టారు. దేవదాసీలకు, భట్రాజులకు, ఇతర వృత్తుల వాళ్లకు మునుపటి రాజాలిచ్చిన ఇనాం భూముల్ని రంగారావు బహద్దూరు వారు సురస రాక్షసి నోటితో కబళించారు.

మునగాల రాజావారు 42 గ్రామాలకు గాను ప్రభుత్వానికి పేష్కస్ రూపంలో సాలీనా నాలుగువేల చిల్లర రూపాయలు చెల్లించాలి. కాని తాను ప్రజల్నుంచి నాలుగు లక్షలకు పైగా గుంజేవాడు. ఇది 1930 నాటి లెక్క (పేజీ: 195) రంగారావుగారు ఆకుపాముల గ్రామంలో వందలమంది వడ్డెర్లతో చెరువు తవ్వించి, వాళ్లకు కూలి డబ్బులివ్వక వాళ్ల నోట మన్ను కొట్టారు. ఆ దరిద్ర నారాయణులు ఆ చెరువు ఎన్నటికీ నిండదనీ, నీటి చుక్క కూడ నిలవదనీ శాపనార్థాలు పెట్టారట. (పేజీలు: 155–156)

మునగాల పరగణాలో 1919లో సంభవించిన భీకరమైన, బీభత్స దృశ్యాల పరంపరను నెలకొల్పిన సిద్ధార్థ కరువు మీద ఓ అజ్ఞాత కవి రాసిన పాట వినేవాళ్ల గుండెల్ని పిండి చేస్తుంది.

**"ధరణిలో సిద్ధార్థ సంవత్సర మదేటికి వచ్చెరా**
**కరువుచే నిరుపేద ప్రాణము కంఠ దేశము జొచ్చెరా**
**మట్టి పెల్లలు తాలు కలిగిన గొట్టె ధాన్యము లైనరా**
**పుట్టి ఒకటికి నూరు రూకలు గిట్టు బాటున కమ్మెరా**
**సంధ్యవేళను దాత బోసిన గంజా కమ్మెరా దాగిన దీనులూ**
**నంజు రోగము చేత చాలుపు నవత బడి యున్నారురా"**
**తెల్లవారగ బువ్వ దెమ్మని పిల్ల లేడ్చుచు నుండెరా**
**తల్లిదండ్రులు పట్టబాలక తలడిల్లు చున్నారురా**
**వర్షము లొక్కటి లేక చేనులు వాడిపోవుచు నుండెరా**
**కర్షకుల నేత్రముల పెక్కుదకంబు గారు చుండెరా (పేజి: 119)**


ఈ సిద్ధార్థ కరువు రక్కసి నూరార్ల జనాన్ని పొట్టన పెట్టుకుంటె 1928లో పరగణాలు నల్ల జ్వరాలు ప్రజల్ని పీడించి, పిప్పిచేసి వదిలాయి. గ్రామాలకు గ్రామాలు వల్లకాడులై పోయాయి (పేజి: 120) రాజావారికి చీమకుట్టినట్లు అయిందో లేదో మరి?

రాజా నాయని వెంకటరంగారావుగారి ఇద్దరు కొడుకులు– రామకృష్ణారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి– తమ ఎస్టేటు మేనేజరు కొళందరెడ్డి కూతుళ్లను ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు– తండ్రిగారి మాట ధిక్కరించి రాజావారు అత్తమీద కోపం దుత్త మీద చూపించినట్లు రాణీ రుక్మమ్మ గారి మీద ధాంధూం అని ఎగిరెగిరి పడ్డారు. అటు ఇద్దరు కొడుకులు, ఇటు పెండ్లామూ దూరమయ్యారు బహద్దూరు గారికి. రానురానూ పరగణాలో రైతు ఉద్యమం, కమ్యూనిస్టుల పోరాటం తీవ్రతర మయ్యాయి. రాజావారు బరువు బాధ్యతల్ని ఆస్తిపాస్తుల్ని కొడుకులకు అప్పగించి 1940 హైదరాబాద్ చేరుకున్నారు. భార్య గతించింది. పిల్లలు ఎవరి దారిన వారు వెళ్లారు. రాజా నాయని వెంకట రంగారావు బహద్దూర్ వారు పక్షవాతం వల్ల మంచానికి బల్లిలా అతుక్కు పొయ్యారు. 1955 నవంబరు 22 న హైదరాబాద్‌లో ఆఖరి శ్వాస విడిచారు.


రాజా నాయని వెంకటరంగారావు జీవితం – మునగాల పరగణా ఉత్థాన పతనాల్ని సమీక్షించినప్పుడు మనకు శ్రీశ్రీ కవిత 'దేశచరిత్రలు' లోని ఈ పంక్తులు జ్ఞప్తికి రాక మానవు –

**"అంతా తమ ప్రయోజకత్వం,**
**తామే భువి కధినాథుల మని,**
**స్థాపించిన సామ్రాజ్యాలూ,**
**నిర్మించిన కృత్రిమ చట్టాల్,**
**ఇతరేతర శక్తులు లేస్తే,**
**పడిపోయెను పేకమేడలై!**
**పరస్పరం సంఘర్షించిన**
**శక్తులలో చరిత్ర పుట్టెను" (మహాప్రస్థానం – పేజి: 74–75)**

గ్రంథకర్త గుడిపూడి సుబ్బారావు 'మునగాల పరగణా పాలకుల పరిచయం'లో ఇలా ముగింపు మాటలు చెప్తారు– **"ఒకనాడు మేము, తెలంగాణలోనే వుంటామని ఎంతో కాలం పోరాడి ఓడిన భద్రాచలం ఏడు మండలాల ప్రజలను భద్రాచలం నుండి విడగొట్టి**




**ఆంధ్రలో కలిపారు. ఏ గొడవా చేయని ఒకనాటి కృష్ణాజిల్లా మునగాల పరగణాను తెలంగాణలోనే వుంచారు. యిదీ చరిత్ర పోకడ! ఎప్పుడు, ఎలా, ఎందుకు, ఏం జరుగుతుందో సామాన్య ప్రజలకు తెలియదు. సామాన్యులు జీవించడం కోసమే బతుకుతుంటారు. తమ వునికికే ప్రమాదం వాటిల్లినప్పుడు ఎంతకైనా తెగిస్తారు. యీ సామాన్యులు, సంపన్నులు– బలవంతులు, మేధావులు, చరిత్రను తమ చర్యలతో యీ సామాన్యులతో కలిసి అనేక మలుపులు తిప్పడంలో భాగస్వాములవుతారు ఎప్పుడూ!"** (పేజి: xxiv)



గుడిపూడి సుబ్బారావు




గడీలోని ఓ భవనం

'మునగాల పరగణా: కథలు – గాథలు' లో మనకు జమీందారుల భోగ విలాసాలు, డాబుదర్పాలు, పీడన తాడనలు, ప్రజల ఆక్రందనలు– ఆర్తనాదాలు కనపడతాయి, వినిపిస్తాయి, పదేపదే ప్రతిధ్వనిస్తాయి కూడా. అంతేకాదు గ్రంథకర్త గుడిపూడి సుబ్బారావు గారికి ఎందరో సామాన్య వ్యక్తులు అసామాన్యులుగానూ, అమానుషులుగా కూడా కనబడతారు, వీళ్లల్లో దైవ స్వరూపులు కొందరైతే, దానవ భయంకరులు మరి కొందరు. కరువు కాటకాల దుర్దినాల్లో పిడికెడు కూటికై అలమటించిన వేలాది మంది కడుపులు నింపిన సాక్షాత్తు అన్నపూర్ణమ్మ చల్లని తల్లి జగన్నాథపురం కొల్లు వీరయ్య గారి భార్య వరమ్మ, జమీందారిణి లచ్చమ్మా రావుగారి ఆపద్ధర్మ దివాన్– పొట్టపొడిస్తే అక్షరం ముక్క లేని మల్లం పాపన్న కొంపలు ముంచే తెలివితేటల ధణి, సిద్ధార్థ కరువు (1919) కాలంలో కరువు పాటల్ని గుండెలో కరిగేలా వూరూరు తిరిగి పాడిన చాత్తాద వైష్ణవుడు తిరుక్కోవళ్లూరు కస్తూరి రంగయ్య, రాజా వెంకట రంగారావుగారి ఆంతరంగికుడు పైరవీదార్ మంగలి శేషయ్య, వేణుగోపాలపురం వాస్తవ్యులు కొల్లు పాపయ్య చౌదరి– మునగాల పరగణాలోని 42 గ్రామాల్లో నడిగూడెంలో వొక్కటైన మొట్టమొదటి హైస్కూలు నిర్మించిన దాన వీరుడు, రాజావారి ఆప్తుడు, ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డ బీరవోలు పాపిరెడ్డి – ఇలా ఎంతో మంది పుణ్యాత్ముల్ని స్మరించారు గ్రంథకర్త. సేసిన వారికి మరి సేసినంతే పుణ్యమంటారు కదా తాళ్లపాక అన్నమయ్య!

గుడిపూడి సుబ్బారావు గారి 'మునగాల పరగణా కథలు– గాథలు' కథా సంకలనమా? గాథా కోశమా? పరగణా చరిత్రా నన్నడిగితే ఈ పుస్తకం ఓ లఘు విజ్ఞాన సర్వస్వం! అక్షరజ్ఞానం లేనివాళ్లు తమ చతురోపాయాలవల్ల మునగాల పరగణా పారుపత్తే దార్లై అందలమెక్కి వూరేగారు. ఏనుగెక్కి వూరేగిన దివాన్లు, పదవి కోల్పోయి అజా పజా లేకుండా పొయ్యారు. కల్లు, సారాయి కంట్రాక్టు చేసి లక్షలు గడించిన మర్యాదస్తులూ, ఆబార్కీ వ్యాపారంలో దివాళా తీసి, బుక్కా ఫకీర్లయిన గౌరవనీయులూ మన కిక్కడ తారసపడతారు. రేపాల లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్లల్లో ఆబాలగోపాలం ఆనందోత్సాహాలతో, కన్నీటి వీడుకోళ్లతో సెలవు తీసుకునే మరపురాని దృశ్యాలు మనమిక్కడ చూడగలం. ఈ పుస్తకంలోని 44వ అధ్యాయం **'పీసు మామిడి చెట్టు'** (పేజీలు: 285– 291) ఇది గ్రంథకర్త ఏండ్లు పూండ్ల నాటి తియ్యని జ్ఞాపకాల కోశం. సొంతవూరి, పరస్థలాల నానాజాతి ప్రజల మధురానుభూతుల మంజుష. చిన్నతనంలో సావాసగాళ్లతో కలిసి పీసు మామిడి చెట్టెక్కి కోతి కొమ్మచ్చి ఆట ఆడటం, ఆ తియ్యని రసాలూరు మామిడి పళ్లు కోసం రసం జుర్రుకోవడం– ఆ చెట్టు కింద గారడివాళ్లు, శారద కాండ్లు, పగటి వేషగాళ్లు, చిందులోళ్లు, డక్కలి వాళ్లు మొదలైన సంచార జాతుల వాళ్లు ఎన్నెన్ని నెలల పాటు బసచేసి, బతుకుబండిని ఈడ్చారో! ఈ మామిడి చెట్టు కిందే వూరి వాళ్లు తమ పిల్లల పెళ్లిళ్ల ఎదురుకోళ్లు జరుపుకొని మురిసి పొయ్యారో!!

ఎంతో భావుకులైన గుడిపూడి సుబ్బారావు గతకాలం నాటి రోజుల్ని జ్ఞాపకం చేసుకుంటా విషాదంలోకి వెళ్లిపోతారిలా **"గడిచిన జీవితంలో ఎందరో పరిచయస్థులు– బాల్య మిత్రులూ, మావూరి అనేక కులాల వాళ్ళు అనేక మందిలో కొద్దిమంది తరచుగా గుర్తుకు వస్తుండడంతో నిద్రపట్టని రాత్రులతో సహవాసం అలవాటయి పోయింది. నా జ్ఞాపకాలు తరుచుగా – నన్నొదిలి పోయిన వారి గురించే. నా ఆలోచనలు తీగల్లా సాగడం నన్ను పిచ్చివాణ్ణిగా చేస్తున్నాయి."** (పేజి: 286)

ఇవి ఓ పిచ్చివాడి జ్ఞాపకాలు కానేకావు. తలపండిన ఓ తాతయ్య తీపి, చేదు అనుభవాల దొంతరలు. అందరికీ మంచివాడు అనంతయ్య లాగా జీవించి, చన్న కాలం కన్నా, వున్న కాలం మరింత ఘోరంగా వుంటున్న దేమా అని తలపట్టుకునే ఓ పెద్దాయన తలపుల దుమారాలు!



# “నా భార్య బీడీలు చేసి కూడబెట్టిన పైసలతో ‘దుల్దుమ్మ’ పుస్తకం ముద్రించాను”

## తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవలా పురస్కార గ్రహీత

## శ్రీ నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ గారితో .. మూసీ ముచ్చట

చూసిన సమాజాన్ని, అనుభవిస్తున్న జీవితాన్ని అక్షరబద్ధం చేస్తే ఎలా ఉంటుందో చూడాలంటే నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ పుస్తకాలను చదవాలి. వీరి రచనల్లో పల్లెటూరి జీవితాలను, కుల వివాదాలను, పాలకుల దోపిడులను వారికున్న భాషాపరిజ్ఞానంతో వ్యక్తపరుస్తూ వచ్చారు. ప్రత్యేకంగా కులవృత్తులవారి జీవితాలకు వీరి సాహిత్యం అద్దం పట్టింది. ప్రతీ వ్యక్తి జీవితంలో కష్టసుఖాలు, లాభనష్టాలు వంటివాటితో కూడిన అనుభూతులుంటాయి. కాని వాటిని రికార్డు చేసేవారు అరుదు. అనుభవించిన వారు రికార్డు చేస్తే తర్వాత నిర్మించబడే చరిత్ర కొంత వాస్తవాలకు ఆలవాలంగా ఉంటుంది. పూర్తిగా ఇదే ధోరణిలో రచనలు చేస్తూ ‘పేదోళ్ల బతుకుల’ కథల సంపుటి ద్వారా చాలా రకాల కులవృత్తుల జీవితాలు, ‘మా బతుకులు’ కథల సంపుటి ద్వారా గౌడకుల వృత్తిని, ‘సర్పంచ్’ పుస్తకం ద్వారా గ్రామ పాలకులను దౌర్జన్యాలను వివరించాడు. ఇలా ఒక్కొక్క పుస్తకం ద్వారా ఒక విధమైన ఇతివృత్తాలను తీసుకుని మంచి పాఠకులను సంపాదించుకున్నాడు. ఇలాంటి ఈ రచయితకు ఈ సంవత్సరం తెలుగు విశ్వవిద్యాలయం వారు ‘దుల్దుమ్మ’ అనే నవలకు ఉత్తమ నవలా అవార్డు అందించిన సందర్భంగా రచయితతో మూసీ....ముచ్చట.



ఇంటర్వ్యూ
**అట్టెం దత్తయ్య**
ఫోన్ : 9494 715 445

**1. మీ నవల తెలుగు విశ్వవిద్యాలయం అవార్డుకు ఎంపికైన సందర్భంగా మీరు ఎలా భావిస్తున్నారు?**


నా రచనకు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు వస్తుందని నేనెప్పుడు కూడా ఊహించుకోలేదు. అసలు అవార్డుల గురించి నేనెప్పుడు ఆలోచించనేలేదు. 25-02-2023 నాడు సాయంత్రం పూట తాటిచెట్టు మీద గౌలలు గీస్తున్నాను. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ నాకు ఫోన్ చేసి **“దుల్దుమ్మ ఉత్తమ నవలగా ఎంపికైంది”** అన్నప్పుడు మొదట నమ్మలేదు. తరువాత ఆనందం తట్టుకోలేక నన్ను నేనే మరచి పోయాను. గౌడవృత్తిలోని సమస్యల గురించి రాసిన దుల్దుమ్మ నవలకు ఇంత గొప్ప గుర్తింపు వస్తుందని నేనెప్పుడు కూడా ఊహించుకోలేదు. ఈ బహుమతి నా బాధ్యతను పెంచింది. బరువు పెంచింది. నేను ఎలాంటి రచనలు చేయాలో మార్గనిర్దేశం చేసింది.

**2. దుల్దుమ్మ నవల ఇతివృత్తం నాలుగు మాటల్లో చెప్తారా?**

చిన్నప్పుడు ఆట పట్టించడం కోసం దుల్దుమ్మ అంటించేవారు. అంటుకున్న వ్యక్తి గోక్కుంటుంటే అంటించిన వ్యక్తి ఆనందపడుతు హేళన చేసేవారు. ఇలాంటి దుల్దుమ్మ కాయ వివిధ రకాల ఉద్యమాలలో సామాన్య ప్రజలు తమ ఆత్మరక్షణ కోసం ఒక ఆయుధంగా ఉపయోగించుకున్నారని అప్పటి ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. గౌడవృత్తి రక్షణకు ఇప్పుడు గౌండ్లోల్లు దుల్దుమ్మ కాయను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో తెలుసుకోవడానికి గ్రామాలు తిరిగి గౌడవృత్తిలోని సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించుకొని దుల్దుమ్మ నవల రాశాను. దీనిని పద్దెనిమిది అధ్యాయాలుగా విభజించాను.

**3. మీ రాసిన మరో నవల కాకతీయ విశ్వవిద్యాలయంలో పి.జి.లో సిలబస్‌గా పెట్టారు కదా? దానిపై మీ స్పందన?**

మన గ్రామీణ వ్యవస్థలో రెవెన్యూ గ్రామంలో హామ్లేట్ గ్రామాలు అంటే శివారు గ్రామాలు ఉంటాయి. గౌడవృత్తిపై పన్ను వసూలు కాని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కాని రెవెన్యూ గ్రామం కేంద్రంగా అమలవుతాయి. శివారు గ్రామాల గౌడ్‌ల దగ్గర అధికంగా పన్ను వసూలు చేసేవారు. వసూలు చేసిన సొమ్ములోంచి ప్రభుత్వానికి ఎంత చెల్లిస్తున్నారో శివారు గ్రామాల గౌడ్‌లకు తెలిసేది కాదు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలేవి శివారు గ్రామాల గౌడ్‌లకు అందేవి కావు. ఇలా శివారు గ్రామాలు అణచివేతకు




గురైనాయి. వివక్షకు గురైనాయి. దోపిడీకి గురైనాయి. ఇలాంటి పరిస్థితి లోంచి బతుకుతాడు పుట్టింది. సమ న్యాయం జరగనప్పుడు బతుకుతాడు లాంటి రచనలు సహజంగానే పుట్టుక వస్తాయి. ఇలాంటి నవలను సిలబసుగా పెట్టడం వల్ల కొత్త జీవితాలను అధ్యయనం చేసే అవకాశం కలుగుతుంది.

**4. మీ రచనల్లో గౌడవృత్తిని గురించే రాశారా?**

లేదు. గ్రామ రాజకీయాల్లో సర్పంచ్‌ల పని తీరు గురించి **'సర్పంచ్'** కథల సంపుటి తెచ్చాను. బహుజనుల కులవృత్తుల అస్తిత్వం గురించి **'పేదోళ్ల బతుకులు'** కథల సంపుటి తెచ్చాను. గ్రామ చావిడి దగ్గర కూర్చుని మాట్లాడుకునే మాటల గురించి, గ్రామస్తులు చెప్పుకునే వ్యథల గురించి **'రచ్చబండ'** కథల సంపుటి తెచ్చాను.

**5. ఏడవ తరగతి వరకే చదివిన మీకు కథలు, నవలలు రాయాలని ఎందుకు అనిపించింది?**

నేను జగిత్యాల మండలం హనుమాజిపేట గ్రామంలో ఒక సామాన్య కల్లుగీత కార్మికుల కుటుంబంలో 11-04-1970లో జన్మించాను. మా కుటుంబంలో నేనే పెద్దవాడిని. తల్లి తండ్రి ఎంత కష్టపడినా తిండికి సరిపోయేది కాదు. అలాంటి సమయంలో ప్రభుత్వం బడిలో మధ్యాహ్న భోజనపథకం ప్రవేశ పెట్టింది. భోజనం కోసమే మొదలుపెట్టి అలా 1985 వరకు ఏడవ తరగతి వరకు చదువుకున్నాను. బొంబాయి వెళ్లినాను. అక్కడ కల్లు దుకాణంలో కొంతకాలం పని చేశాను. అక్కడి పరిస్థితులు నాకు నచ్చలేదు. తిరిగి హనుమాజిపేటకు వచ్చాను. తాటి చెట్లు, ఈతచెట్లు ఎక్కడం, కల్లు గీయడం నేర్చుకొని కులవృత్తిని చేపట్టినాను. జగిత్యాలలోని SKNR డిగ్రీ కాలేజి గ్రంథాలయం అధికారి ఆంజనేయులు సార్ నా దగ్గరకు కల్లు తాగడానికి వస్తుండే. ఆయన సలహాతో 1995లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష రాసి డిగ్రీలో చేరాను. 2002లో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా విధానంలో M.A. తెలుగు పూర్తి చేసి, 2021లో అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో PG diploma in human rights కోర్సు పూర్తి చేసాను. 2022లో (ప్రస్తుతం) అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో M.A. sociology చదువుతున్నాను.

బి.ఎస్. రాములు ప్రోత్సాహంతో సాహిత్యంలోకి ప్రవేశం జరిగింది. మొదటి కథ **'కులవృత్తి'.** ఈ కథకు 5 సెప్టెంబర్ 2000 సంవత్సరంలో విశాల సాహితీ పురస్కారాన్ని అప్పటి హైకోర్టు జడ్జి చేతుల మీదుగా అందుకున్నాను. ఈ కథ సుప్రభాతం వారపత్రికలో 7 మార్చి 2001లో ప్రచురించబడింది.

మొదటి నవల **'బతుకుతాడు'** 2004లో తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో, మిగతా రూపాయలు బి.ఎస్. రాములు పెట్టుకొని అచ్చు వేయించారు. 2006లో పేదోళ్ల బతుకులు, 2008లో మా బతుకులు, 2011లో సర్పంచ్, 2015లో రచ్చబండ తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో, 2017లో దుల్దమ్మ, 2022లో కల్తీ బతుకులు, 2022లో **'గౌడవృత్తి హక్కులు – అభివృద్ధి'** అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ మానవ హక్కుల విద్యా విభాగానికి సమర్పించిన అధ్యయన నివేదిక వంటివి నా ఇతర రచనలు.

**7. కల్పనాత్మక రచనలు చేయడానికి, పెద్ద చదువులు చదవడానికి ఏమైనా సంబంధం ఉందా?**

ఏ సంబంధం లేదు. పెద్ద చదువులు చదవకపోయినా కల్పనాత్మక రచనలు చేయవచ్చు. మన ప్రాచీనులు పెద్ద చదువులు లేకుండానే అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు. సమస్యలను విశ్లేషించగల నేర్పు ఉంటే సరిపోతుంది.

**8. మీ రచనలపై ఏమైనా విమర్శలు ఎదుర్కొన్నారా?**

శివారు గ్రామాల గౌడ్‌ల అస్తిత్వంపై బతుకుతాడు వెలువరించడంతో రెవెన్యూ గ్రామాల గౌడ్‌లకు కోపం వచ్చింది. నా వ్యక్తిగత జీవితంపై ఆరోపణలు చేయడంతో పాటు భయభ్రాంతులకు గురి చేశారు. అలాగే సర్పంచ్ పుస్తకం నుంచి కూడా విమర్శలు ఎదురయ్యాయి. సర్పంచ్‌లు రెండు రకాలు. 1. 'సర్'పంచ్, 2 'సర్పం'చ్. గ్రామాల్లో ఈ ఇద్దరి రాజకీయాలు ఎలా ఉన్నాయో చూపించాను. మమ్ములను సర్పం అంటావా అంటూ కొందరు సర్పంచ్‌లు దూషణకు దిగినారు

**9. మీరు రచనలు చేయడానికి కారణాలు, ప్రేరణలు ఏమిటి?**

నా చుట్టూతా ఉన్న సమస్యలే నన్ను రచనలు చేయడానికి ప్రేరేపించాయి. ప్రపంచీకరణతో గ్రామాల మనుగడ ఛిన్నాభిన్నం అవుతుంది. ఒకనాడు కులాలు, మతాలు వేరయినా గ్రామస్థులు అంతా ఒకే ఉమ్మడి కుటుంబంలా కలసి జీవించేవారు. ఇప్పుడు మతాల మధ్య, కులాల మధ్య అగాథం ఏర్పడింది. ఇలాంటి సమస్యలే నన్ను ప్రేరేపించాయి.

**10. ఇప్పటికి కులవృత్తిని ఆధారము చేసుకొని జీవనాన్ని కొనసాగిస్తున్న మీకు ఇన్ని పుస్తకాలు రాయడం, ప్రింట్ చేయడం కష్టం అనిపించలేదా?**

నా మొదటి పుస్తకం బతుకుతాడుకు 2004లో తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం చేసింది. కానీ పుస్తకం ప్రచురణకు అవి సరిపోలేదు. మిగతా రూపాయలు బి.ఎస్. రాములు సార్ పెట్టుకొని అచ్చు వేయించారు. బతుకుతాడు రెండు వేల కాపీలు అమ్ముడు పోయినాయి. అలా దానికి వచ్చిన రూపాయలతో రెండవ పుస్తకం అచ్చువేశాను. రెండవ పుస్తకం అమ్మగా వచ్చిన రూపాయలతో మూడవ పుస్తకం అచ్చువేశాను. అలా ఒకదాని తరువాత మరొకటి అచ్చువేయిస్తూ వచ్చాను. దుల్దుమ్మ పెద్ద పుస్తకం. దీనిని మాత్రం **నా భార్య సత్తవ్వ బీడీలు చేస్తూ నెల నెల చిట్టీలు కట్టి పొదుపు చేసుకున్న రూపాయలతో అచ్చు వేయించాను.**

**11. మీ బతుకుతాడు నవల బాగా ప్రాచుర్యం పొందింది కదా. దాని గురించి కొంత తెలియ చేస్తారా?**

బతుకుతాడు నవలలో ప్రధాన పాత్రలు నారాయణ గౌడ్ – లచ్చవ్వ. వీరు నా తల్లిదండ్రులు. వారితో పాటు నేను కూడా ఒక పాత్రనే. సమాజం గురించి రాయాలనుకున్నప్పుడు మన గురించే ఆలోచించాలి. ఎందుకంటే మనం కూడా సమాజంలో ఒక భాగమే.

ప్రపంచ సాహిత్యంగా పిలువబడే సాహిత్యంలో నిజానికి ప్రపంచంలోని ఒక ప్రాంతానికి చెందిన ఒక సమూహాన్ని ఉద్దేశించో లేక, ఒక గ్రామాన్ని గురించో, లేదా ఒక కుటుంబాన్ని కేంద్రంగా చేసుకొనో వచ్చిన సాహిత్యమే సంచలనాలు సృష్టించింది. తదనంతరం ప్రపంచ సాహిత్యంగా గుర్తింపు పొందింది. ఒక ప్రాంతం నుండి వచ్చే సాహిత్యంలో ప్రపంచంలోని మొత్తం సమాజాన్ని చిత్రించడం సాధ్యమా? అంటే కాకపోవచ్చు.

**12. మీ సాహిత్యం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశాన్ని అందిస్తున్నారు.**

సాహిత్యం ఎప్పుడూ సమాజ అభ్యున్నతిని కోరేదిగా ఉండాలి. అందుకని సమస్యను పరిష్కరించడానికి రచయిత న్యాయ నిర్ణేత కాదు. న్యాయమూర్తిగా వ్యవహరించే అధికారం రచయితకు లేదు. రచయిత ఒక సాక్షి మాత్రమే. రచనలు భవిష్యత్తు తరాల వారికి నేటి సమస్యలను విప్పి చెప్పడానికి సాక్ష్యంగా ఉండాలి.

**13. కులవృత్తుల మీద మీ అభిప్రాయం?**

భారతీయ సంస్కృతికి చిహ్నం కులవృత్తులే. భారత దేశ సమాజ నిర్మాణంలో కులవృత్తులు ప్రధాన పాత్ర పోషించాయి. భారతదేశ నాగరికత కులవృత్తులపై ఆధారపడి ఉండేది. ఇప్పుడు మార్పులు వచ్చాయి. ఇప్పటికీ కొన్ని కులవృత్తుల ప్రాధాన్యత జీవన సంస్కృతిలో మమేకమైపోయింది. ఉదాహరణకు గౌడవృత్తే...




మనిషి పుట్టిన్నాడు కొల్లుగుంట దగ్గర కల్లు బింది పెడుతారు. ఐదవ రోజు మొల్దారము కట్టిన్నాడు కల్లు గుడాలు. అదొక ఆచారము. కల్లుతో మిత్తి తీసిన తరువాతనే నవవధువు అత్తారింట్లో అడుగు పెడుతుంది. మనిషి చనిపోయే ముందు జీగంజిగా కల్లు తాగిపిస్తారు. చనిపోయిన తరువాత కాటి దగ్గర కల్లు బింది పెడుతారు. దశదినకర్మ (పెద్ద కర్మ) నాడు కల్లు బింది పెట్టకపోతే చనిపోయిన వారి ఆత్మ శాంతించదని గ్రామీణుల నమ్మకము. కల్లు సాక లేకపోతే గ్రామీణ దేవతలు ఆగ్రహిస్తాయని ఒక నమ్మకము. ఇలా ప్రతి కులవృత్తి ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుంది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడేవి కులవృత్తులే.

**14. సాహిత్యంలో అస్తిత్వ రచనలు చేస్తున్న మీరు వాదాలు, ధోరణుల పట్ల మీ అభిప్రాయము.**

వాదాల పట్ల, ధోరణుల పట్ల నాకు ప్రత్యేకమైన అభిప్రాయము ఏమి లేదు. నేను రాస్తున్నది ఏ వాదమో, ఏ ధోరణో కూడా నాకు తెలియదు. నా రచనలు ఏ వాదానికి చెందినవో, ఏ ధోరణికి చెందినవో నిర్ణయించవలసింది విమర్శకులు. నేను చూసిన సమస్యలను రాసుకుంటూ పోతాను అంతే.

**15. మీకు నచ్చిన కథా రచయిత.**

నాకు నచ్చిన రచయితలు మహాశ్వేతాదేవి, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య. మహాశ్వేతాదేవి గారి 'ఎవరిది అడవి' నవల చదివిన తరువాత 'ఎవరిది తాటిచెట్టు' అనే ప్రశ్న పుట్టింది. ఆ ప్రశ్నలోంచే బతుకుతాడు పుట్టింది. బి.ఎస్. రాములు గారి ఇల్లాలు, వరలక్ష్మి కథలు చదివి, కథల్లోని కుటుంబాలను బి.ఎస్. రాములు సార్‌తో వెళ్లి ప్రత్యక్షంగా చూసాను. వాస్తవ జీవితాల గురించి కథలు ఎలా రాయవచ్చో తెలుసుకున్నాను. బతుకపోరు నవల నుంచి మన జీవితాన్ని నవలగా ఎలా రాయవచ్చో తెలుసుకున్నాను. 1998లో అనుకుంట బొంబాయిలో తాటిచెట్లు ఎక్కడానికి జీతం ఉన్న సమయంలో బాంబు పేలుళ్లు జరిగింది. బాంబు పేలుడులో ప్రాణనష్టం నేను కళ్లతో చూశాను. అదే సంఘటనను కాలువ మల్లయ్య నిరీక్షణ కథలో రాశారు. చూసిన సంఘటనను కథల్లో ఎలా రాయవచ్చో తెలిసింది. బతుకు పుస్తకం నవల ద్వారా ఎన్ని సంవత్సరాల కాలాన్ని ఎన్ని పేజీలలో రాయవచ్చో, పాత్ర చిత్రణ, సంభాషణ గురించి ఎలా రాయవచ్చో తెలిసింది.

# గీతోపదేశం



మనము మన పనిని ఫలితం ఆశించకుండా నిర్వర్తించాలి అనేది గీత చెప్పే మొదటి పాఠం. ఫలితం ఆశించకుండా మనస్ఫూర్తిగా పనిని నిర్వర్తిస్తే ఫలితం దానంతట అదే సిద్ధిస్తుంది.

శరీరం శాశ్వతం కాదు. ఆత్మ మాత్రమే శాశ్వతం. మన శరీరం ఒక వస్త్రం వంటిది. వస్త్రం చినిగిపోయిన తర్వాత కొత్త వస్త్రం ధరించినట్లు, ఆత్మ ఒక శరీరాన్ని వదలి కొత్త శరీరాన్ని ప్రవేశిస్తుంది.

ఈ ప్రపంచంలోకి వచ్చినవారు ఏదో ఒక రోజు ఈ ప్రపంచాన్ని వీడి పోవలసినవారే. ఎవరు శాశ్వతం కాదు. కాబట్టి పుట్టుక ఎంత సహజమో చావు కూడా అంతే సహజమైంది. సత్యమే నిజమైంది, శాశ్వతమైంది.

కోపమే అన్ని అనర్థాలకు మూలం. నరకానికి ఉండే ప్రధాన మూడు ద్వారాలలో కోపం ఒకటి. మిగిలిన రెండు మోహం, ఆశ. కోపంలో ఉన్న వ్యక్తి ఆలోచనారహితుడవుతాడు. అప్పుడు విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి పశువులా ప్రవర్తిస్తాడు.

కర్మను అనుసరించేదే బుద్ధి. మనిషి తన జీవితకాలంలో కర్మలను అనుభవించాలి.

ఈ జగత్తులో మార్పు అనేది సహజం. కోటీశ్వరుడు యాచకుడి గాను, యాచకుడు కోటీశ్వరుడు గాను మారవచ్చు. ఏదీ శాశ్వతం కాదు.

ప్రతి మానవుడు ఖాళీ చేతులతో భూమి మీదకు వస్తాడు. ఖాళీ చేతులతోనే భూమిని వదులుతాడు.

నిత్యశంకితుడికి భూమి మీద గాని ఇక ఎక్కడైనా గాని సుఖ శాంతులు లభించవు. ముందు ఎవరైనా తన్ను తాను తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. అప్పుడే సుఖశాంతులకు దగ్గర అవుతాడు. సంతోషాన్ని పొందగలడు.

కోరికలను జయించాలి లేదా అదుపు చేససుకోవాలి. అప్పుడే మనస్సుకు ప్రశాంతత లభ్యం అవుతుంది. కోరికల వెంబడి పరుగెత్తినంత కాలం అశాంతి మాత్రమే దొరుకుతుంది.

జరిగినది, జరుగుతున్నది, జరుగబోయేది అంతా మన మంచికే అని నమ్మేవారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది. మనం నిమిత్తమాత్రులము, అంతా భగవంతుని చేతుల్లోనే ఉన్నది. మనం మన కర్మలను ఫలాపేక్ష లేకుండా నిర్వహించాలి అన్న కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవారికి ఎప్పుడూ మంచే జరుగుతుంది.

ఏ పనైనా కష్టపడితేనే పూర్తవుతుంది.... కలలు కంటూ కూర్చుంటే అణువంతైనా ముందుకు సాగదు ... సింహం నోరు తెరుచుకుని కూర్చున్నంత మాత్రాన వన్యమృగం దాని నోటి దగ్గరికి వస్తుందా...?

మనస్సును స్వాధీన పరచుకున్న వాడికి తన మనస్సే బంధువు. మనస్సును జయించలేని వాడికి మనస్సే ప్రబల శత్రువు లాగా ప్రవర్తిస్తుంది.

దేనికీ నిరాశ చెందక కృంగిపోవలసిన అవసరం లేదు. బలహీనంగా ఉన్నవి నీ పరిస్థితులు మాత్రమే.

దాచి పెట్టిన ధనం పరులపాలు, అందమైన దేహం అగ్ని పాలు, అస్థికలన్నీ గంగపాలు, కొడుకు పెట్టిన తద్దినం కాకుల పాలు, నీవు ఇష్టంగా వాడిన వస్తువులు ఎవరి పాలో? కానీ నువ్వు చేసిన దానధర్మాల పుణ్యఫలం మాత్రమే నీ పాలు. ఇది తెలుసుకొని అందరూ బ్రతికితే ప్రపంచమంతా శాంతిపాలు.

మనిషి భూమిపై తన ధనాన్ని లెక్కిస్తూ ఉంటాడు. నిన్నటికి ఈ రోజుకి నా ధనమెంత పెరిగింది అని. పైనుండి దేవుడు నవ్వుతూ మనిషి ఆయుష్షు లెక్కిస్తూ ఉంటాడు. నిన్నటికి ఈ రోజుకి నీ ఆయుష్షు ఇంత తరిగింది అని.

భగవద్గీతకు మించిన స్నేహితుడు, కాలాన్ని మించిన గురువు ఎక్కడా దొరకడు.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2023

# ఆధునిక తెలుగు పాట – పర్యావరణ స్పృహ

**వర్ధ వేణు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 996 381 5484

ఆధునిక తెలుగు కవిత్వంలో 'పాట'కు ప్రత్యేక స్థానముంది. ఎందుకంటే అన్నమయ్య పాట జానపద, గ్రామీణ, లలిత పదజాలంతో, భక్తి పారవశ్యంతో వేంకటేశ్వర స్వామిని స్వాధీనం చేసుకుంది. రామదాసుగా కంచెర్ల గోపన్న పాట రామభక్తి పారవశ్యంతో పరిజవిల్లింది. గద్దర్ పాట భూపోరాట వారసత్వాన్ని తెలుగు నేలకిచ్చింది. ప్రజాసమూహాన్ని ఉర్రూతలూగించింది. గోరేటి వెంకన్న పాట పల్లె నారు పెడుతుంటే, పల్లెల విధ్వంసాన్ని పాఠకుల కళ్ళముందుంచింది. గూడ అంజయ్య పాట ఊరు వాడా పల్లె పలుగు శ్రమ జీవులదేనని దొరతనాలను ప్రశ్నించింది. సినారె పాట పల్లె సోయగాలతో తెలంగాణ పలుకుబడులను రాసులుగా పోసింది. కిన్నెరసాని పాటలు, వెంకి పాటలు పల్లెమనసులను, ప్రేమలను పులకరింపజేసాయి. శ్రీశ్రీ పాటలు జగన్నాథ రథ చక్రాలను భూమార్గం పట్టించాయి. దాశరథి పాటలు తెలుగు సాహిత్యానికి అభ్యుదయ పంథాను నేర్పాయి. ఇలా తెలుగు పాట జానపదుల్లోంచి పుట్టి జానపద బాణీలను స్వంతం చేసుకొని సమస్త విషయాలను తనలో సంలీనం చేసుకొని లక్షలాది పాఠకులను ఆకర్షించింది. రసమయి బాలకిషన్ ధూంధాం, ఏల్చూరి సోమన్న పాటలు, అభినయ శ్రీనివాస్ పాటలు తెలంగాణ కాంక్షను రేకెత్తించే పాటలు తెలంగాణ ఉద్యమ సమయంలో పాఠకులను ఉర్రూతలూగించాయి. అందెశ్రీ పాట తెలంగాణ గుండె చప్పుడుగా ఉద్యమానికి చేయూతనిచ్చింది. ప్రజానాట్యమండలి, జన నాట్యమండలి పాటలు తెలుగు ప్రజలను భూపోరాట ఉద్యమాలకు సన్నద్ధులను చేసి ఈ భూమి నాది, దున్నే వాడిదే భూమి అనేట్టు చేసింది.

ఆధునిక తెలుగు కవిత్వ రచయితల్లో పాటను ఎన్నుకున్నవారు పర్యావరణాన్ని కూడా ఒక ప్రధాన ఇతివృత్తంగా ఎన్నుకున్నారు. పర్యావరణమంటే ఏంటో, పర్యావరణ స్పృహ కలిగి ఉండి పాటను ఆయుధంగా ఎలా ఉపయోగించుకోవచ్చో ఈ కవులకు బాగా తెలుసు. పర్యావరణ స్పృహ అంటే సూర్యుడు నుండి వచ్చే వేడిమిని హద్దులు మీరకుండా భూమిపై పడకుండా చేయడంలో ఒక భాగం. పర్యావరణ స్పృహ అంటే భూమాతను వివిధరకాల కాలుష్యాల బారి నుండి కాపాడుకోవడం. వాతావరణ కాలుష్యాన్ని నిరోధించడం. గాలి లేనిదే ఏ జీవి బతుకలేదు. కాలుష్యభరితమైన గాలి మనిషి బతుకును దుర్భరం చేస్తుంది. పర్యావరణ పరిరక్షణలో చెట్లు అతి ముఖ్యమైనవి. చెట్టు కర్బన సంబంధిత విషవాయువులను పీల్చుకొని ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతుంది. దీనివల్ల గాలిలోని ఆక్సిజన్ శాతం తగ్గకుండా ఉంటుంది. నీటి కాలుష్యం వల్ల మనిషి అనారోగ్యం



పాలు కావడం మాత్రమే కాకుండా నీటిలో నివసించే జలచరాలు మృత్యువాత బడుతున్నాయి. దీన్ని నిరోధించే రచనలే పర్యావరణ స్పృహగల రచనలు. ప్రకృతి సమతుల్యత కాపాడాలంటే అడవులు, పక్షులు, చెట్లు, జంతువులు, అవి ఉండాల్సిన నిష్పత్తిలో ఉండాలి. కాని అది జరుగడం లేదు. ఇందుకు కారణం మానవ తప్పిదాలే. ప్రకృతి సహజత్వానికి మారుపేరు గ్రామం. గ్రామీణ జీవితం సంస్కృతి, పల్లెలు విధ్వంసానికి గురి అయితే మిగిలేది బూడిదే. గ్రామాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం మనిషి పైన ఉంది. మానవజాతికి గ్రామాల ప్రాముఖ్యతను, ప్రకృతి ప్రాధాన్యతను తెలియజేసేది పర్యావరణ స్పృహగల కవిత్వం. భారతదేశం వ్యావసాయిక దేశం. ఏ దేశమయినా వ్యవసాయం లేకుండా ఆహారపదార్థాలను పండించలేదు. ఆ ఆహార పదార్థాలు విషపూరితాలు కాకుండా రసాయనిక ఎరువులతో కాకుండా సేంద్రీయ ఎరువులతో పండించాలి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే వ్యవసాయ విషయంలో సామాజిక స్పృహ.

అన్ని రకాల కాలుష్యాలను నివారించడానికి చర్యలు తీసుకోవాలి. అందుకు రచయితలు, కవులు మార్గదర్శనం వహించాలి. ఆధునిక తెలుగు కవిత్వం స్పష్టమైన సామాజిక స్పృహతో ప్రాపంచిక దృక్పథంతో ముందుకు పోయినట్టే తెలుగు పాట కూడా పర్యావరణ స్పృహతో కొనసాగింది. పర్యావరణంపై, ప్రకృతిపై అద్భుత పాట కూడా పర్యావరణ స్పృహతో కొనసాగింది. పర్యావరణంపై ప్రకృతిపై అద్భుతమైన పాటలు రాసిన కవులు, వాగ్గేయకారులు గోరేటి వెంకన్న, జయరాజ్ లాంటి అనుభవం కల కవులతో పాటు మాట్ల తిరుపతి, అప్పాల ప్రసాదరాయ, అమూల్య ఆడియో పాటల వీడియోల్లో ఉన్న పాటలు, స్వాతిరెడ్డి సాయిరెడ్డి క్యాసెట్లు, ఆర్. వీరాచారి, అరుణోదయ విమలక్క జబర్దస్త్ జీవన్, సినీ, అభ్యుదయ




కవి సుద్దాల అశోక్ తేజ, నల్లగొండ గద్దర్ నర్సన్న, చక్రవర్తుల కిరణ్, మిర్యాల రామ్, మచ్చ దేవేందర్, మాళవిక లాంటి వాళ్ళు ఉన్నారు. వీరంతా వాగు, నది, చెరువు, చెట్టు, ప్లాస్టిక్, పంచభూతాల నుండి మొదలుకొని సూర్యుడివరకు అన్ని విషయాలపై పాటలు రాసి పర్యావరణ స్పృహ ఈ కాలంలో ఎంత అవసరమో చెప్పారు. తెలుగు కవిత్వంలో 'పాట' పర్యావరణానికి ఇచ్చిన కాంట్రిబ్యూషన్‌ను పరిశీలిద్దాం.

**భూమాతకు ఆవరణం పర్యావరణం – పర్యావరణం**
**భూమి పుత్రులం మనమే సంరక్షకులం – సంరక్షకులం**

అంటాడు. భూమిపై రాసిన పాటలో **అప్పాల ప్రసాదరావు.** భూభాగమంతటినీ ఆవరించుకొని ఉన్న పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత భూమిపుత్రులమైన మనిషిదే నంటాడు. భూమినైనా, దేన్నయినా రక్షించేది, భక్షించేది మనిషే. మనిషి ఆలోచనా ధోరణిలో మార్పు రానిదే పర్యావరణ స్పృహ లేనిదే భూమికి రక్షణలేదు. మనిషికే రక్షణ లేదన్న సందేశమిస్తుందీ కవిత. ఈ భూమాతను రక్షించేది ఆ భూమిపై పనిచేసే భూమిపుత్రులైన రైతులయితే కాలుష్యానికి గురిచేసేది భూమిపై పనిచేయడాన్ని ఆక్రమించుకునేవారే...

**కాలుష్యం కమ్ముకొని వేడి సెగలు కక్కుతోంది**
**మంచు కొండంత కరిగి వరద ముంచుకొస్తోంది**

గ్లోబల్ వార్మింగ్ వల్ల భూమి ఉష్ణోగ్రత పెరగడం అతిపెద్ద ప్రమాదకర అంశం. ఉష్ణోగ్రత పెరగడం వల్ల అంటార్కిటిక్ ప్రాంతం మంచుకొండలు, హిమాలయాలు కూడా కరిగి వరదై పారుతున్న ప్రమాదం. దీంతో సముద్రమట్టాలు పెరుగుతున్నాయి. ఉన్న కాస్త భూమి కూడా నీటిమయమైపోతుంది. గ్లోబల్ వార్మింగ్ ప్రమాదం రావడానికి కారణం కాలుష్యం. అనాలోచితంగా, కాలుష్యనివారణ చర్యలు తీసుకోకుండా పరిశ్రమలు స్థాపించడం, విపరీతంగా ఇంధనం కాల్చడం. ఈ చర్యలవల్ల కార్బన్ ఉద్గారాలు, కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి ప్రవేశించి ఓజోన్‌పొరకు చిల్లులు పడటం, సూర్యకిరణాలు నేరుగా భూమిపై పడటం వల్ల భూమి ఉష్ణోగ్రత పెరుగుతుంది. మంచు కరుగుతుంది. భూమి జలమయమవుతుంది.

ఏ దుకాణం వెళ్ళినా, ఏం కొన్నా ప్లాస్టిక్ కవర్‌లోనే కట్టిస్తారు. ఉప్పు నుండి బంగారం, వజ్రాల వరకు ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, పెట్టెలలోనే ఇవ్వడం నేటి విషాదం. ప్లాస్టిక్ ఎందుకు వాడవద్దంటే ఇలా చెబుతాడు.

**ఈ ప్లాస్టిక్ ప్రాణాలు తీస్తదొద్దు తమ్ముడా**
**ప్లాస్టిక్ వాడకాన్ని అరికడితేనే మంచిదని**
**విషం తెచ్చుకోకయ్య క్యాన్సరొచ్చు నీకయ్యా....**

ప్రతి వస్తువునూ, చివరకు ఆహారాన్ని, కూరలను కూడా ప్లాస్టిక్ కవర్లలో ఇవ్వడం మామూలయిపోయింది. ప్లాస్టిక్ ఆహారంతో పాటు మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. క్యాన్సర్ రావడం అనేది ప్లాస్టిక్ వాడకం పెరగడం వల్లనేనని పరిశోధకుల అభిప్రాయం. ఫ్లోరినేటెడ్ ఉప్పు వాడకం వల్ల థైరాయిడ్ రోగులు పెరిగినట్టే ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ రోగులు పెరిగారన్నది కాదనలేని నిజం.

మట్టి బంగారాన్ని సారం లేని చవిటిగా మారుస్తున్న మనిషి దుర్మార్గాన్ని తప్పు పడుతున్నాడు కవి. వ్యవసాయం లేకుంటే పంట లేదు, పంట లేకుంటే తిండి లేదు. తిండి లేకుంటే బతుకే లేదు. సాగు తద్వారా మట్టి లేకుంటే రాజ్యం రాజు పాలకులంటూ ఎవరూ ఉండరు కదా. మట్టి మాహాత్మ్యం ఇది. తిండి, బట్ట, నీడకు మనిషి పుట్టుకకు మట్టి ఋణం తీర్చుకోవడం అంటే నేల తల్లిని కాలుష్యం నుండి కాపాడుకోవడమే. **మాట్ల తిరుపతి** మట్టి తల్లిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని, మూలాధారమైన మట్టిని కలకాలం కలుషితం కాకుండా ఉండాల్సిన అవసరాన్ని తెలిపే మంచి పాట రాశాడు.

**తల్లి నీ గుండెలపై భూలోకాన్ని ఊయలలూపే**
**ధరణి దండాలమ్మ అమ్మ మా నేలమ్మ**
**మట్టిని ముద్దాడుకుందాం మట్టిని కాపాడుకుందాం**
**మట్టి పరిమళాల అందం రేపటి తరాల భవితకు అందం**
**॥తల్లీ నీ॥**

ఆకాశం నుంచి వచ్చే ఇనుకులధార భూమి ఒడిలో నదులై పారుతున్నాయి. భూమాత హృదయాన్నే పాన్పుచేసి జీవకోటికి ప్రాణం పోస్తుంది. మణులు, మాగాణాలన్నీ భూమాత శరీరానికి అలంకారాలుగా ఉంటే కొండలు ఆమె శరీరంపై మెరిసే నగలు. మానవజాతి ఏమిచ్చినా మట్టితల్లి ఋణం తీరదంటాడు కవి. మానవజాతి తాను నివసించగలిగే ఏకైక స్థలమైన మట్టితల్లికి ఎంతగా రుణపడి ఉందో చెప్పే పాట ఇది.

**మన్ను మలినమై పోతే మన బ్రతుకు సమాధి కాదా**
**మానవ ఉనికి గతి తప్పి మనుగడ కనుమరుగైపోదా**

అన్నిటికీ మొత్తంగా మనిషి మొదలుకొని అన్ని జీవరాశులకు ఆధార భూతమైన మట్టి తల్లి మలినమైతే, కాలుష్య భరితమైతే మానవ ఉనికే మాయమైపోతుందన్న సందేశాన్నిస్తుంది ఈ పాట. స్టీఫెన్ హాకింగ్ చెప్పిన మానవ మనుగడ భూమిపై ప్రశార్థకం కాకుండా ఉండాలంటే మనిషిని మనిషి నిలబెట్టుకునేందుకు మట్టిని గుండెకు హత్తుకునేలా సందేశమిస్తుంది.

మాళవిక సింగర్ కాలుష్యంపై పాడిన పాట భూమాత కడుపుకోతలో అనుభవిస్తున్న విషయాన్ని తెలియపరుస్తుంది.

**ప్లాస్టిక్ విషసర్పం పడగ విప్పే నేడు**
**ప్రకృతినే వణికిస్తూ నవ్వుతుంది చూడు**
**జీనదులు కాలుష్యం పెంచే పెనుభూతమిది**
**సముద్రాల నలుముకున్న కాఠిన్యపు రక్కసిది**
**జీవజాలమవుతున్నది అతలాకుతలం**
**మానవాళి మనుగడకు ఇది మరణాభరణం**

ప్లాస్టిక్ భూతం వల్ల భూమాత తద్వారా మానవజాతి ఎదుర్కొంటున్న ప్రమాదాలను, విధ్వంసాన్ని ఈ పాటలో పొందుపరిచారు.

పర్యావరణ పరిరక్షణకై నేచురల్ కేర్ ఇన్నోవేషన్ సర్వీస్ లాంటి సంస్థలు పర్యావరణ కాలుష్యంపై ఉద్యమాలు చేస్తున్నాయి.

ఒకప్పుడు మూసీ నది నీళ్లు స్వచ్ఛంగా హైదరాబాద్ తాగునీటి అవసరాలను ఇచ్చేవిగా ఉండేవి. నైజాం నవాబు కాలంలో హైదరాబాద్ అద్భుతమైన అండర్ గ్రౌండ్ సిటీ ఆఫ్ బాంక్స్‌గా ఉండే ప్రఖ్యాతలు గాంచింది. కానీ క్రమక్రమంగా విపరీతంగా పెరిగిన జనాభా, పరిశ్రమలు అందుకు తగ్గట్టుగా కాలుష్య నివారణ చర్యలు తీసుకోకపోవడం వల్ల నగరం కాలుష్యభరితమైంది. మూసీ నది మురికి కూపమైంది. చెరువులు కుంటలు ఉద్యానవనాలు కాలుష్య ఆక్రమణకు గురయ్యాయి. అక్రమ కట్టడాల వల్ల పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థ దెబ్బ తింది. వర్షాలు వస్తే ముంపుకు గురయ్యే ప్రాంతాలు ఎక్కువయ్యాయి. ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల పాత నల్గొండ జిల్లాలో ప్రజలు బోదకాలుతో బాధపడేవారు ఎక్కువైనారు.

మిషన్ భగీరథ నీళ్లు తాగునీరుగా వచ్చిన తర్వాత నల్గొండ జిల్లా బోదకాలు ఫ్లోరైడ్ సమస్యకు కొంతవరకు పరిష్కారం లభించింది

**సాగునీరు తాగునీరు స్వచ్ఛమైన గాలి లేక**
**సకల జీవరాసులన్నీ అంతరించిపోతున్నాయి**
**సేంద్రియ ఎరువులు లేక భూసారం తగ్గిపోయే**
**సంకటాల పాలయ్యే చావు దగ్గరవుతున్నాం**

నీటి కాలుష్యం ఫ్యాక్టరీల నుండి వచ్చే విషవాయువుల కాలుష్యం కాలుష్యంతో కొన్ని ప్రాణులు అంతరించిపోతున్నాయి. జీయో వైవిధ్యం రచించడం వల్ల అనేక పర్యావరణ సమస్యలు. ఒకప్పుడు గ్రామాల్లో



ఆవుల మందలు ఎడ్లమందలు, బండ్లమందలు, గొర్రె మందలు, పందుల మందలు విపరీతంగా ఉండేవి. ఆ పశువుల ఎరువు చెత్తాచెదారం పుల్లపెట్టి తయారుచేసిన కాంపోజిట్ ఎరువులను సేంద్రీయ ఎరువులుగా పొలాలకు వాడేది. దీంతో భూసారం పెరిగేవి కానీ క్రమక్రమంగా ఆ పశువుల పెంపకం తగ్గి సేంద్రియ ఎరువుల వాడకం తగ్గిపోయింది. విపరీతంగా రసాయనిక ఎరువులు వాడుతున్నారు. వీటివల్ల భూసారం తగ్గి కొన్ని ఏళ్లలో భూమి నిస్సారమైనదిగా మారే ప్రమాదం ఉంది.

పల్లెటూర్లలో వాగులు, చేదవాగులు, చెలిమెలు, చెరువుల లాంటివే నీరు లభించే రిసోర్స్ సెంట్రల్ వాగుల్లో స్నానాలు, సినిమాల్లో కమ్మటి నీళ్లు తాగడం లాంటివి ప్రతి ఊళ్లోనూ జరిగేవి. బతుకమ్మ వాగులు, పెద్దవాగులు మచేటి వాగులు ఆయా ఊర్లలోకి సంబంధించిన వాగులు ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు ఈ వాగులు అన్ని కాలువల్లోనూ పారుతూ సజీవంగా ఉండేవి. గ్రామస్థుల తాగునీటి సాగునీటి అవసరాలను తీర్చిన వాగులు ఉన్నాయి. నిజానికి వాగులంటూ లేని ఊరు ఉండదు. చిన్న చిన్న వాగులన్నీ కలిసి నదిగా, నదులన్నీ సముద్రంలో కలుస్తాయి. సాధారణంగా చెరువు నీళ్ళు మొత్తళ్ళు దుంకి పారి పూతతో ఏర్పడిన వాగులే ఎక్కువ. మరికొన్ని వర్షపు వరద పూతలతో వాగులుగా ఏర్పడతాయి. వాగు యొక్క ప్రాముఖ్యత గురించి ఊరికి ప్రాణం లాంటిదైన వాగు అనేక కారణాలవల్ల ఎండిపోవడం గురించి గోరేటి వెంకన్న రాసిన ఆ పూతరేఖలు క్యాసెట్ నుంచి తీసుకున్న పాట ఇది. గోరేటి వెంకన్న సామాజిక పల్లె కవి ప్రతిభావంతులైన వాగ్గేయకారుడు.

**వాగు ఎండి పాయేరా – పెద వాగు తడిపేగు ఎండిపోయేరా**
**గంతులేసిన ఇసుక తీరం – గరుగు నేలలై పోయినాయి**
**దుంకి కయ్యలల్ల కంప సెట్లు మొలిసినాయి**
**గాలి కూగే రెల్ల పొదులు జీవులెండి పోయినాయి**

పల్లెలపై సంపూర్ణ అవగాహన ప్రేమ, ప్రకృతి చూపించే ఆ తత్వం ఉంటే తప్ప ఇలాంటి కవిత్వం రాయడం సాధ్యం కాదు. ఆడిన, పాడిన, ఎగిరి దూకిన, ఈత కొడుతూ సంబరాలు పడ్డ వాగు ఎండిపోయిందని వాపోతున్నాడు వెంకన్న. వాగులో ఉండే




ఇసుకలో ఆడుకోవడం పల్లెల్లో మామూలే. సముద్రతీరాల్లో ఇసుకలో ఎగురుతూ ఆనంద పడే సముద్రతీరం లేని పల్లెల్లో ముఖ్యంగా తెలంగాణ పల్లెల్లో వాగు ఇసుకలో ఆడుకుంటూ సంతోషపడుతారు. వాగు వాగులో ఉన్న ఇసుక మీటలు సహజంగా వచ్చిన ప్రతి అందాలు ఎవరు తయారు చేసినవి కావు. అటువంటి ఇసుక తీరాలు కాలగమనంలో వాగు ఎండిపోవడంతో మాయమై దొరుకు నేలగా మారిపోయాయి. పల్లెల్లో ప్రకృతి ప్రకృతిల బతుకుతూ చెట్ల గుట్టల వెంట కాలువలు కయ్యలు పోటు తిరుగుకుంటూ బతుకుతారు. అందులోని ఆనందం వేరు కానీ క్రమక్రమంగా ఆ కయ్యలే కంపచెట్లుగా మొలిచాయని గాలికి అటూ ఇటూ ఊగుతూ ఆనందాన్ని ఇచ్చే రెళ్ళ పొదలు ఎండిపోయాయని మిలమిల మెరిసే గులకరాళు ధూళియై విడసలయ్యాయని వాపోతాడు కవి. ఈ మార్పులన్నీ ప్రగతి పేరు మీద జరుగుతున్న విధ్వంసం వల్ల జరుగుతున్న పరిణామాలే.

**మాట్ల తిరుపతి** చెట్టు నీరు ప్రకృతి మొత్తంగా పర్యావరణం గురించి రాసిన పాటలు తెలుగు సాహిత్యంలో సముచిత స్థానం ఆక్రమించుకున్నాయి. వాన గురించి, చెట్టకు గల సంబంధం గురించి, చెరువు గురించి, ఆకాశం గురించి రాసిన రేలా పాట పర్యావరణం గురించి మంచి సందేశం ఇస్తుంది.

**నింగమ్మ మురిసేటట్టు – చినుకమ్మ కురిసేటట్టు**
**నాటాలి మొక్కలు మానే పచ్చని వనమై**
**పరుసుకునేటట్టు రేలా రేలా రే రేలా**

అనే చరణంతో మొదలవుతుంది పాట. వానలు సరిగ్గా పడితేనే చెట్లు పెంచడం సాధ్యమవుతుంది. అందుకే తొలి వర్షాలు పడే సమయంలో విత్తనాలు వేస్తారు వనమహోత్సవం లాంటివి చేస్తారు. ఎండాకాలంలో నేలలు బారిన భూమి తొలి చినుకు పడగానే పులకించి నాగేటి సాలు వేయడానికి సహకరిస్తుంది. భూమిని పచ్చదనంతో నేల పచ్చబడుతుంది. విత్తనాలు మొలకెత్తుతాయి. రైతు ఏరువాక సాగుతుంది.

మంచి గాలి కాలుష్య రహితమైన ప్రాణవాయువు నిధి కలిగి ఉన్న వాతావరణం లేక వాయుకాలుష్యంతో సతమతమవుతున్న పరిస్థితులు ఉండటం వల్ల పక్షులు జంతువులు కూడా ఎగిరిపోయే పరిస్థితులు మంచిపాటగా మలిచి అమూల్య ఆడియో క్యాసెట్‌గా అందిస్తున్నాడు జడల రమేష్. మంచి వాయువు కావాలన్నా తద్వారా పక్షులు ఉడతలు లాంటివి బతికి బట్ట కట్టాలన్న చెట్లు కావాలన్నా సందేశం ఇస్తూ రాయబడిన ఈ పాట చక్కని పర్యావరణ సందేశాన్ని ఇస్తుంది.

**పక్షిని పెంచుకున్న – అది ఎగిరిపోయింది**
**ఉడతను పెంచుకున్న – అది వెళ్లిపోయింది**
**చెట్టును పెంచినా.... ఆ...**
**అవి రెండు వచ్చి చేరినయి చెట్టు పైన**

పక్షీ, ఉడత కూర్చోవడానికి నివసించడానికి మంచి గాలిని ఇచ్చే సాధనం చెట్టు పోవడం వల్ల వెళ్ళిపోయాయి. చెట్టు అన్ని జీవులకు ఆధారమైన అతి గొప్ప వస్తువు ప్రాణవాయువు నిధి చెట్టువై కాలుష్యాన్ని ఆపే గొప్ప సాధనం చెట్టు.

అగ్ర రాజ్యాలు అధికార దాహాలు ఆధిపత్య భావాలు సుఖవాంఛలు లాంటి అనేక మానవ దౌర్జన్యాల వల్ల జరుగుతుంది ప్రకృతి విధ్వంసం. మానవజాతి పరస్పరం ప్రేమమయంగా జీవించడానికి బదులుగా ద్వేషపూరిత కక్షల వల్ల విషక్రిములను వాతావరణం ద్వారా ఇతర దేశాల పైకి పంపడం జరుగుతుంది. కరోనా వైరస్ లాంటి సహజంగా వచ్చినవే. ఏమైనా ప్రకృతి విధ్వంసం వల్ల అనేక వైరస్లు వచ్చే ప్రమాదం ఉంది. వాటిని మానవజాతి సంరక్షణ ధ్యేయంగా సరిహద్దు భేదాలు మరిచి ఎదుర్కోవాలి. మానవుడి వల్ల ప్రకృతి విధ్వంసం ఎలా జరుగుతుందో తత్ ఫలితాలు ఏంటో చక్రవర్తుల కిరణ్ కరోనా వైరస్ పై పాట ద్వారా తెలియ జేస్తున్నారు. పర్యావరణ సంరక్షణ స్పృహతో వచ్చిన మంచి పాట ఇది.

**ఊపిరైనా ఆడనీయని సూక్ష్మ జీవికి ప్రాణమిచ్చి**
**ఇంటి గడపను దాటనీయని ఆంక్ష మనకు తనువిధించే**
**మనిషి చేసిన మలినమంతా కడిగిపారేస్తోంది నేడు**
**ప్రకృతిలోన వికృతవిలయం మనిషి తప్పుల ఫలితమే**
**ఇప్పుడైనా మారకుంటే మనిషి జాతికి అంతమే**

కంటికి కనిపించని వైరస్ మానవజాతి నంతటిని గజగజ వణికించింది. గడపను దాటనీయకుండా శిక్ష విధించింది. మనిషి చేసిన మలినాల ఫలితమే కరోనా అంటాడు కవి. కరోనా వైరస్ బీభత్సం దృశ్యాలను చూసైనా మానవజాతికి ప్రకృతి పరిరక్షణ పర్యావరణ స్పృహ కలిగితే మంచిది. మానవ తప్పిదాలనిలా చెబుతున్నాడు ఈ పాటలో

**తల్లి గుండెను చీల్చినం తవ్వి కొండలు కూల్చినం**
**నీటిలోతుల లోన చమురుబావులు వెతికినం**

**పొలాలన్నీ ప్లాట్లు చేసి చెరువులెన్నో పూడ్చివేసి**
**అంతరిక్షం దున్నినం**

ప్రకృతిని ధ్వంసం చేసే దిశగా సాగుతూ మనిషి మనుగడకు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పంట పొలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం గనులు తవ్వుతూ భూమిని ఖాళీగా ఉండేదిగా తయారు చేయడం వల్ల భవిష్యత్తులో ఆహారపదార్థాల కొరత భూకంపాల తీవ్రత పెరుగుతున్నాయి. కరోనా విధ్వంసానికి గురైన మనిషి తన ఆలోచన ధారను మలుచుకుంటే భవిష్యత్తు శూన్యం అన్న నిజాన్ని తెలుసుకోవాలని ఈ పాట ద్వారా కవి సందేశాన్ని ఇస్తున్నాడు.

**మట్టిని తాకిన చేతులకు మరి మరీ దండాలో**
**మొక్కలు నాటిన చేతులకు పరి పరీ దండాలో**

ఇలా మాట్ల తిరుపతి ఆ మట్టిని తాగిన చేతులకు మొక్కలు నాటిన చేతులకు దండం పెదుతున్నాడు. మట్టి ఎదపై మొక్కలు నాటడాన్ని మించిన ఆనందమైన కార్యమేముంటుంది. భూమికి ఆ మొక్కలు నాటడం ప్రకృతి పైలంగా పచ్చని రంగులద్దడమే.

**ఆ.... ఆ.... వేల ఏండ్ల చరితను తన వేరులల్లో దాచెను**
**సంచార జాతులు ఊర్లకు వస్తే చెట్టుసెద దీసెను**
**ఎన్నోమిగా జీవులకు తన గూటిలో చోటిచ్చెను**
**తరతరాలకు చరితకు ఆనవాళ్లుగా ఫలాలను అందించెను**

సంచార జాతులకు, మూగజీవాలకు నీడనిస్తూ, చోటునిస్తూ ఉన్న చెట్టు తరతరాల చరితకు ఆనవాలు ఫలాలను ఇస్తుంది. పండుటాకులు, ఎండుటాకులు రాలిన మారాకు తొడిగి లేత చిగుర్లకు ఊపిరులు పోస్తుంది చెట్టు.


**నరికినా ఇగురెళ్ళురా కష్టాలకోర్చే తల్లిరా**
**నలుగురి ఆకలి తీర్చగా ఆరాటపడుతుందో**

రాళ్లతో బాధిస్తే మనకు కమ్మటి పండ్లని ఇచ్చే చెట్టు మానవ జీవితానికి ఆదర్శం కావాలన్న సందేశంతో ముగుస్తుంది. పాట చెప్పుకున్న ఈ విశాల మానవీయ గుణాన్ని మనిషి అలవర్చుకుంటే పర్యావరణ విధ్వంసానికి పాలు పడదు.

జయరాజు ప్రజలు మెచ్చిన ప్రజాకవి. ప్రకృతిని హృదయానికి హత్తుకొని ఆరాధించే ప్రకృతి ఆరాధకుడు. స్పష్టమైన పర్యావరణ స్పృహ కలిగి ఉన్న ప్రకృతి కవి చెట్టు వివిధ సందర్భాల్లోనూ మనిషికి ఎలా తోడు నీడై ఆదుకునే బంధువై ఉంటుందో పచ్చని చెట్టును నేనురా పాట ద్వారా తెలుపుతున్నాడు జయరాజు.

**పచ్చని చెట్టును నేను రా పాలు గారే మనసు నాది రా**
**కొమ్మును నేరెమ్మను నీకు తోడుగా ఉండే అమ్మను**

అనే పల్లవితో ఈ పాట ప్రారంభమవుతుంది




**మీ పొలమును దున్నిన నాగలై - పంటను మోసిన బండినై**
**అమ్మమ్మ చేతిలో కవ్వమై - తాతయ్య చేతిలో కర్రనై**
**అమ్మ పాటతో ఊగిన ఊయలై - ఆ పాడేటి పిల్లల గ్రోవినై**

మానవ జాతికి రకరకాలుగా ఉపయోగపడుతూ ఉంటుంది చెట్టు. అంతేకాదు ఆకాశంలో విహరించే మబ్బుల్ని చెట్టు చల్లగాలితో వానగా మలుస్తుంది. చేను చిలుకల్ని వానలతో తడిపే సాధనం చెట్టు. చెడుగాలిని తాను శాసిస్తుంది. ప్రాణవాయువును మనకు ఇచ్చే పరోపకారి చెట్టు. కనువిందు చేసే పూలను ఆకలిని తీర్చే పనులను ఇచ్చే చెట్టు అలసిపోతే నీడనిచ్చే చల్ల గాలిలో శరీరాన్ని తడిపే సాధనం చెట్టు. ఎగిరే పక్షులకు గుడి నుంచి ముద్దుగా పెంచేది, లేడి పిల్లల్ని ఒడిలో దాచుకునేది చెట్టు. అడవిలో తపస్సు చేసుకునే మునుల్ని సాధించి నీ చెట్టు దుఃఖ నివారణ ఔషధమైన బౌద్ధ నైతిక ధర్మాన్ని ప్రపంచ మానవాళికి ఇచ్చిన బుద్ధుడికి జ్ఞానోదయం అయింది. గయలోని బోధివృక్షం కిందనే. బోధివృక్షం సిద్ధార్థ గౌతముని బుద్ధుని చేసింది ఇంతకంటే గొప్ప విషయం ప్రపంచంలో ఏముంది.

ప్రకృతి రక్షణ మానవజాతికి రక్షణ కవచం ప్రకృతిని కాపాడుకుందాం మానవజాతిని రక్షించుకుందాం.

**వృక్షో రక్షతి రక్షితః ధర్మో రక్షతి రక్షితః**
**ప్రకృతితో రక్షతి రక్షితః పర్యావరణ రక్షితి రక్షితః**

పర్యావరణాన్ని మనం రక్షిస్తే పర్యావరణం మనల్ని రక్షిస్తుంది.

# రాలుతున్న మొగ్గలు

ఓ నా దేశమా గాఢనిద్రలో
మత్తులో ఊగి గమ్మత్తులో జోగుతున్నది
కళ్ళు లేని కబోదులు రాజ్యమేలుతున్నాయి
గుంటనక్కలు మాటు వేసినాయి

చేప పిల్లలు నడిసంద్రంలో
అలల ధాటికి ఊపిరి వదులుతున్నాయి
అన్నెం పున్నెం తెలియని
అమాయక బిడ్డలపై ఎగబడుతున్నాయి

మానవత్వం మంటలో మాడి
మసవుతుంటే
నా కులం కాదని రాజ్యం చోద్యం చూస్తుంటే
ఎవరిని అడగాలి...
ఏమని చెప్పాలి
ఎవరిపై మన్ను పోయాలి...

కాళ్ళ సందులల్లో ఏముందిరా!
అది పుట్టిన దారని మరిచిపోకురా...
సృష్టికి మూలం అదిరా...
గడ్డిపోచవు...
సృష్టిలో నరుడా....

డెబ్బైఐదేండ్ల స్వాతంత్ర్యమా?
నీవు ఎక్కడ
కండ్లు తెరిచి చూడమ్మ
మానవ మృగాలు పట్టపగలే
వెంటాడి వేటాడుతున్నాయి
పసి మొగ్గలు రాలిపోతున్నాయి

అమ్మాయిలకి అండగా నిలబడుదాం
రాలుతున్న బంజారా మొగ్గలకు రక్షణనిద్దాం.

**బాటసారి**
ఫోన్ : 9440 174 050

# మా చిరునామాలు

నాలుగు కూడళ్ళలో...
కూడు కోసం వెతికే...!
కుటిలం లేని దుబారా జీవులం.

చుట్టూరా చెత్త కుప్పలే...?
మాకు జీవం పోసే సత్రాలు.
సమస్త విశ్వమునకు....!
ఋణగ్రస్తులయ్యాము.

మా అభాగ్య జీవనం
వంకల, డొంకలతో...
కుళ్ళిపోయిన మట్టి దారులు.
ఏ అవరణాన్ని ఆశ్రయించిన...
తిట్లదండకం తూర్పారబట్టినట్లే

రోడ్డు ప్రక్క బొంగుల్లోనో
బస్టాండ్ లోనో ...?
మా రాజభవంతులు
దారి చౌరస్తాల్లోని బొమ్మలే
మాకు ఆత్మబంధువులు....
మా మనుగడకు చిరునామాలు

ఈ సమాజ గర్భంలో....!
మేము ఎల్లప్పుడూ నెలలు
నిండక చచ్చే శిశువులమే

చెలామణిలో లేని రూపాయిలం
చెల్లినా నచ్చని మనుష్యులము
ఈ జన్మ దేనికి సార్థకమో....
తెలియని ...
మా భవిష్యత్ సిగ్గుపడుతుంది.

అలిఖిత వ్యవస్థానిర్మాణానికి
కర్త, కర్మ, క్రియ....!
మా అస్తిత్వమే .

**ముత్యంపేట గంగాధర్**
ఫోన్ : 9704 118 352

# 'ఒగ్గు' జానపద కళారూపం – విశిష్టత

**ధరంసోత్ సరిత**, తెలుగు పరిశోధక విద్యార్థిని, హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఫోన్ : 6300 428 155

ఒగ్గు అంటే శివుని చేతిలో ఉండే దమరుకం. ఇది అచ్చమైన దేశీయ పదం. ఒగ్గునే జెగ్గు,జగ్గు అని కూడా పిలుస్తారు. వివిధ తెలుగు భాష ప్రాంతాల్లో ఈ కళారూపం ఉన్నప్పటికి తెలంగాణా ప్రాంతంలో ఎక్కువగా కనిపిస్తుంది. మన ప్రాచీన లాక్షణికులు, వైయ్యాకరణులు ధమరుకం నుంచి అక్షరాలు ఉద్భవించాయని చెప్పారు. అలా మొత్తం అక్షరాల పుట్టుకకి కారణమైన ధమరుకాన్ని ఒక కళారూపానికి పేరుగా పెట్టి దానికి పూజార్హతని కల్పించిన కళారూపం ఒగ్గు కథాగానం మాత్రమే.

ఒగ్గుని వాద్యంగా వాడి కథను చెప్తారు. కాబట్టి ఒగ్గు కథ అని పేరు వచ్చింది. ఈ కథలు శైవ మతానికి సంబంధించినవనీ మల్లన్న, బీరప్ప కథలు ప్రారంభంలో చెపుతూ వుండేవారనీ, అదే కాక గొల్ల కురుమ కులంవారే ఈ కథలు చెప్పేవారనీ, బీరప్ప, మల్లన్నలు వీరి కులదేవతలనీ, అందుకనే వీళ్ళను ఒగ్గు గొల్లలు అని కూడా అంటారు (డా. బిట్టు వెంకటేశ్వర్లు, కరీంనగర్ రాష్ట్రీయ జానపద కళోత్సవాలు).

తెలంగాణాలో ఒగ్గుకథ చెప్పే బృందాలు కరీంనగర్, వరంగల్, నల్లగొండ, హైదరాబాదు జిల్లాలో వందకు పైగా ఉన్నా కొన్ని దళాలు మాత్రమే బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటిలో ప్రధాన కథకులు కీ.శే. చుక్క సత్తయ్య (ఒగ్గుకళ సమ్రాట్), నేర రామస్వామి తెలంగాణ లోని కరీంనగర్ జిల్లాలో వేములవాడ ప్రాంతంలో అత్యధిక ఒగ్గుకథ కళా బృందాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా తీగల రాజేశం – నూకలమర్రి (కీ. శే. శ్రీ మిద్దె రాములు గారి ప్రియ శిష్యుడు), మారుపాక శంకర్ (కనగర్తి), గాదర్ల బుగ్గయ్య – అచ్చనపల్లి, బర్మ బీరయ్య, బర్మ తిరుపతి – నిజామాబాద్ బృందాలు పేరుగాంచినవి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లోని జమ్మ మల్లారి కురుమ తొలి ఒగ్గు కళాకారిణి. ఈమె గత 70 సంవత్సరాలుగా కథ చెప్తూ ఉంది ఉత్తమ మహిళ అవార్డు కూడా అందుకుంది.

ఒగ్గు కళారూపం శైవమత వ్యాప్తిలో ప్రచార మాధ్యమంగా ఉద్భవించి ఉంటుంది. ఎందుకంటే పాల్కురికి సోమనాథుడు తెలంగాణ ప్రాంతంలో పుట్టి, శైవమత వ్యాప్తికి విశేషమైన కృషి చేసారు. అటువంటి గొప్పవ్యక్తి ప్రభావం ఈ ప్రాంతంలో కళలపై ఉందన దానికి నిదర్శనం ఒగ్గు కథ. ఈ కథల ఇతివృత్తాల్లో శివుడు కథానాయకుడిగా ఉంటాడు లేదా శివుని అంశతో జన్మించిన వారు నాయకులుగా ఉంటారు. ఉదాహరణకు శివుని తొలి చెమట నుండి బీరప్ప, మలి చెమట నుంచి మల్లన్న పుట్టారని, ఎల్లమ్మ శివుని కూతురని ఆయా కథల్లో వివరిస్తుంటారు. ఒగ్గుకథల్ని తెలంగాణ ప్రాంతంలోని గొల్ల, కురుమలు తమ కుల పురాణంగా భావిస్తారు.



కురుమలు ఈ కథల్ని ఎక్కువ ప్రచారం చేసారు. తరువాతి కాలంలో ఇతర కులాలవాళ్ళు కూడా ఈ కళారూపాన్ని నేర్చుకొని ప్రచారం చేస్తున్నారు.

ఒక నిర్దిష్ట సంప్రదాయంలో బోధన, అభ్యాసం అనేవి సజీవ సంప్రదాయాలు. అవి సాధారణంగా ఒక గురు పరంపరంలో ఆలోచనలు అభివృద్ధి చేయబడతాయి, ప్రసారం చేయబడతాయి. తరతరాలుగా వ్యాప్తి చేయబడతాయి. అలాగే శైవమత ప్రాప్తికై వచ్చిన ఈ కళారూపం తర్వాత జానపద కళారూపంగా, ఆపై సామాజిక స్పృహ నిచ్చే కళగా ఎదిగింది. ఈ కళాప్రదర్శనకు సమయపాలన అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు కానీ నిశితంగా పరిశీలించినట్లయితే తెల్లవార్లు కొనసాగుతాయి అని గమనించవచ్చు. ఒక్కో ఒగ్గు కథ సుమారుగా ఒక గంట వ్యవధి పైనే ప్రదర్శింపబడుతుంది. రాత్రంతా అనేక ప్రదర్శనలు కొనసాగుతాయి. ఒగ్గు కథను నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ప్రదర్శిస్తారు. ఒక వ్యక్తి పాడుతూ ఉంటే మిగతా వారు వంత పాడుతూ ఉంటారు.

ఒగ్గు ప్రదర్శన ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. వాళ్ల వాళ్ల సంప్రదాయం ప్రకారం గంగమ్మ పూజతో మొదలుపెట్టి అనేక దేవతలకు సంబంధించిన కథలను వాళ్ల కథకు అనుగుణంగా ప్రదర్శిస్తూ ఉంటారు. అందులో ఎంతో ఆసక్తికరంగా సాగే విషయం కథ ప్రదర్శిస్తున్నప్పుడు స్త్రీపాత్రని ఒక మగవాడే వేషం వేసుకొని ప్రదర్శించడం. అలాగే కథను ప్రదర్శిస్తున్నప్పుడు వాళ్లు ఆ కథను ఊహించుకొని నటిస్తూ ప్రదర్శిస్తూ ఉంటారు గనుక ఎంతో ఆసక్తికరంగా, రసవత్తరంగా కళ్ళను కట్టిపడేసే ప్రదర్శనగా ఉంటుంది.

జానపద కళలకు మారుపేరు అయిన తెలంగాణలో వివిధ ప్రాంతాలలో నివసించే ప్రజలు ముఖ్యంగా, గొల్ల, కురుమలు తమ సంప్రదాయం ప్రకారం గ్రామ పండుగల, సంప్రదాయ పండుగల, వివిధ వేడుకల్లో ఈ ఒగ్గు కథను ప్రదర్శిస్తారు.



## ఒగ్గు నృత్యం

ఒగ్గుడోలు నృత్యం బృందనృత్యంగా పరిగణించబడుతుంది. కళాకారులు వీరభద్రుని వలె వేషధారణ చేసుకుంటారు. నృత్యంలో పాల్గొనే కళాకారులు ఇద్దరు జంటగా నృత్యం చేస్తుంటారు. గుండ్రంగా తిరుగుతూ ఒకరికొకరు ఎదురుకోలాటం చేస్తుంటారు. ఈ విధంగా ఒగ్గు డోళ్లను వాయిస్తూ, చుట్టూ తిరుగుతూ కోలాటం వేస్తూ, ముఖ్యంగా మల్లికార్జునపై, బీరప్పపై, ఎల్లమ్మదేవిపై పాటలు పాడుతుంటారు. ఈ పాటలను ఒక ప్రధాన గాయకుడు పాడుతుండగా మిగతా వారంతా వంత పాడుతుంటారు. ముఖ్యంగా నాలుగు కూడళ్ళు కలిసే చోట గాని, ఊరు మధ్యలో ఉన్న విశాలమైన ప్రదేశంలో గానీ ఈ కళను ప్రదర్శిస్తారు. నేటి ఆధునిక కాలంలో స్టేజీలపై కూడా ప్రదర్శిస్తున్నారు. శైవభక్తుల లక్షణాలైన కేకలు, గంతులు మొదలైనవి ఒగ్గులో కనిపిస్తాయి

## నృత్య ప్రదర్శన సందర్భాలు

ఎక్కువగా మల్లన్న, బీరప్ప జాతర్లలో, కురుమలు తమ ఇండ్లలో జరుపుకునే వివాహ సమయాల్లో, మల్లికార్జున పండగ, బీరప్ప పండగ, ఎల్లమ్మ పండగ సమయాల్లో, వివాహమైన కొత్త జంటను ఊరేగింపు సమయంలో, గ్రామ దేవతలను కొలిచే సందర్భంలో, బోనాలు





తీసుకొనిపోయే సందర్భంలో, పుట్టమన్ను తెచ్చి సమయంలో, ఇంకా కురుమ, గొల్లల శుభ, అశుభ సందర్భాల్లో ఈ కళను ప్రదర్శిస్తుంటారు. చివరికి కురుమ గొల్లలు ఎవరైనా చనిపోతే వారి శవయాత్రలో సైతం ప్రదర్శిస్తుంటారు.

కురుమ గొల్లలు తమ కుల సంప్రదాయంలో భాగంగానే కాకుండా తమకు కలిగే ఉత్సాహ సమయాల్లో, ఊర్లోని మిత్రుల వివాహ సమయాల్లో, ఇతర ఊరేగింపు సమయాలలో కూడా ఒగ్గు డోలు నృత్యాన్ని ప్రదర్శిస్తుంటారు. అంతేగాక తమకి ఇష్టమైన రాజకీయ పార్టీల ప్రచారాలలో సైతం ఈ కళను ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకుంటుంటారు. తమ వ్యవసాయపు పంటలు అనుకున్న విధంగా పండినప్పుడు, తమ ఇండ్లలో శుభకార్యలు జరిగినప్పుడు ఒగ్గు డోలు నృత్యాన్ని చేస్తుంటారు. కళాకారులు తమ ఆటవిడుపు సమయంలో, తీరిక సమయంలో, ఆనందంగా, ఉత్సాహంగా ఉన్నప్పుడు కూడా ఒగ్గు డోలు నృత్యం చేస్తుంటారు.

## ముగింపు

ఒగ్గుని ఒక జానపద కళారూపంగా గుర్తించి, దానిపై తగు స్థాయిలో పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ ప్రాంతంలో వివిధ జిల్లాల్లో ప్రత్యేకంగా కనిపించే ఒగ్గు కథ అనే జానపద కళా సంస్కృతి విశిష్టతను గుర్తించి భావితరాలకు పరిచయం చేయడం, అందజేయడం మన విధి.

## ఉపయుక్త గ్రంథసూచి

1. డా. బిట్టు వెంకటేశ్వర్లుగారు కరీంనగర్ రాష్ట్రీయ జానపద కళోత్సవాలు.

2. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారు 1992 సంవత్సరంలో ముద్రించిన డా. మిక్కిలినేని రాధాకృష్ణ మూర్తి గారు రచించిన 'తెలుగువారి జానపద కళారూపాలు' అనే గ్రంథం.

3. వికీపీడియా.కం

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5  హైదరాబాద్ మార్చి : 2023

# నల్లగొండ 'లక్ష్మీనరసింహ స్వామి'జాతర

ప్రవీణ్ కుమార్ బొల్ల, ఫోన్ : 99894 75899

కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలు, హోలీ పండుగ ఎప్పుడొస్తుందా, ఎప్పుడు అమ్మమ్మోళ్ళ ఊరికి పోదామా అని రోజులు లెక్కపెట్టుకునేది చిన్నప్పుడు. హోలీ పండుగకి నల్లగొండలో జాతర జరుగుతది. మా అమ్మమ్మోళ్ళ ఊరు మక్తపల్లె, నల్లగొండ గ్రామానికి హామ్లెట్ విలేజ్. రెండు గ్రామాల మధ్య ఉన్న గుట్టమీద, గుట్టకింద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాలు ఉంటాయి. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి ముప్పైయి ఏళ్లు వచ్చే వరకు నల్లగొండ జాతరకి వెళ్లకుండా ఒక్కసారి కూడా లేను. నా బాల్యానికి, మక్తపల్లికి, నల్లగొండ జాతరకి విడదీయలేని అనుబంధం.


చాలాకాలం వరకు నల్లగొండ జాతరలు రెండు ఉన్నాయన్న విషయం నాకు తెలియలేదు. ఇప్పటికీ చాలామంది ఈ అయోమయం లోనే ఉన్నారు. ఈ మధ్యకాలంలో పోటీపరీక్షల పుస్తకాలలో కొన్నిచోట్ల జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామం అని, మరికొన్ని చోట్ల కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గ్రామమని కనిపిస్తుంది. రెండూ నిజమే. ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఈ రెండు నల్లగొండ గ్రామాలుండడం ఆ గ్రామాల్లో గల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల్లో హోలీ పండుగ సమయంలో రెండుచోట్ల జాతరలు జరగడం అందరిలో గందరగోళానికి కారణమైంది. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత వేములవాడ నుండి కొండగట్టుకు వెళ్ళేదారిలో ఉన్న కొడిమ్యాల మండలంలోని నల్లగొండ దేవస్థానం జగిత్యాల జిల్లాలో, కరీంనగర్ నుండి హైదరాబాద్ వెళ్ళే దారిలో ఉన్న తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ దేవస్థానం కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఇప్పుడు మనం మాట్లాడుకునేది కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ జాతర గురించే. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సుమారు పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో, రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న నుస్తులాపూర్ గ్రామం నుండి లోపలికి రెండు కిలోమీటర్ల దూరంలో నల్లగొండ జాతర జరుగుతుంది.

అమ్మమ్మ ఊరికి వెళ్లాలని, అక్కడి ప్రేమలు ఆప్యాయతలను పొందాలని బాల్యంలో చాలామంది పిల్లలకి ఉంటుంది. అందుకు నేనూ అతీతుడిని కాను. బడికి సెలవులు వస్తే మా 'లచ్చవ్వ' వద్ద వాలిపోయే నేను, నల్లగొండ జాతర కోసం సంవత్సరమంతా ఎదురు చూసేది. నా బాల్యంలో మక్తపల్లి అసలైన పల్లెటూరి అందాలతో విలసిల్లేది. ప్రతీ ఉషోదయం నాకో అద్భుతమే. నా మొదటి డెస్టినేషన్ మక్తపల్లి.



హోలీ పండుగకి అయిదు రోజుల ముందు నల్లగొండ లక్ష్మీనరసింహస్వామీ కళ్యాణోత్సవం జరుగుతుంది. ఇక ఆ రోజు నుండే జాతర కోలాహలం ప్రారంభం అవుతుంది. ఒక్కొక్కటిగా బొమ్మల దుకాణాలు, స్వీట్స్ దుకాణాలు పడుతాయి. గత కొన్ని సంవత్సరాలుగా కళ్యాణోత్సవం రోజు అన్నదాన కార్యక్రమాన్ని మా మామ తమ్మిశెట్టి మల్లయ్య కుటుంబం నిర్వహిస్తూ వస్తుంది. హోళి రోజు సాయంత్రం ప్రారంభమయ్యే 'బండ్లు తిరుగుడు' కార్యక్రమంతో అసలైన జాతర ప్రారంభం అవుతుంది. ఇది జాతరలో మొదటిరోజు. నల్లగొండ, మక్తపల్లి, నుస్తులాపూర్ గ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాలలోని అనేక గ్రామాల నుండి వేలమంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం ట్రాక్టర్లు, కార్లు, బైక్‌లు వస్తున్నాయిగాని నా బాల్యంలో వేల సంఖ్యలో ఎడ్లబండ్లు దీటిలతో (కాగాడా) నల్లగొండ గుట్ట చుట్టూ తిరుగుతుంటే రెండు కండ్లు సరిపోయేవి కావు. ఎడ్లబండ్లకు రంగురంగుల కాగితాలు అంటించి, ఎడ్ల కొమ్ములకు రంగులద్ది అందరికన్నా గొప్పగా తయారు చేయడానికి ప్రయత్నించే వారు. మా బామ్మర్దులు సత్యం, సంపత్‌లు ఆరోజు పొద్దున నుండే మా ఎడ్లబండిని, ఎడ్లను ముస్తాబు చేసేవారు. ఆ బండిలో కూర్చోని చేతిలో దీటీ పట్టుకొని గోవిందా గోవిందా అనుకుంటూ వేల ఎడ్లబండ్ల మధ్యలో నల్లగొండ గుట్టచుట్టూ తిరిగిన జ్ఞాపకాలు ఎప్పటికీ చెక్కు చెదరవు.

ఉదయం నుండే మా మక్తపల్లిలో ప్రత్యేకంగా ఒక కార్యక్రమం జరుగుతుండేది. 'శంకరయ్య' దైవత్వం ఉట్టిపడే వేషధారణలో చేతిలో చిరుతలు, కాళ్లకు గజ్జెలతో మక్తపల్లి మొత్తం తిరిగేవాడు. ఇంటి ముందుకు శంకరయ్య రాగానే కాళ్లు కడిగి కొబ్బరికాయ కొట్టి నరసింహావతారంగా భావించి పూజలు నిర్వహించే వారు. మా ఇంటి



ముందుకు రాగానే చిన్నప్పుడు నేను భయపడి ఇంట్లోకి వెళ్లి దాక్కొని తొంగితొంగి బయటికి చూసేది. కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో శంకరయ్య మరణించిన తర్వాత, ఆ కార్యక్రమం నా స్నేహితుడు రాజు కొద్దికాలం నిర్వహించాడు. ఇప్పుడు ఆ సంస్కృతి కనుమరుగయింది.

బండ్ల తెల్లారి జాతర రెండవ రోజు కొద్దిగా ప్రశాంతంగా ఉంటుంది. మూడవ రోజు రాత్రివరకు రథోత్సవం ప్రారంభం అవుతుంది. ఈ రథోత్సవమే జాతరలో అసలైన ఘట్టం. ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి పూజలు నిర్వహిస్తారు. భక్తులు ఆ రథం ఎక్కి మొక్కులు చెల్లించుకుంటారు. వేలమంది మధ్య తోసుకుంటూ ఆ రథం ఎక్కాలంటే భయంతో పాటు అంతకుమించి కుతూహలం కూడా ఉండేది నాకు. నాలుగవ రోజు సాయంత్రం వరకు భక్తులందరూ మొక్కులు చెల్లించినాక జాతర ముగిసేది. ఈ రథం ముందు కోళ్లను, మేకలను బలిస్తారు. వాటి రక్తం అక్కడ ఏరులై పారుతుంది, వాటి తలలు అక్కడ కుప్పలుగా పోగవుతాయి. కొన్ని కుటుంబాలు జాతర జరిగే నాలుగు రోజులు అక్కడే టెంట్లు వేసుకొని ఉంటారు. రథోత్సవం రోజు నల్లగొండ జాతర అత్యంత రద్దీగా ఉంటుంది.

మా బామ్మర్దులు, అన్న, నేను జాతర జరిగే నాలుగు రోజులు సైకిళ్ళ పైన జాతరకి, ఇంటికి తిరుగుతూ ఉండేది. ప్రతీ సంవత్సరం అమ్మమ్మ ఒక్కొక్కరికీ ఒక్కో రూపాయి ఇచ్చేది, ఆ రూపాయితో ప్యాలాల ముద్దలు కొనుక్కునేది నేను. ప్రతీ సంవత్సరం జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే దుకాణాలు కొన్ని ఉండేవి. రంగులరాట్నం నాకొక వింత. దానిని ఎన్నో సంవత్సరాలుగా చూస్తూ పెరిగాను, మా వాళ్ళందరూ అందులో ఎక్కి తిరుగుతుంటే చూస్తూ సంబరపడేది. నాకు మాత్రం ఎక్కే ధైర్యం ఈనాటికి రాలేదు. జాతరలో టూరింగ్ టాకీస్‌లో సినిమాలు చూడడం మర్చిపోలేని అనుభూతి. సగం సినిమా పూర్తికాకముందే వెంట తీసుకెళ్లిన యూరియా సంచులను పరుచుకొని నిద్రపోయేది. జాతరలో ఆకలైనప్పుడు అంగూర్లు ఎక్కువగా తినేది. అలా అలవాటైన అంగూర్లు, ఎండాకాలం వస్తే చాలు వెంటపడీ మరీ నాచేత ఇప్పటికీ కిలోలకు కిలోలు కొనిపిస్తాయి. జాతరలో కొన్న ఉంగరాలు, చైన్లు, కళ్ళద్దాలను అపురూపంగా దాచుకునేది. బొంగరాలు కొనుక్కొచ్చి ఆకిలంతా పొక్కిలి చేస్తుండగా అమ్మమ్మ తిట్టిన తిట్లు గుర్తొస్తే ఇప్పటికీ అది మా మధ్యలోనే తిరుగుతున్నట్లు భ్రమపడిపోతాను.

అమ్మ మాతో తన చిన్నప్పటి జ్ఞాపకాలు పంచుకుంటూ, తాను మేకలను కాస్తూ నల్లగొండ గుట్టంతా కలియతిరిగేదని చెప్పుండేది. గుట్టలోని ప్రతీ గుండు, చెట్టు, పుట్ట అన్నీ అమ్మకు పరిచయమే అని గొప్పగా చెప్తుంటే అంత పెద్ద గుట్ట ఎలా ఎక్కింది, ఎలా తిరిగిందని నాకు ఆశ్చర్యంగా అనిపించేది. గుట్టపైనున్న లక్ష్మీనరసింహస్వామి గుడిని దాటి ఇంకా పైకి ఎక్కితే విశాలంగా ఉంటుందని, కొన్ని నిర్మాణాలుంటాయని, అక్కడి నుండి అన్ని ఊర్లు కనపడతాయని అమ్మ చెప్పినప్పటినుండి పైవరకు ఎక్కాలని కోరిక ఉండేది. కానీ చిన్నప్పుడు మమ్మల్ని అంతదూరం వెళ్ళనిచ్చేది కాదు. కొన్ని సంవత్సరాల క్రితం, నేను తమ్ముడు, చిన్న బామ్మర్ది ఇంకో ఇద్దరు కలిసి గుట్ట చివరివరకు ఎక్కినం. నిజంగా అమ్మ చెప్పినట్లే ఎంతో అద్భుతంగా ఉంది అక్కడి నుండి. పంట పొలాలన్నీ, ఊహల్లోని సుందర దృశ్యాన్ని కాన్వాసు పైన చిత్రకారుడు గీసిన చిత్రంలా అనిపించాయి. ఇండ్లు అగ్గిపెట్టెల్లా, మనుషులు చీమల్లా కనిపించారు. దూరంలోని లోయర్ మానేరు డ్యామ్ సముద్రంలా తోచింది.

జాతర సమయంలో గుట్ట ప్రాంతమంతా **"నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి, గోవిందా.. గోవిందా.."** అనే స్మరణంతో మారుమ్రోగి పోతుంది. గుట్టపైకి దేవస్థానం వరకు ఎక్కడానికి మెట్లు ఉంటాయి. ఎన్నో ఏండ్ల క్రితం ఇక్కడ దేవాలయం నిర్మించారని, పూర్వకాలంలో ఇప్పటికన్నా వైభవంగా ఇక్కడ జాతర నిర్వహించే వారని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతుంటారు. నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి లీలల గురించి, భక్తులను ఆదుకున్న సంఘటనల గురించి ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాలలోని ఎన్నో కుటుంబాల నుండి కులదైవంగా, కుటుంబదైవంగా నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి పూజలు అందుకుంటున్నాడు.

ఈ మధ్య కాలంలో గుట్టకింద దేవాలయాన్ని, ప్రభుత్వం మరియు దాతల సహకారంతో పునర్నిర్మించారు. ఇంకా ఇక్కడ నిర్మాణాలు చేపట్టి భక్తులకు సంవత్సరం పొడుగునా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ పెళ్లిళ్లు కూడా జరుగుతాయి. వసతులను పెంచితే భక్తులకు సౌకర్యంగా ఉంటే దేవస్థానం, జాతర అభివృద్ధి చెందే అవకాశాలు కూడా ఉంటాయి. గుట్ట కింద ప్రతీ ఆదివారం జరిగే అంగడి కూడా అభివృద్ధి చెందుతుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (43) హైదరాబాద్ మార్చి : 2023

# తెలుగులో స్త్రీల ఆత్మకథలు

**డా. వెంకటరామయ్య గంపా,** అసిస్టెంట్ ప్రొఫెసర్, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 995 860 7789

సృజనాత్మక సాహిత్యంతో పాటు వాస్తవ జీవితాన్ని స్త్రీలు ఆత్మకథల రూపంలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ ఆత్మకథలు ఆధునిక సమాజంలో ఉన్న వివిధ అంశాలను తెలుసుకునే చారిత్రక ఆధార గ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి. తెలుగులో ఆత్మకథలకు సంబంధించి పరిశోధన జరిగింది. కానీ స్త్రీల ఆత్మకథలకు సంబంధించిన పరిశోధన జరగాల్సినంత జరగలేదనిపిస్తుంది. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఒక పరిశోధన గ్రంథం వెలువడి నప్పటికీ అది బయట ప్రపంచానికి పరిచయం కాలేదు. ఆచార్య కాత్యాయని విద్మహే స్త్రీల ఆత్మకథల గురించి మాట్లాడడం ఈ వ్యాసానికి మూలం.

సమాజంలో వివక్ష అనేది ఏదో ఒక రూపంలో ఎప్పుడు కొనసాగుతూనే ఉంటుంది. ఆ వివక్షతను అర్థం చేసుకోవడానికి సాహిత్యం ఒక ప్రధాన ఆకారంగా నిలుస్తూ వుంది. చిన్న కథలు, నవలలు, విమర్శలు వంటి అనేక రూపాల్లో సాహిత్యం ఈ వివక్షల నిర్మాణాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించింది. ఈ నేపథ్యంలో రచనలను చదవడం, అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సాహిత్య చరిత్రలో కొన్ని సందర్భాలలో కొంతమంది కవయిత్రులు / రచయిత్రులు కొన్ని విమర్శలకు గురయ్యారు. పలు సందర్భాలలో కొంతమంది మహిళా రచయిత్రులను అవమానించారు, విపరీతమైన విమర్శలు చేశారు. తక్కువ వ్యక్తిత్వం కలిగి ఉన్నారనే పదాలతో నిందించబడ్డారు. ఉదాహరణకు కవయిత్రి ముద్దుపళని కథ. ముద్దుపళని రచించిన రాధికా సాంత్వనం నేడు చాలామందికి తెలుసు కానీ, ఒకానొక దశలో చాలా పెద్ద చర్చే జరిగినట్లు కనిపిస్తుంది. ఇది ఒక మహిళ రాసిన శృంగారకావ్యంగా ప్రత్యేకతను కలిగి ఉంది. పండితుడు, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు రాధిక సాంత్వనంలోని తెలుగు, సంస్కృత భాషల సమ్మేళనాన్ని ప్రశంసించి, అందులోని వర్ణనాంశాలను చూసి దిగ్భ్రాంతికి లోనయ్యారు. కవయిత్రి పై వ్యక్తిగత విమర్శ చేశారు. శక్తివంతమైన గాయని అయిన బెంగళూరు నాగరత్నమ్మ 1910లో ఈ పుస్తకం యొక్క కొత్త సంచికను వెలువరించేవరకు ఈ ప్రకటనలను అందరూ బాగా అంగీకరించారు. ఆ గ్రంథాన్ని, కవయిత్రిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించడమే కాకుండా, అది ప్రచురితమైన సమయంలో సెన్సార్ చేయబడింది, ఆ తరువాత కూడా చాలా సంవత్సరాల పాటు ఈ రచన చాలా నిశ్శబ్ద స్వరంతో మాట్లాడబడింది. ఇందుకు ప్రధాన మరియు ఏకైక కారణం 'స్త్రీ' రాసిన 'శృంగార కావ్యం'. అది అంగీకరించబడని 'సమాజం'ను పరిశీలిస్తే, ఈ




సమాజం పురుషుల సమూహం తప్ప మరేమీ కాదు, ఒక స్త్రీ రాసిన సాహిత్య రూపాన్ని అంగీకరించలేని పితృస్వామ్య పురుషుల సమూహం. ఇది స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన సంఘటన. ఇప్పుడు వివక్షలు మరియు అణచివేతల రూపాలు చాలా మారాయి.

ప్రస్తుతం మహిళా రచయిత్రులను గుర్తించి వారి రచనలను గౌరవిస్తున్నారు. కానీ ఇప్పటికీ పురుష రచయితలతో పోలిస్తే మహిళా రచయితలు అనేక ప్రతికూలతలు, విమర్శలను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ భారతీయ సమాజంలో మహిళలు ప్రతిరోజూ ఎదుర్కొనే సమస్యలు చాలానే ఉన్నాయి. సమాజంలోని పురుషాధిక్యత నుంచి స్త్రీలు వ్యక్తిత్వ, గౌరవ స్వేచ్ఛను సాధించడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సివుంది. శరీరహక్కు, అత్యాచారం, వైవాహిక సమస్యలు, లైంగిక వేధింపులు మొదలైన అంశాలతో పాటు సమకాలీన రచనల్లో ముఖ్యంగా మహిళా రచయిత్రుల ప్రధాన ఇతివృత్తాలు.

తెలుగులో దాదాపు 30కి పైగా స్త్రీల ఆత్మకథలు ఉన్నట్లు విమర్శకుల ద్వారా తెలుస్తుంది కానీ నాకు లభించిన సమాచారం మేరకు వ్యాస పరిమితిని దృష్టిలో ఉంచుకొని కొన్ని రచనలను మాత్రమే సమీక్షించడం జరిగింది.

1980కి ముందు తెలుగు స్త్రీల ఆత్మకథాత్మక రచనలు మనకు చాలా అరుదుగా కనిపించేవి. అయితే, వారి సహచరులు వారి ఆత్మకథాత్మక రచనలతో వారిని మరుగున పడేశారు. 1980 తరువాతే వివిధ వర్గాలకు చెందిన అనేకమంది విద్యావంతులైన స్త్రీలు స్త్రీత్వం గురించి, వారి జీవితంలో ఎదుర్కొన్న సామాజిక – ఆర్థిక సమస్యల గురించి తమ అనుభవాలను రాయడం ప్రారంభించారు. విభిన్న నేపథ్యాలకు చెందిన మహిళల మొత్తం జీవితానుభవాలు, సవాళ్లు, బాధలు, విముక్తి, వారు ఎంచుకున్న రంగాల్లో సాధించిన విజయాలను తెలియజేస్తున్నారు.







**సంప్రదాయ స్వీయచరిత్ర - ఏడిదము సత్యవతి ఆత్మచరిత్రము:** సాహిత్య విమర్శకుల అభిప్రాయం ప్రకారం తెలుగులో మొదటి స్త్రీ ఆత్మకథ ఏడిదము సత్యవతి రచించిన ఆత్మచరిత్రము. 1934లో ప్రచురితమైన ఈ గ్రంథం తెలుగులో తొలి ఆత్మకథాత్మక రచనగా పరిగణించబడుతుంది. సాహిత్య రచనలో రెండు భాగాలు ఉన్నాయి. మొదటి భాగం ఆమె వ్యక్తిగత జీవిత విశేషాలను ప్రస్తావించగా, రెండవ భాగం సమాజంలో తెలుగు మహిళల స్థితిగతుల గురించి ఆమె అభిప్రాయాలు మరియు భావాలను వివరించింది. ఆత్మకథాత్మక వచనం పూర్తిగా సంప్రదాయ దృక్పథంలో మాత్రమే వివరించబడింది. రచయిత్రి తన నిజజీవితంలో కూడా నిర్వర్తించిన పరిశుభ్రమైన, బాధ్యతాయుతమైన ఇంటి-భార్య పాత్రను ఈ ఆత్మకథాత్మక గ్రంథం చిత్రించింది. సత్యవతికి భిన్నంగా, తరువాతి కాలంలోని తెలుగు మహిళా రచయితలు పితృస్వామ్య వ్యవస్థ క్రమానికి వ్యతిరేకంగా బలంగా ప్రతిధ్వనిస్తూ మారిన దృక్పథంతో ముందుకు వచ్చారు.

ఆత్మచరిత్ర అనే గ్రంథంలో ఆధునిక ఆత్మకథాత్మక లక్షణాలు లేవు. కాబట్టి ఏడిదము సత్యవతి గారి రచన సాహిత్యంలో చెప్పుకోదగిన స్థాయిలో గుర్తింపు రాలేదు. రచనలో భర్త చనిపోయిన తర్వాత ఆమె స్వచ్ఛమైన, బాధ్యతాయుతమైన ఇంటి భార్య పాత్ర కోసం వెతుకుతున్న విషయం కనిపిస్తుంది. రెండవ భాగం సమాజంలో వితంతువు, దయనీయ స్థితి మరియు వితంతువుల స్థితి యొక్క నిరాశాజనక మనస్తత్వాన్ని వివరిస్తుంది. మొత్తం మీద, ఇది వాస్తవానికి ఆధునిక కాలంలో చేసిన ఒక సాంప్రదాయ చిత్రణ పద్ధతి.

**సామాజిక కార్యకర్తల ఆత్మకథలు**

తెలుగులో సామాజిక కార్యకర్తలు రాసిన ఆత్మకథలు సత్యవతి గారి ఆత్మచరిత్ర పద్ధతికి భిన్నంగా కనిపిస్తాయి. ఈ రచనలు ఆధునిక సమాజంలో సామాజిక కార్యకర్తలు నిలబెట్టిన నమ్మకాలను, పోరాటాలను ఎత్తి చూపుతాయి.

**మల్లాది సుబ్బమ్మ గారి పాతివ్రత్యం నుంచి ఫెమినిజం దాకా**

మల్లాది సుబ్బమ్మ తెలుగులో సుప్రసిద్ధ సామాజిక కార్యకర్త, మానవతావాది, రచయిత్రి. మహిళలకు సంబంధించిన అనేక సమస్యలపై పోరాడారు. ఆత్మకథ 'పాతివ్రత్యం నుంచి ఫెమినిజం దాకా' 1991లో ప్రచురితమైంది. 'ఆత్మకథ' అనే శైలి లక్షణాలను కలిగి ఉన్న మొదటి రచన ఇదేనని సాహిత్య విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఇది తరువాతి కాలంలోని చాలామంది మహిళా రచయిత్రులకు వారి జీవిత చరిత్రలను మరింత ఆచరణాత్మకంగా రాయడానికి ప్రేరేపించింది.

మల్లాది సుబ్బమ్మ తన ఆత్మకథలో అరవై ఏళ్ల తన జీవితానుభవా లను వర్ణించారు. సనాతన కుటుంబం నుంచి తాను స్త్రీవాదిగా, మహిళా కార్యకర్తగా ఎలా ఎదిగారో ఆమె వివరించారు. సుబ్బమ్మ భర్త రామ్మూర్తి కమ్యూనిస్టు కావడంతో కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. సహజంగానే ఆమె కమ్యూనిజం సిద్ధాంతాలు, విధానాల పట్ల ఆకర్షితురాలయ్యారు. 1972లో ప్రత్యేకాంధ్ర ఉద్యమం, 1978లో కూరగాయల ఎగుమతి నిషేధం ఉద్యమం, 1983లో సేవ్ డెమోక్రసీ ఉద్యమం, కుల వ్యతిరేక ఉద్యమం, సతీ వ్యతిరేక ఉద్యమం వంటి సామాజిక ఉద్యమాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె రాజకీయ కార్యకర్తగా, రాడికల్ హ్యూమనిస్ట్ పార్టీలో క్రియాశీలక సభ్యురాలిగా కూడా మారారు. రాజకీయ పార్టీ కార్యకర్తగా ఆమె రాజకీయాల్లోకి ప్రవేశించడమే కాకుండా తెలుగులో ప్రముఖ సాహిత్య రచనల సంపుటిని కూడా రచించారు. నిజానికి ఆమె తెలుగులో సుప్రసిద్ధ సాహితీవేత్త. సుమారు యాభై పుస్తకాలను రచించారు.

## సాహితీవేత్తల ఆత్మకథలు

### ముదిగంటి సుజాతారెడ్డి గారి ముసురు

ముదిగంటి సుజాతారెడ్డి రచించిన ఆత్మకథ ముసురు స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానంతర తెలంగాణ ప్రాంతంలో నెలకొన్న సామాజిక- రాజకీయ పరిస్థితులను తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. రజాకార్లకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ఉద్యమం చేసిన పోరాటాలను ఆమె స్వయంగా చూశారు. రచయిత్రి తన ప్రయాణ అనుభవాలను ఆత్మకథలో స్పష్టంగా చిత్రించారు. ఆమె తన చిన్ననాటి ఆటలు, పాటలు, వాహనాలు, సంగీత వాద్యాలు, తన సంగీత ప్రతిభ, స్థానిక మందులు మొదలైన వాటి గురించి ఆసక్తికరంగా వివరించింది. ఆమె ఆత్మకథ ద్వారా పాఠకుడు సామాజిక సాంస్కృతిక సంప్రదాయం, కళలు మొదలైన వాటి గురించి స్పష్టంగా అర్థం చేసుకోగలడు.

### ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ గారి సాహితీ రుద్రమ


ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సాహితీ రుద్రమ అనే ఆత్మకథ ద్వారా ఆమె జీవిత చరిత్రను వివరించారు. హిందీ భాష తన మాతృభాష అయిన తెలుగు పురోగతిని పరిమితం చేస్తుందని భావించిన ఆమె హిందీ భాషకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఆమె తన తండ్రితో కలిసి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ఉద్యమ సిద్ధాంతాల వ్యాప్తి కోసం పాటలు పాడారు. ఆమెకు 13 ఏళ్ల వయసులో హయగ్రీవ శ్రేష్ఠితో వివాహం జరిగింది. తెలుగు సర్వతోముఖాభివృద్ధి కోసం జరిగిన భాషా ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు.

ఈమె తెలుగు భాషలో నిష్ణాతురాలైన విద్వాంసురాలిగా గుర్తింపు పొందింది. ఈమె తెలుగులో ఆంధ్ర కవయిత్రులు, ఆంధ్ర కీర్తన కళాసేవ మొదలైన అనేక పండిత గ్రంథాలను ప్రచురించారు. ఆమె రచించిన ఆంధ్ర కవయిత్రులు అనే రచనకు తెలుగు భాషాసమితి వారి అద్భుతమైన ఉపన్యాసాలకు ప్రథమ బహుమతి లభించింది. శ్రీ కన్యకా పరమేశ్వరి సుప్రభాతం, జాతిపిత, కాంతి శిఖరాలు.. మొదలైన సృజనాత్మక రచనలను కూడా రచించారు.

### పొణకా కనకమ్మగారి కనకపుష్యరాగం


పొణకా కనకమ్మ (కాళిదాసు పురుషోత్తం సంపాదకత్వం) రచించిన 'కనక పుష్యరాగం' అనే ఆత్మకథ 2011లో ఆమె మరణానంతరం ప్రచురితమైంది. ఆమె 1892లో ఒక రైతు కుటుంబంలో జన్మించింది. తన అంకితభావంతో కుటుంబ జీవితాన్ని, ప్రజా జీవితాన్ని చక్కగా నిర్వహించారు. ఆమె ఆంధ్రప్రదేశ్ సామాజిక – రాజకీయ చరిత్రలో గణనీయమైన పాత్ర పోషించిన విశిష్ట ప్రజాప్రతినిధి అని విమర్శకులు పేర్కొన్నారు.

పొణకా కనకమ్మ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్యోద్యమం చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. నిజానికి భారత స్వాతంత్ర్యం కోసం ఆమె అనేక ధర్నాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ మిషన్‌లో ఆమె బాబూ రాజేంద్రప్రసాద్, బిపిన్ చంద్రపాల్, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభి సీతారామయ్య వంటి స్వాతంత్ర్య సమరయోధులతో చేతులు కలిపారు. కొమర్రాజు లక్ష్మణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, రాయప్రోలు సుబ్బారావు, గరిమెళ్ళ సత్యనారాయణ మొదలైన తెలుగు రచయితలు తమ రచనలలో ఆమె లక్ష్యాన్ని




ప్రభావితం చేసి మద్దతు ఇచ్చారు. రమాబాయమ్మ, మాడభూషి చూడమ్మ, వింజమూరి కాంతమ్మ, కాంచనపల్లి కనకమ్మ వంటి మహిళా ఉద్యమకారులు ఆమెకు అత్యంత సన్నిహితులు, వీరంతా ఆంధ్రప్రదేశ్ సామాజిక– రాజకీయ అభివృద్ధికి కృషి చేశారు.

ఆమె తన జీవితపు చివరిదశలో లెక్కలేనన్ని సమస్యలను ఎదుర్కొన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చేరిన ఆమెను ఆదుకునేందుకు






ఎవరూ ముందుకు రాలేదు. ఉత్తమ జాతీయవాదిగా, ప్రముఖ సామాజిక కార్యకర్తగా ఆంధ్రమహిళా సభ (రజతోత్సవ వేడుకల సందర్భంగా) ఆమెకు ఇచ్చిన గౌరవం తప్ప మరే వర్గం నుంచి ఆమెకు తగిన మద్దతు, గుర్తింపు లభించకపోవడం నిజంగా విచారకరం.

**వెండితెర ఆత్మకథలు**

ప్రముఖ తెలుగు సినిమా నటీమణుల ఆత్మకథలు కూడా తెలుగులో వచ్చాయి. వీటిలో జమున, భానుమతి ... మొదలైన వారివి ఉన్నాయి. నటీమణులుగా సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఈ ఆత్మకథలు వివరించాయి. యాదృచ్ఛికంగా వారంతా తమదైన ప్రతిభతో మొదటితరం నటులుగా ఎదిగారు. ఈ ఆత్మకథల ద్వారా 1920ల నుంచి నేటి వరకు చిత్ర పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొన్న తెలియని సమస్యలు, అజెండాలను అర్థం చేసుకోవచ్చు.

**జమునా తీరం**

జమున తెలుగు, తమిళ భాషల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి. ఒకసారి లోక్ సభకు ఎన్నికైన రాజకీయ నాయకురాలు కూడా. రంగస్థల కళాకారుల సమాఖ్య నాటక అకాడమీ చైర్ పర్సన్ గా పనిచేశారు. ఆమె తన ఆత్మకథ జమునాతీరంను ప్రచురించింది. దీనిలో ఆమె



ఇలా పేర్కొంది, **'వెండితెరపై కనిపించే నటీమణులు తెర వెనుక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. నా కెరీర్‌లో ఆ సమస్యలను ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాను. కానీ నేనెప్పుడూ ఆత్మగౌరవాన్ని కోల్పోలేదు. నేనెప్పుడూ నా జీవితాన్ని ఎవరికీ అర్పించలేదు'** అని జమునగారు పేర్కొన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో తన జీవితానుభవా లను సవివరంగా వివరిస్తూ, తన ఆత్మకథలో తాను సాధించిన విజయాలు గురించి వివరించారు. తనకు ఎదురైన అనేక చేదు అనుభవాల గురించి వివరించినప్పటికీ, ఆ సమస్యలు ఎలా, ఎందుకు తలెత్తాయో, ఆ పరిస్థితుల్లో ఎలా మేనేజ్ చేసి విజయవంతంగా బయటపడగలిగారో సరైన కారణాలు చెప్పలేదు.

**భానుమతి గారి 'నాలో నేను'**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ప్రముఖ నటి భానుమతిగారు. దక్షిణ భారత చలనచిత్ర చరిత్రలో భానుమతి రామకృష్ణగా ప్రసిద్ధి చెందినవారు. రచయిత్రిగా, గాయనిగా, నటిగా, సంగీత దర్శకురాలిగా, సినీ నిర్మాతగా, దర్శకురాలిగా, ఫిల్మ్ స్టూడియో వ్యవస్థాపకురాలిగా బహుముఖ ప్రజ్ఞాశాలి.

భానుమతి రామకృష్ణ తన ఆత్మకథలో తన అనుభవాలు, సామాజిక సమస్యలు, లింగ సమీకరణాల గురించి చాలా ఆసక్తికరంగా వివరించారు. ఆమె కాలంలో ప్రజలు ఎదుర్కొన్న సంఘటనలు మరియు సమస్యల గురించి మరింత సమాచారాన్ని ఈ రచన వెల్లడిస్తుంది. ఒక ఉపాధ్యాయుడి దుష్ప్రవర్తన కారణంగా కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపడం మానేసిన పరిస్థితి గురించి కూడా ఇది వివరిస్తుంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి, అనేక రంగాల్లో అత్యంత ప్రతిభా వంతులైన మేధావి కావడంతో, ఎలాగైనా ఆత్మగౌరవాన్ని కాపాడు కోవాలనుకునేవారు. ఆమె అహంకారి, అహంకారి మహిళ అని సినీ ప్రముఖుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె జీవిత చరిత్రను మేళవించి తెలుగు చలన చిత్ర పరిశ్రమపై రన్నింగ్ కామెంటరీగా ఈ ఆత్మకథను అందించారు. చిత్రపరిశ్రమ చరిత్రలో మారుతున్న పరిస్థితులను ఈ సాహిత్య రచన వెలుగులోకి తెచ్చింది.

**చిందు కళాకారిణి ఆత్మకథ**

నేను చిందుల ఎల్లమ్మను అనే ఆత్మకథకు డా.కె.ముత్యం సంపాదకత్వం వహించారు. ఈ రచన చిందుల ఎల్లమ్మ ఆత్మకథ. ఎల్లమ్మ అసలు పేరు సరస్వతి. ఈమె 1929లో ఆదిలాబాద్‌లో జన్మించింది. వారి కుటుంబం రేణుకా ఎల్లమ్మ దేవిని ఆరాధించేది. తల్లిదండ్రులు తమ దేవత పేరుతో ఆమెకు నామకరణం చేశారు. ఆమె యక్షగాన కళాకారిణి. ఆమె దళిత కుటుంబంలో జన్మించారు.

చిందు పనితీరుపై గ్రామస్థులకు నమ్మకం ఉంది మరియు మంచి ఆరోగ్యం మరియు సంపదతో తమ గ్రామం పురోగతి సాధిస్తుందని నమ్మారు.

**ఎల్లమ్మ బాధాకరమైన జీవితం**

ఎల్లమ్మ ప్రదర్శన నిజంగా ప్రజలకు ఆసక్తికరంగా, ఆకర్షణీయంగా ఉండేది. సరళమైన భాష వాడకం, సులభమైన లయ మరియు తాళం, ప్రదర్శనతో ముడిపడి ఉన్న అద్భుతమైన నృత్య ప్రదర్శన. ఆమె తన జీవితమంతా చిందు ప్రదర్శనకే అంకితం చేసింది. ఆమె నిరుపేద కుటుంబంలో పుట్టింది. పదకొండేళ్ల వయసులో ఆమెకు వివాహం జరిగింది. సంప్రదాయ చిందు నైతికతతో ఎప్పటికీ జీవించాలని భావించిన ఆమె కుటుంబ జీవితంలో కొంత కాలం తర్వాత భర్తను వదిలేసింది.

ఆమె జీవిత చరిత్ర ఇతరుల జీవిత చరిత్రకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అలాంటి కళాకారులను జానపద కళాకారులుగా గౌరవించాలని, వారిని బిచ్చగాళ్లుగా చూడొద్దని ఆమె ఆత్మకథ సమాజానికి ఒక బుక్‌లెట్ గా మారింది. ఆధునిక సమాజం అని పిలువబడే ఈ రోజుల్లో కూడా ఈ ఆచారం చాలా చోట్ల ఆచరణలో ఉండటం శోచనీయం.

**స్త్రీల ఆత్మకథల్లో కనిపించే అంశాలు**

ఆంధ్రప్రదేశ్‌తో పాటు భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను సరిగ్గా అర్థం చేసుకోవడానికి స్త్రీలు రాసిన ఆత్మకథలు చాలా ముఖ్యమైన మూల గ్రంథాలు. స్వాతంత్ర్యోద్యమంలో, సామాజిక రాజకీయ ఉద్యమాల్లో మహిళల పాత్రను ఎత్తిచూపడంలో చరిత్రకారులు విఫలమయ్యారన్నది వాస్తవం. కొంతమంది మహిళలతో సహా ప్రజాదరణ పొందిన వ్యక్తుల కార్యకలాపాలు మరియు విజయాలను వారు తెలియచేశారు. ఇక్కడ విశ్లేషించబడిన ఆత్మకథలు వాస్తవానికి స్త్రీలు ఎదుర్కొనే సాధారణ మరియు నిర్దిష్ట సమస్యలను వెలుగులోకి తెచ్చాయి. మరియు వారి సహచరులచే తరతరాలుగా అణచివేయబడిన మహిళలను ముందుకు వెళ్ళడానికి ఉపయోగకరమైన సూచనలను అందించాయి.

ఇక్కడ చర్చించిన మహిళల అనుభవాలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయి. ఏదేమైనా మహిళల ఆత్మకథలు చాలావరకు ఒక నిర్దిష్ట సామాజిక వర్గానికి చెందినవి. వారిలో ఎక్కువమంది సంపన్న కుటుంబ నేపథ్యం నుండి వచ్చారు. కాబట్టి సహజంగానే వారు సమాజంలో ప్రజాదరణ పొందిన వ్యక్తులు అయ్యారు. కానీ ఎల్లమ్మ ఆత్మకథ వంటి రచయితల రచనలు ఇతరుల రచనలకు భిన్నంగా ఉంటాయి. ఆమె తక్కువ సామాజిక వర్గానికి అంటే జోగినీలకు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇది నిజంగా దయనీయమైన ఆత్మకథగా పేర్కొనడంతో పాటు కొంత వాస్తవానికి దగ్గరగా ఉన్నట్లు పాఠకుని అనిపిస్తుంది .

స్త్రీల ఆత్మకథలు ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాల సామాజిక–సాంస్కృతిక–రాజకీయ పరిస్థితులను వివరిస్తున్నాయి. ఫలానా ప్రాంతంలో కొంత కాలంగా వేలాది బాల్య వివాహాలు ఎలా జరిగాయో మనకు తెలుస్తుంది. ఉదాహరణకు 'పాతివ్రత్యం నుంచి ఫెమినిజం దాకా' ఆత్మకథ ఆంధ్రప్రదేశ్‌లో బాల్యవివాహాల గురించి సంబంధిత సమాచారాన్ని స్పష్టంగా వెలువరించింది. మరో రచన ముసురులో తెలంగాణ ప్రాంత సంస్కృతి కనిపిస్తుంది.

సాధారణంగా అన్ని ఆత్మకథల్లోనూ రచయితలు స్వీయ ప్రశంసలు కురిపించే లక్షణం ఉంటుంది. చాలామంది మహిళా ఆత్మకథలు ఒకప్పుడు ఏదో ఒక జమీందార్ కుటుంబానికి చెందినవారమని, కానీ తరువాత ఏదో ఒక కారణం వల్ల పేదలుగా మారామని పేర్కొన్నారు.



చిందు ఎల్లమ్మ

రచయితలు సాధారణంగా వారు ఆర్థికంగా బాగా ఉన్నారని మరియు సామాజికంగా ప్రజలచే గౌరవించబడతారని పేర్కొన్నారు.

**ముగింపు**

ప్రతి రచనా సామాజిక–సాంస్కృతిక–రాజకీయ అంశాలను ఖచ్చితంగా ప్రతిబింబిస్తాయనేది వాస్తవం. సంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పతనానికి, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కిందిస్థాయి ఉద్యోగుల మధ్య ఏర్పడిన ఆధిపత్యాలను తొలి తెలుగు మహిళా ఆత్మకథ సత్యవతి ఆత్మకథ 'ఆత్మచరిత్రము' ప్రతిబింబిస్తుంది. 1930వ సంవత్సరంలో ప్రచురితమైన ఆత్మకథలో సమాజం నుండి తగిన ప్రశంసలు పొందడానికి, స్త్రీత్వానికి మోక్షం పొందడానికి మహిళలకు సతీగా మారడం ఉత్తమ ఎంపిక అని పేర్కొంది. సంప్రదాయ విలువలు, సంప్రదాయ సాహిత్యం రచయితను ఎంతగానో ప్రభావితం చేశాయనడంలో సందేహం లేదు. అయితే ఇతర ఆత్మకథలు ఆంగ్ల విద్య ప్రభావితమైన ఆధునిక ఆలోచనలను ప్రతిబింబించాయి. స్త్రీలను పురోగతి వైపు పయనించేలా దారి చూపిస్తున్నాయి.

# వెతుకుదాం రండి!

సరిహద్దుల గొలుసులు బిగించి
వేరుపడిపోయాయి ఎక్కడో
మానవతల ఆనవాళ్ళు ...
తెలిస్తేగా పోయిందెప్పుడో
వెతుక్కుంటూ పోవాలి
ఏ మూలన నక్కి చూస్తున్నాయో!!
గొంతుకు ఉరి చుట్టి
పట్టి లాగాలి బయటకు...
ఏ మబ్బులు అడ్డుకుంటున్నాయో
ఏ చోట ఆవిరవుతున్నాయో
నీలినీడల కింద
ఎక్కడ దాగున్నాయో
పొదల చాటున
ఎందుకు మాటువేసాయో
తెలుసా ఎవరికైనా?
అర్థమవుతుందా ఎప్పటికైనా?
మనసులకి మబ్బులు పట్టి
ఆవేశాల నడుమ ఆవిరై
తనను తాను
స్వార్థాన్ని శ్వాసిస్తూ
తూగే బరువుకు
లాభాల లెక్కలు కదుతుంటే...
ఏముంటుంది వచ్చేది?
ఒక్కమాట చివరగా...
అడుగులు కదుపుదామా ఇప్పటికైనా
రాలిపోతున్న ఆశలు బతకడానికి
వెతుకుదామా కోల్పోయిన చోట?
మనుషులుగా మిగలడానికి...

**అరుణ ధూళిపాళ**
ఫోన్ : 87123 42323

# మధ్యతరగతి మకరందం

అమ్మనేర్పిన తొలి పలుకుల నుంచి
అమ్మ ఒడిలో పడుకున్న వెచ్చని నిద్ర నుంచి
అమ్మ మోసిన కట్టెల మోపు నుంచి
పాత బట్టలకు కుట్టేసిన సూది దారం నుంచి
అమ్మ చేసే పరమాన్నం తిన్న
పరమానందం నుంచి

నాన్న వాడిన ఉల్లి – బాడిష నుంచి
నాన్న చెక్కిన పళుగొర్రు నుంచి
నాన్న దున్నిన గుంటిక వరుసల్లోంచి
నాన్న పేర్చిన బండి పల్గడిదబ్బల నుంచి
నాన్న అల్లిన పుల్జరిజల్ల నుంచి
నాన్న నేసిన పగ్గం – మోకు నుంచి
నాన్న కప్పిన తాటాకు కొట్టం నుంచి

తొండి మొండి చేసి గోటీలు గెలుచుకునే
తమ్ముడు ఆడిన గోటీలాట నుంచి
ఉత్తీత నేర్చుకున్న లంబడోళ్ళ బావి నీళ్ళ నుంచి
అవ్వ వడికిన ఉన్ని కండె నుంచి
తాతన నేసిన నల్ల గొంగడి అంచు నుంచి
గొర్లెంట నడిచిన అడవిదారుల నుంచి
వసతి గృహంలో ప్రార్థన చేసి తిన్న బువ్వ నుంచి
అనుభవాల నుంచి
అనుభవించిన మధురానుభూతి నుంచి...

నేను వికసిస్తాను అనుభూతి కవితనై
నేను ప్రవహిస్తాను అనుభవాల సాగరాన్నై
నేను పరిమళిస్తాను మధ్యతరగతి మకరందాన్నై
నేను మళ్ళీ మళ్ళీ పుడతాను పల్లె కవినై ...

**ఎజ్జు మల్లయ్య**
ఫోన్ : 9653 871 915

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (49) UGC Care List Approved Journal
హైదరాబాద్ మార్చి : 2023


# కె.వి. నరేందర్ కథల్లో స్త్రీ సామాజిక చిత్రణ – సాధికారత, సమస్యలు

**తాడూరి రవీందర్,** తెలుగు పరిశోధక విద్యార్థి, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 99499 46607

తెలంగాణ పల్లె కలలు గన్న కథా రచయిత కె.వి. నరేందర్ గారు. మూడు దశాబ్దాలకు పైగా అద్భుతమైన, ఆలోచింపజేసే అనేక కథలను తెలుగు పాఠకులకు అందించారు నరేందర్ గారు. 150కి పైగా కథలను రచించిన ఆయన ఏకాంశ కథలుగా, విజువలైజ్డ్ కథలుగా తన రచనల ప్రత్యేకతను చాటుకున్నారు. తెలంగాణ కథ అనగానే ఉద్యమ సంబంధిగానో, విప్లవ సంబంధిగానో ఉంటుందని భావించే తరుణంలో ఏ ఇజానికి, ఏ భావజాలానికీ బందీ కాకుండా, మధ్య తరగతి జీవితాల వ్యథలను, మానవ సంబంధాలను, అంతస్సంఘర్షణలను తన కథలలో ప్రతిఫలింపచేశారు నరేందర్. ఆయన రాసిన కథలలో దాదాపు ముప్పైకిపైగా కథలు స్త్రీ జీవితం, సాధికారత, మాతృత్వం, పీడన, స్త్రీ చైతన్యం కేంద్రంగా రచించబడినాయి.

**"కథ జనం నాలుక. గుండె చప్పుడు. జనం తొవ్వ. సమాజ గమ్యం"** అని అంటారు డా॥ బి.వి.ఎన్. స్వామి గారు. దీన్ని బట్టి కథ సమాజ గమనాన్ని ఎంతలా తనలో ఇముడ్చుకున్నదో మనం అర్థం చేసుకోవచ్చు. **"ఒక వ్యక్తికి, ఒక విషయం పట్ల ఆసక్తి ఉండడం, ఆసక్తి ఉండకపోవడం అనేది చాలా మామూలు అంశం కాని మొత్తం సమాజానికి ఒక విషయం పట్ల అనాసక్తి ఉండటం అనేది జరిగితే, అది ఆ విషయం వ్యక్తం చేసిన వాళ్ళ లోపం అవుతుంది తప్ప సమాజానిది కాదు. కళాకారుడు సమాజం గుండెల్లో ఉండి, మౌనంగా పురోగమనానికి నాయకత్వం వహిస్తాడు"** అని దూపాటి విజయ్ కుమార్ గారన్నట్లు తన కథల్లో స్త్రీ జీవితాన్ని, సంఘర్షణను సమాజం ముందుంచారు కె.వి.నరేందర్ గారు.

శతాబ్దాల నుండి స్త్రీ, పురుష సంబంధాలు, పరస్పర ప్రేమ, గౌరవాలు సమాజాన్ని, సామాజిక స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి. క్రీస్తు పూర్వం నుండి నేటివరకు వివిధ చారిత్రక యుగాల్లో, స్త్రీ పాత్ర మార్పుకు లోనవుతూనే ఉంది. చారిత్రక పూర్వయుగం నుండి సింధు నాగరికత వరకు మాతృస్వామ్య వ్యవస్థ మనకు దర్శనమిచ్చినా, ఆర్య నాగరికత మొదలు పితృస్వామ్య వ్యవస్థ పురుడు పోసుకుందని చెప్పవచ్చు. అటు తర్వాత శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలంలో పరిపాలనలో స్త్రీకి అత్యంత ప్రాముఖ్యతనివ్వడం జరిగింది. వీరి అనంతరం వివిధ రాజ్యాలు, సామ్రాజ్యాల పాలనలో రుద్రమదేవి, రజియా సుల్తానా, ఝాన్సీ లక్ష్మిబాయి వంటి వీరవనితలు పరిపాలనలో యుద్ధ విద్యలలో ఖ్యాతినొందారు. ఆధునిక యుగంలో సామాజిక, స్వాతంత్ర ఉద్యమాలలో ఎందరో మహిళలు విశిష్టమైన పాత్రను పోషించారు. స్వాతంత్ర్యానంతరం కూడా ప్రధానులుగా, రాష్ట్రపతులుగా, ముఖ్య మంత్రులుగా, శాస్త్రవేత్తలుగా, క్రీడాకారులుగా, మేధావులుగా రాణించారు. ప్రస్తుతం రాణిస్తున్నారు. అయినప్పటికీ భారత స్త్రీ ఇంకా పురుషాధిక్యత కింద నలిగిపోతూనే ఉంది అని చెప్పడంలో సందేహపడాల్సిన అవసరం లేదు.



కె. వి. నరేందర్

పురుషుడు ఎన్ని విధాలుగా స్త్రీపై, స్త్రీ జాతిపై అధిపత్యం ప్రదర్శించినా, పురుషాహంకారాన్ని నిలుపుకున్నా మాతృత్వం విషయంకి వచ్చే సరికి మాత్రం స్త్రీతో పోలిక అనేదే కాదు. ఆమె దరిదాపుల్లోకి కూడ రాలేదు. అమ్మదనమే స్త్రీ జాతికి భగవంతుడిచ్చిన వరమని భావిస్తారు ఏ తరం స్త్రీలైనా. ఆధునిక యుగంలోకి అడుగిడినా, అద్భుతమైన సాంకేతికాభివృద్ధి ఫలితాలను అనుభవిస్తున్నా మాతృత్వాన్ని వదులుకోవడానికి ఇష్టపడే స్త్రీలుండరు అనేది మాత్రం శాశ్వత సత్యం. కాని ఒక ముప్పయి సంవత్సరాల క్రితం అమలులోకి వచ్చిన 1994 పంచాయితీరాజ్ చట్టం ఆర్టికల్ 19(3) మాతృత్వాన్నే గజగజ వణికేలా చేసిందని చెప్పవచ్చు. ఈ చట్టం ప్రకారం ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్న వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయరాదు. ఎప్పుడైతే ఈ చట్టం గురించి తెలిసిందో చాలామంది యువ ప్రజాప్రతినిధులు, అప్పుడే రాజకీయంగా ఎదగాలనుకుంటున్న వారు, బలవంతంగా తమ భార్యలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. ఇది ఒక వంతుకు సరైనదే.

కాని అప్పటికే గర్భం దాల్చి ఉన్న స్త్రీలకు అబార్షన్లు చేయించారు. తమకు మూడో బిడ్డ పుడితే, రాజకీయ భవిష్యత్తు శూన్యం అవుతందని బలవంతంగా తమ భార్యలకు గర్భస్రావం చేయించారు ఈ మానసిక శారీరక, సాంఘీక సంఘర్షణలను కేంద్రంగా చేసుకుని రాసిన కథ అవిశ్వాసం.మండలాధ్యక్షురాలైన శ్వేతగర్భంతో ఉన్నప్పుడు,

మూడో బిడ్డ పుడితే, పదవి ఎక్కడ పోతుందో అని, బలవంతంగా ఆమెతో గర్భస్రావం చేయించుకొమ్మని గొడవ పెడతాడు భర్త రామకృష్ణ. **"మా ఆయన ఒత్తిడీ పెరిగింది. నేను తలవంచక తప్పలేదు. అమ్మతనం మీద నెత్తుటి పిండాలు అవిశ్వాసం ప్రకటిస్తే, మాతృత్వపు ఉనికి కూడా ఉండదేమో, కడుపులో పిండాలతో రాజకీయమాడుకునే మనల్ని ఏ బిడ్డా క్షమించదేమో"** అన్న రాజ్యలక్ష్మి మాటలు ఆనాటి స్త్రీ ప్రజాప్రతినిధుల సంఘర్షణకు అద్దం పడుతున్నాయి.

ప్రస్తుత కాలంలో స్త్రీ జాతి ఎదుర్కొంటున్న సమస్య భ్రూణ హత్యలు ఆడపిల్లలు కనడం ఇష్టంలేని తల్లిదండ్రులు, గర్భస్రావం చేయించుకొని లోకం చూడకముందే ఎందరో ఆడపిల్లలు చెత్తకుప్పల పాలవుతున్నారు. భారతీయ సమాజంలో కొడుకే వంశాకురం అని, వారసుడు అనే బలమైన నమ్మకం తరతరాలుగా పాతుకుపోయి ఉంది. అందునే సగటు కుటుంబాలు అన్నీ తమకు మగబిడ్డే కావాలని ఆరాటపడుతున్నారు. ఆడపిల్లలు పుడితే పురిట్లోనే వారిని చంపేస్తున్నారు. ఈ పరిస్థితి రెండు దశాబ్దాల క్రితం విపరీతంగా ఉండేది. గర్భం దాల్చిన కొన్ని నెలలకు లింగనిర్ధారణ పరీక్షలు చేయించి, ఆడపిల్ల అని తెలిసిన వెంటనే గర్భస్రావం చేయించు కోవటం అనేది అప్పట్లో పెచ్చరిల్లిపోయింది. పరిస్థితి గమనించిన ప్రభుత్వాలు లింగవివక్షను రూపుమాపడానికి, భ్రూణహత్యలను నివారించడానికి గర్భస్థ పూర్వ పిండ లింగనిర్ధారణ నిషేధ చట్టం 1994 ను తీసుకు రావడం జరిగింది.చఇప్పుడు ఆ చట్టం కఠినంగా అమలవుతున్నప్పటికీ, దొంగచాటుగా కొన్ని చోట్ల లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతూనే ఉన్నాయి. ఆడ శిశువుల మరణాలు చూస్తూనే ఉన్నాము. "గర్భగుడి" కథలో సంధ్య కడుపుతో ఉన్నప్పుడు ఆమె భర్త సుమంత్ ప్రవర్తన పైన చెప్పిన 'కొడుకే వారసుడు" అనే భావనకు పరాకాష్ట. మొదటి కాన్పులో ఆడపిల్ల పుట్టిన తర్వాత, రెండోసారి ఖచ్చితంగా అబ్బాయి మాత్రమే పుట్టాలని సుమకాంత్, అతని తల్లి కాంతమ్మ ఆరాటపడుతూ ఉంటారు. స్కానింగ్‌లో ఆడపిల్ల అని తెలిన తర్వాత సంధ్య పట్ల భర్త ఏవగింపు, అసహ్యం, నిర్లక్ష్యం భారతీయ పురుషుని పురుషాధిక్యతను చూపిస్తుంది. చివరకు విగతజీవిగా పుట్టిన మగబిడ్డను చూసి సుమకాంత్ పశ్చాత్తాప పడినా, లింగ నిర్ధారణ పరీక్షలు, గర్భస్థ పిండస్రావం, ఆడపిల్లల భ్రూణ హత్యలు అనేవి ఎంతటి అసమానతలకు కారణమవుతాయో అతను గ్రహించలేదనే చెప్పాలి. మగ పిల్లాడు పుట్టకపోతే సమాజంలో ఆ తల్లిపై వివక్ష 'సంధ్య' పాత్ర ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు.

**"పొత్తి కడుపులో నెత్తుటి పుష్పం"** లో మరొక సమస్యను కథగా అందించారు రచయిత. ప్రస్తుత సమాజంలో, ముఖ్యంగా 1990 నుండి 2010 వరకు ఎక్కువ సంఘటనల ద్వారా సమాజాన్ని ఆలోచింపచేసిన, కలియుగ కుంతీదేవి లాంటి అజ్ఞాత తల్లుల గురించి కథగా మలచారు నరేందర్ యుక్త వయసుకు వచ్చిన యువతులు, మగాడిని, అతని ప్రేమను నమ్మి తమను తాము, అతనికి అర్పించుకున్నాక, వాడుకుని వదిలేసే సందర్భంలో, ఆ కన్నెతల్లుల కడుపులో పెరుగుతున్న పిండాలు, శిశువులుగా జన్మించి, శవాలుగా చెత్తకుప్పల్లో దర్శనమిచ్చిన అమానవీయ సంఘటనలనేకం.

ప్రస్థానం కథను పరిశీలిస్తే భారత సమాజంలో నేటికీ ప్రధాన సమస్యగా పరిగణింపబడుతున్న వ్యభిచారం లేదా వేశ్యావృత్తి మరియు ప్రభావం గురించి, శిథిలమయి పోయిన వేశ్యా స్త్రీల భవిష్యత్తు గురించి మనకు అవగతమవుతుంది. భారతదేశమొక్కటే కాదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో వేశ్యావృత్తి అవలంభించబడుతుంది. పురాణ కాలంలో నుండి నేటివరకు ప్రతీ దశలో ఈ వేశ్యావృత్తి కనిపిస్తూ ఉంటుంది. జాతీయ మహిళా కమీషన్ నివేదిక ప్రకారం మనదేశంలో 2.4 శాతం మహిళలు వేశ్యా వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ వృత్తిలో కొనసాగుతున్న మహిళల జీవనం పూర్తి అభద్రతా భావంతో నిండి ఉంటుంది. సమాజంలో చిన్న చూపు మాత్రమే కాదు. తమ కడుపులో పుట్టిన బిడ్డలకు కనీస విద్యను అందించలేని దుస్థితిలో ఉన్నారు.

**"ప్రస్థానం"** కథలో నీలిమ వేశ్యావృత్తిలో ఉన్నప్పటికీ, తన కూతురు అయిన పులకిత యామినిని బాగా చదివించాలని ఆశపడుతుంది. ప్రధానోపాధ్యాయుడు ఆమె పట్ల కొంత సానుభూతిని చూపెట్టినా, మిగతా ఉపాధ్యాయులు మాత్రం ఆ అమ్మాయిని చేర్చుకోవడంలో విముఖత వ్యక్తం చేస్తారు. అయితే రిజిష్టరులో తండ్రి పేరు రాయాలి చెప్పండి అనగానే, తండ్రి లేదు అని చెబుతుంది నీలిమ. అలా అయితే చేర్చుకోవడం కుదరదంటారు. తండ్రి పేరే ఎందుకు? తల్లిగా తనపేరు రాసుకొమ్మని బతిమాలుతుంది. ప్రశ్నిస్తుంది. ఈ కథలో చివరకు తన కూతురుకి స్కూల్లో ప్రవేశం దొరకదనే బాధతో వెళ్తుంది నీలిమ. తన కూతురుకే కాదు, ఇక ముందు ఏ పిల్లలకైనా, ఖచ్చితంగా తండ్రి పేరే కావాలనే నిబంధనను తొలగించి, తల్లి పేరైనా రాయొచ్చు అనే విధంగా చట్టాన్ని మార్పించాలని సంకల్పించుకుంటుంది. అందుకోసం కోర్టులో కేసు వేయడం కోసం బయలు దేరుతుంది నీలిమ.

**"వెంటాడే పిలుపు"** కథలో ఒక విభిన్నమైన అంశాన్ని వస్తువుగా స్వీకరించారు రచయిత సమాజంలో చాలామంది సంతానలేమితో బాధపడుతున్నారు. వారిలో కొంతమంది వివిధ ఆధునాతన వైద్య విధానాల ద్వారా అనగా టెస్ట్‌ట్యూబ్ బేబీల ద్వారా, సరోగసీ ద్వారా సంతానవంతులవున్నారు. ఈ మాత్రం కూడా అవకాశంలేని వారు, తప్పనిసరి పరిస్థితులలో వేరే పిల్లల్ని, అనాథలను తత్తత తీసుకొని ముచ్చట తీర్చుకుంటారు. ఏ అవకాశమూ, ఆర్థిక స్థిరత్వం లేని వారు మాత్రం జీవితాంతం పిల్లలని పెంచుకోవాలనే ఆశ తీరకుండానే జీవితాన్ని గడుపుతున్నారు. అయితే ప్రస్తుత కాలంలో నాగరిక

సమాజంలో బాగా ధనవంతులయిన వారు, సినీ పరిశ్రమకు చెందిన నాయికలు, సెలబ్రిటీలు పెళ్లి చేసుకోకుండానే పురుషుని సంభోగం లేకుండా వైద్య విధానాల ద్వారా తల్లులయ్యి, మాతృత్వంలోని మాధుర్యాన్ని అనుభవిస్తున్నారు. స్త్రీ యొక్క అమ్మా అని పిలిపించుకోవాలనే ఈ సహజమైన, స్వచ్ఛమైన కోరికను కథా వస్తువుగా రెండు దశాబ్దాల క్రితమే స్వీకరించి ఈ కథను మలిచారు నరేందర్. రాజమణి తాను అమ్మా అని పిలిపించుకోవడం చేసే ఆలోచన విపరితమయిందే అని అనుకుంటూ ఉంటుంది. నెల రోజులుగా తనలో తాను మథనపడుతుంది. "తనెవరికి ద్రోహం చేయ్యటం లేదు. ఆ మాత్రం ఆనందాన్నయినా తన జీవితంలో నింపుకుంటే తప్పేంటీ? ఈ ఒంటరి జీవితంలోనికి ….. ఎలా రావాలి? ఎలా ? ఎలా? అని ఆలోచించి, వినాయకుడి ద్వారా ఆ బిడ్డను కనాలనుకుంటుంది. కాని ఊరంతా ఏకమై రాజమణిని నానా రకాలుగా నింధించి, జరిమానా వేస్తారు కానీ ఈ కథ ద్వారా ఒక విషయం మాత్రం మనల్ని ఆలోచింపజేస్తుంది. స్త్రీ భర్త తోడు లేకున్నా సరే, పిల్లలు ఉంటే వారిలోనే తన ప్రపంచమంతా చూసుకొని బతుకుతుందని, అదే మాతృత్వం గొప్పదనం అని అర్థమవుతుంది.

అలాగే తెలంగాణ ప్రాంతంలో స్త్రీల జీవితం దొరల పాలనలో, గడీల్లో, భూస్వాముల చేతుల్లో ఎలా నలిగిపోయిందో, వందల ఎకరాల భూములు, కోట్ల ఆస్తులున్న దొరలు తమ సరదాలకు, విలాసాలకు ఎందరో బహుజన స్త్రీల జీవితాలను ఎలా నాశనం చేశారో దొరుంచుకున్న దేవక్క, 1901 ఓ బలిదానం కథలలో కళ్ళకు కట్టినట్లు అక్షరీకరించారు రచయిత. దొరుంచుకున్న దేవక్క కథలో దొరగడీల్లో జరిగే అమానుష ఘటనలు, కన్నుపడ్డ ప్రతీ స్త్రీని అనుభవించాలనే దొరల కామ పైశాచికత కనిపిస్తుంది. దేవక్క కోసం ఆమె భర్తను కూడా దొర హత్య చేయిస్తాడు. దొర తన భార్య పిల్లలలో పట్నం వెళ్లిస్థిరపడతారు. అప్పటిదాకా దొర వాడుకొని వదిలేసిన దేవక్క బతుకులోకి నక్సలైట్లు రావడం పోలీసులకి భయపడి ఆమె బొంబాయికి వెళ్ళి వ్యభిచార వృత్తిలోనికి దిగడం, ఎయిడ్స్ వ్యాధి సోకి, ఆఖరికి ఊరికి వచ్చి దిక్కులేని చావు చావడం అన్నింటికి కారణం ఒక్కటే, దొర తన కామానికి, స్వార్థానికి దేవక్కను వాడుకొని వదిలెయ్యడం. తెలంగాణ పల్లెల్లో దొరలు గడీలు ఇటువంటి అత్యాచారాలకు, మానభంగాలకు, వెట్టి చాకిరీలకు సజీవ సాక్ష్యాలు అని చెప్పవచ్చు.

1901 ఓ బలిదానం అనే కథ ఆనాటి తెలంగాణ పల్లెల్లోని మరో అమానవీయ సంస్కృతికి, అధిపత్య, అగ్రవర్ణ, భూస్వామ్య వ్యవస్థ దళిత బహుజన స్త్రీలపట్ల వ్యవహరించిన తీరుకు నిదర్శనాలుగా కనిపిస్తుంది. దక్షిణభారతదేశ ఆలయాల్లో, ఆ కాలంలో దేవదాసి వ్యవస్థ ఉన్నప్పటికి, ఆ స్త్రీల పట్ల గౌరవ మర్యాదలు ఉండేవి. కాని ఇక్కడ దొరలగడీలలో వచ్చిపోయే బంధువుల కోసం, ఇతర దొరలు, నవాబుల కోసం అందమైన దళిత బహుజన స్త్రీలను విలాసవస్తువులుగా వాడుకోవడం, వారిపై పశువాంఛతో అఘాయిత్యాలకు పాల్పడడం ఆనాటి దొరల పాలనను తెలుపుతుంది. పదేళ్ళు కూడా నిండని అమ్మాయిలను తమ గడీలో సేవకు వినియోగించుకుంటూ, వారి జీవితం మొత్తం గడిలోనే బందీని చేసి వారికి తమ కామ కోరికలకు వాడుకొని వారు మధ్యవయస్సుకి రాగానే గడీ నుండి బయటకు పంపేయడం ఆనాటి సామాజిక స్థితికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఈ కథలలో ప్రమీలమ్మ 35 సంవత్సరాల వరకు వందకు పైగా దొరలకు, పట్వారీలకు, నవాబులకు సుఖాన్నిస్తుంది. ఆ క్రమంలో ఆమె ఎన్నో రకాల చిత్రహింసలు అనుభవిస్తుంది. దొర చేతిలో దెబ్బలు తింటుంది. తనను గడీనుండి బయటకు పంపిస్తున్నారని తెలిసి, ఏదో విముక్తి దొరికినట్లు సంతోషిస్తుంది కానీ దొర కన్ను పదహారేండ్ల తన కూతురు సంధ్యపై పడిందని తెలిసి, ఆమె గజగజ వణికిపోతుంది. తాననుభవించిన నరకం తన కూతురు అనుభవించకూడదు అని అనుకుంటుంది. అందుకే పూనకం వచ్చినప్పుడు బలిజీవిగా తన కూతురు సంధ్యపేరే చెప్పి, ఆమెను గోతిలో పెట్టించి దోసిలితో మట్టి తీసి పోసింది. ఇలా తన సంధ్య గడీలో అకృత్యాలకు బలికావొద్దని నిర్ణయం తీసుకుంది. **"పొత్తి కడుపులో పిడిబాకులు గుచ్చినట్టు, పచ్చి కుండని కొలిమిలో కాల్చినట్టు, ఊడల మర్రి కింద జెర్రులు పాకినట్టు దొరగాని కన్ను పడింది. ఆ నరకం నీకొద్దు బిడ్డా"** అని ప్రమీలమ్మ ఏడుస్తూ పలికిన మాటలు దొరల గడీల అకృత్యాల తీవ్రతను తెలియజేస్తున్నాయి.

హింసధ్వని కథలో భార్య ఉద్యోగం చేస్తేనే ఆమెకు విలువ ఇచ్చి, సెలవు పెడతానంటే ఆమెతో గొడవకు దిగి చేయిచేసుకుంటాడు ప్రభాకర్. తనతో పాటు సమానంగా భార్య రజిని కూడా ఉద్యోగం చేయాలని కోరుకుంటాడు. ఆ కోరికలో తప్పులేదు కాని ఆ యాంత్రికమైన జీవితంనుండి కొంత ప్రశాంతత కోసం కొన్నిరోజులు సెలవు పెడతానని చెప్పినప్పుడు మాత్రం వద్దని కోప్పడడం మాత్రం ప్రభాకర్ పురుషాహంకారాన్ని, అధిపత్యాన్ని ప్రతిబింబి స్తుంది. రజిని వాదనలో అర్థం ఉంది. న్యాయం ఉంది. ఉద్యోగం చేసే స్త్రీ ఎంత చదువుకున్నా, నాగరిక సమాజంలో సాధికారతతో బతుకుతున్నా, తమలో సహజమైన కోరికలకు, అనుభూతులను మాత్రం కోల్పోతున్నామన్న భావనలో ఉండిపోతున్నదని మాత్రం గమనించవచ్చు మరో చోట **"ఆ అనుభూతులు కోల్పోతుంటేనే జీవితం నిస్సారమై ఏదో వెలితి ఏర్పడుతోంది, ముఖ్యంగా మా ఉద్యోగినిల్లో అంతరాంతరాల్లో పేరుకుంటున్న అసంతృప్తి ఇది. ఆ అనుభూతుల్ని తిరిగి పొందటం కోసమే కనీసం ఆర్నెల్లయినా లీవ్ పెడదామనుకుంటున్నాను"** అంటుంది రజని.

ఈతరం అమ్మాయిలు తమ సహజమైన, స్వేచ్ఛా జీవితాన్ని ఆస్వాదిస్తూనే, విద్యా ఉద్యోగరంగాల్లో ఆత్మాభిమానంతోకూడిన

అభివృద్ధిని సాధించవలసిన అవసరం ఉంది. "వీకెండ్" కథలో ఇరువురు భార్యాభర్తలు అయిన నందిత, దిలీప్ అటు ఉద్యోగం వేరు వేరు నగరాల్లో చేస్తూ, ఇటు ప్రతి శని, ఆదివారాలు ఇద్దరు కలిసి సంతోషంగా గడపడం నూతన దాంపత్య జీవన విధానానికి నాంది అని చెప్పవచ్చు. ఇద్దరు సంపాదించడం కోసం కష్టపడడమే కాదు, ఒకరి ఉద్యోగాలు ఒకరు అర్థం చేసుకుంటూ, ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవిస్తూ, కలిసుండేది వారంలో రెండు రోజులు అయినా ఎలాంటి అరమరికలు లేకుండా, అనుమానం లేకుండా స్నేహితులుగా కలిసి బ్రతకడం ఒక ప్రగతిశీల దృక్పథంతో కూడిన నూతన దాంపత్య జీవనంగా భావించవచ్చు.

**"డబ్బుసంచి"** కథలో మాధురి అనే అంగన్వాడీ కార్యకర్త గర్భసంచి ఆపరేషన్లపై కోర్టు మెట్లెక్కి బాధితుల పక్షాన పోరాటం చేయాలని సంకల్పంచుకుంటుంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని ఆధారంగా చేసుకొని, అమాయకులైన గ్రామీణ మహిళలను ఆందోళనకు గురి చేసి గర్భసంచి ఆపరేషన్లు వేల సంఖ్యలో చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు కోట్లు గడించాయి. ఇదంతా డబ్బు సంపాదన కోసమే. కాని ఈ విషయం తెలియని అమాయక గ్రామీణ మహిళలు, తమ మాతృత్వపు క్షేత్రాన్ని కోల్పోయారు తరచూ పొత్తికడుపులో నొప్పి వస్తున్నా, నెలసరి సమస్యలు వేధిస్తున్నా, అజీర్ణంగా ఉన్నా సరైన వైద్యుడిని సంప్రదించి చికిత్స చేసుకోవాలి కొన్ని ఆస్పత్రులు ఏకంగా పెద్దాపరేషన్ చేసి గర్భసంచులను సంఘటనలు మన రాష్ట్రంలో అనేకం జరిగాయి. ఇది మాతృత్వానికే కాదు, స్త్రీల ఆరోగ్యానికి అస్తిత్వానికి, ఆయుర్దాయానికి కూడా మూలాధారమైన గర్భసంచులను మూడు పదుల వయసు కూడా దాటక ముందే తీసేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సమస్యను, అందులోని మోసాన్ని సమాజానికి తెలిసేలా, చాలా హృద్యంగా ఈ కథ ద్వారా అందించారు కె.వి. నరేందర్ గారు.

ఈ విధంగా నరేందర్ గారు తమ కథల్లో స్త్రీ యొక్క జీవితంపై ఆలోచింపదగిన అంశాలను వస్తువుగా స్వీకరించి సమాజాన్ని తట్టిలేపడమే కాక, స్త్రీ జాతిపై చూపే వివక్షను ఎత్తి చూపుతూ చురకలంటించారు. అమ్మ, నాతిచరామి, కాలుతున్న పూలతోట వంటి కథా సంపుటాలన్నీ స్త్రీ కేంద్రంగానే రచించి, ఒక రచయితగా తన సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో కృతకృత్యులయ్యారు నరేందర్ గారు.

**ఆధార గ్రంథాలు**


1. అమ్మ కథా సంపుటి - కె.వి. నరేందర్
2. నాతిచరామి కథా సంపుటి - కె.వి. నరేందర్.
3. కాలుతున్న పూల తోట - కె.వి. నరేందర్
4. వందేళ్ల తెలుగు కథ - చినవీరభద్రుడు, ఎమెస్కో బుక్స్.
5. మూడు తరాల తెలంగాణ కథ - తెలంగాణ సాహిత్య అకాడమీ
6. అస్తిత్వ ప్రాతినిధ్య తెలంగాణ కథలు-తెలంగాణ సాహిత్య అకాడమీ.


# జీవిత పాఠం





పచ్చని చిగురులు చిగురించి
మొక్కల చెట్లుగా ఎదిగి మొగ్గలు విరిసి
పువ్వు అందంగా పూసి
రెక్కలు వచ్చి విచ్చుకోగానే
ఎదుటివారిలో ఈర్ష్యాసూయలు
మొదలై విప్పుకున్న పువ్వు కాస్త
వాడిపోయి అంద విహీనమై వాడిపోయి
ఓర్వని ఆకాశంలా మబ్బులు కమ్మి
వెలుగుల్ని మాయం చేసినట్లు
విరిసిన ప్రతి పువ్వు జీవం పోవాల్సిందే
ఎదుగుతున్న పువ్వు మనలోని
భావాలను మొలకెత్తించి చెదిరిన కళలతో
చెరుపలేని గుర్తులతో సంఘర్షణకు గురి చేసి
అయోమయ పరిస్థితులకు దారి తీసిన
ఆశను కోల్పోక నిరాశ పడక గమ్యాన్ని
కాలగర్భంలో వదిలేయక ఎదను తట్టి
మేల్కొల్పి కాలం సిగలో కొత్త మొగ్గ విరిసేలా
పువ్వులు పూసేలా కొలువు దీరిన
కన్నీళ్ళకు కొరికి పెట్టి పాత భావాలను
పదిలంగా మలుచుకుని
కొత్త అనుభూతులను స్వాగతించాలి

**కె. నిఖిత**
ఫోన్ : 6309 767 894

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (53) హైదరాబాద్ మార్చి : 2023

## కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 30

# స్వర్ణ కమలం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254




"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "స్వర్ణ కమలం". ఈ చిత్రంలో భానుప్రియ, వెంకటేష్‌లు నాయికా నాయకులుగా నటించారు. ఈ చిత్రం శాస్త్రీయ నృత్య కళను ప్రధానంగా చేసుకొని రూపొందించ బడింది. చేసే ఏ పనిలోనైనా లేదా ఏ కళ నందైనా మనసును పూర్తిగా లగ్నం చేసినప్పుడు కలిగే అలౌకిక అనుభూతి ఇహ సౌఖ్యాలకు మించి వుంటుందనే మౌలిక భావనను భూమికగా చేసుకొని ఈ చిత్రాన్ని రూపొందించారు.

**చిత్రకథ**

వేదాంతం శేషేంద్ర శర్మ ఒకానొక సమయంలో నాట్యకారునిగా ప్రభను కలిగిన వ్యక్తి. కాలానుక్రమంలో వృద్ధాప్యంలోకి జారిన ఆయన జీవితంలాగే, సమాజంలో కళలు కూడా ఆదరణకు నోచుకోక పోవడం వల్ల పేదరికంలో బతుకు ఈడుస్తుంటాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు వారిని సంగీత, నృత్య కళాకారిణిలుగా తీర్చిదిద్దాలనేది ఆయన కోరిక. పెద్ద కూతురు సావిత్రి (దేవీలలిత) తన తండ్రి వద్ద సంగీత సాధన చేస్తుండగా, చిన్న కూతురు మీనాక్షి (భానుప్రియ) నృత్య శిక్షణ చేస్తూ ఉంటుంది. సావిత్రి చిన్న చిన్న పనులు చేస్తూ తండ్రి, చెల్లిని చూస్తూ ఉంటుంది. మీనాక్షికి నృత్య సాధన పట్ల వెగటు. మీనాక్షికి విలాసవంతమైన జీవితం, ఆధునికతతో కూడిన జీవన విధానం అంటే ఇష్టం. వృద్ధాప్యం వల్ల సరిగ్గా కంటి చూపులేని తన తండ్రి వద్ద ఇష్టం లేని నృత్యాన్ని సాధన చేస్తూ నిత్యం తన కలల ప్రపంచాన్ని ఊహించుకుంటు జీవిస్తుంటుంది మీనాక్షి. ఆమె కుటుంబం రైల్వేస్‌లో స్టేషన్ మాస్టర్ గా పనిచేసే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటుంది. స్టేషన్ మాష్టర్ కుమారుడు గణపతి. అతడికి సంగీతం అంటే మహా ఇష్టం. కానీ అతడి తండ్రికి మాత్రం గణపతి ఉద్యోగం చేసి మంచి కట్నం తెచ్చే అమ్మాయిని కోడలిగా తీసుకు రావాలని కాంక్షిస్తాడు. అదే స్టేషన్ మాష్టర్ ఇంట్లో మరో రెండు కుటుంబాలు అద్దెకు ఉంటాయి. శేషేంద్ర శర్మ అంటే చుట్టూ ఉండే వారందరికీ గౌరవం ఉన్నప్పటికీ ఆయన పేదరికం ఆయనను వెక్కిరిస్తూ ఉంటుంది. పెద్ద కుమార్తె సావిత్రి చేసే అప్పడాలను అమ్మడానికి స్టేషన్ మాష్టర్ కుమారుడు తరచూ చిన్న చిన్న బేరాలు కుదురుస్తూ ఉంటాడు.

ఓంకారేశ్వరరావు (సాక్షి రంగారావు) భార్య చేసే పూజలు, ఇచ్చే హారతులతో జీవితం మసిబారిపోయిన వ్యక్తి. ఆయన భార్య అఖిలాండేశ్వరి (శ్రీలక్ష్మి)కి పూజలు, వ్రతాలు అంటే పిచ్చి. ఆమె ఎప్పుడూ సమయంతో సంబంధం లేకుండా పూజలు చేస్తూ ఉంటుంది. ఓంకారం ఇంట్లో అద్దెకు దిగుతారు చంద్రం (వెంకటేష్), టింకు. చంద్రం పబ్లిసిటీ డిజైనర్ (చిత్రకారుడు). అతడికి సహాయంగా ఉండే పిల్లాడు టింకు. చంద్రం, మీనాక్షిల ఇల్లు పక్కపక్కనే వుంటాయి. చంద్రం తన పక్కింట్లో ఉండే మీనాక్షిని పలుసార్లు పార్కు, సినిమా థియేటర్ల వద్ద చూస్తాడు. ఆ సమయంలో చంద్రం ఆమె రూపాన్ని నృత్యకారిణిగా తన మదిలో నిలుపుకుంటాడు. మీనాక్షికి నృత్యం చేయడం ఇష్టం లేదనే విషయాన్ని చంద్రం ఆమెతో పరిచయమైన చాలా తక్కువ సమయంలోనే గ్రహిస్తాడు. కాని మీనాక్షి తండ్రిలాగే చంద్రానికి కూడా ఆమెను నృత్యకారిణిగా చూడాలని కోరిక. చంద్రం ఆమెకు ఇష్టం లేకపోయినా నృత్యం చేసేందుకు ప్రోత్సహిస్తుంటాడు. అంతేకాక మీనాక్షి తండ్రికి నేత్రచికిత్స చేయించి కళ్ళు వచ్చేలా చేస్తాడు. చికిత్స అనంతరం శేషేంద్ర శర్మకు ఆయన కూతురు మీనాక్షి నృత్యకారిణిగా ఉన్న చిత్రాలను వివిధ చోట్ల ఏర్పాటు చేసి చూపిస్తాడు చంద్రం. తన కూతురు రూపాన్ని నృత్యకారిణిగా ఎలా దర్శించాలని అనుకున్నాడో చంద్రం అదే రీతిలో తన పెయింటింగ్స్‌లో వేయడం చూసి సంతోషిస్తాడు శేషేంద్ర శర్మ.

స్టేషన్ మాష్టర్ కుమారుడు గణపతి తాను శేషేంద్ర శర్మ పెద్ద కుమార్తె సావిత్రిని వివాహం చేసుకోవడానికి నిర్ణయించుకున్నట్లు తన తండ్రితో చెప్తాడు. అదే విషయాన్ని శేషేంద్ర శర్మ గారికి చెప్పి ఒప్పించడానికి గణపతి తన సంగీత విద్యను ఆయన ముందు ప్రదర్శిస్తాడు. చివరికి పెద్దల అంగీకారంతో గణపతి– సావిత్రిల వివాహం అవుతుంది. మీనాక్షిని వేదికపై నృత్యకారిణిగా చూసేందుకు




ఆమె తండ్రి శేషేంద్ర శర్మ పడిన తపనను అర్థం చేసుకొని చంద్రం మీనాక్షి కోసం నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాడు. ప్రపంచమంతా ముందుకు వెళ్తుంటే మేము మాత్రం జీవితానికి ఏ మాత్రం పనికిరాని ఈ నృత్యం అనే చట్రంలో ఇరుక్కుపోయాం అనే అభిప్రాయంలో ఉన్న మీనాక్షికి ఆ కార్యక్రమం మనస్కరించదు. చివరికి అదే వేదికపై నృత్యాన్ని ప్రదర్శిస్తూ తన కోపం అందరికి తెలిసేలా చేసేందుకు మువ్వలను విసిరి కొడుతుంది. అది చూసి హతాశుడైన తండ్రి ఆమె స్థానంలో అదే వేదికపై నృత్యాన్ని ప్రదర్శించడం మొదలెడతాడు. వృద్ధాప్యం వల్ల శరీరం సహకారించక అదే వేదికపై కుప్పకూలి మరణిస్తాడు.


తనకు ఇష్టం లేని నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేసి తన తండ్రిని కోల్పోయేందుకు చంద్రమే కారణమని మీనాక్షి అతనిపై కోపం పెంచుకుంటుంది. సావిత్రి తన చెల్లి మీనాక్షి మనస్సును అర్థం చేసుకొని తనకు ఇష్టమైన పని చేసుకునేందుకు మద్దతు ఇస్తుంది. ఈ క్రమంలో మీనాక్షి ఒక పెద్ద ఫైవ్ స్టార్ హోటల్లో హౌస్ కీపర్‌గా పనికి కుదురుతుంది. అదే సమయానికి ఆ హోటల్ యాజమాన్యం క్రికెట్ ప్లేయర్స్‌కు వసతి కల్పించేందుకు సన్నాహాలు చేస్తూ వుంటుంది. సరిగ్గా అదే సమయానికి చంద్రం పబ్లిసిటీ డిజైన్ నిమిత్తం హోటల్ యజమానిని కలిసి మీనాక్షి నృత్యకారిణిగా వున్న చిత్రాలను హోర్డింగ్స్ వద్ద పెట్టేందుకు అనుమతి కోరుతాడు. నృత్యకారిణిగా ఉన్న మీనాక్షి చిత్రాలను చూసి ఆ యజమాని ఆమె ప్రతిభని గ్రహించి ఆమెను హౌస్ కీపింగ్ నుండి తొలగించి, పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లిస్తూ ఆమెతో హోటల్‌లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన కార్యక్రమాలు జరిపించేందుకు నిర్ణయిస్తాడు. ఈ సంఘటనకు కూడా మళ్లీ చంద్రమే కారణమని విచారిస్తుంది మీనాక్షి. విధిలేని స్థితిలో మీనాక్షి హోటల్‌లో నృత్య ప్రదర్శనలు చేస్తూ ఉంటుంది. తన చిన్ననాటి స్నేహితురాలు అమెరికా నుండి వచ్చిందని తెలిసి ఆమెను ఉద్యోగ నిమిత్తం కలుస్తుంది. ఆమెను కూడా అమెరికా తీసుకెళ్లి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించమంటూ ప్రాధేయపడుతుంది. ఒకరోజు మీనాక్షి హోటల్లో నృత్య ప్రదర్శన చేస్తున్నప్పుడు విదేశాల నుండి వచ్చి భారతీయ శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకున్న విదేశీ నృత్యకారిణి అయిన షరోన్ లోవెన్ మీనాక్షి నృత్యాన్ని చూస్తుంది. ఆమెలో ప్రతిభ వున్నప్పటికీ మనసు పెట్టి నృత్యం చేయట్లేదు అనే విషయాన్ని షరోన్ చంద్రంతో ప్రస్తావిస్తుంది. ఒక నెలరోజుల్లోగా మీనాక్షి తన నృత్యరీతిని మార్చుకుంటే అప్పుడు ఆమెను అమెరికాకు తీసుకెళ్లి ప్రదర్శనలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తాననే విషయాన్ని చెప్తుంది. చంద్రం షరోన్ మాటలను మీనాక్షికి గుర్తు చేస్తూ మనస్ఫూర్తిగా నృత్యం చేయడం మొదలు పెడితే అమెరికాకు వెళ్లాలనే, విలాసంగా బతకాలనే నీ కల నెరవేరడమే కాక నీ తండ్రి నిన్ను నృత్యకారిణిగా చూడాలనే ఆశయం కూడా సిద్ధిస్తుందని చెప్తాడు. నువ్వు మనస్ఫూర్తిగా నృత్యం చేయడమే నీ తండ్రి ఆత్మకు శాంతిని చేకూరుస్తుంది అని గుర్తు చేస్తాడు. గురు పూర్ణిమ నాడు శేషేంద్ర శర్మకు ఆయన శిష్యుడు గురువుకు నివాళిగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న మీనాక్షి ఆ సమయంలో నృత్యం పట్ల భక్తి భావాన్ని పొందుతుంది. నృత్యం పై మనసు నిలిపినప్పుడు శరీరం, మనసులు ఏకాత్మ స్థితి పొంది అది కలుగజేసే అలౌకిక అనుభూతిని అనుభవం చెందుతుంది. మీనాక్షి మనసు నిలిపి చేస్తున్నప్పుడు ఆమె నృత్యాభినయానికి ముగ్ధురాలైన షరోన్ లోవెన్ ఆమెను అమెరికాకు తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తుంది. మీనాక్షి ఎయిర్పోర్ట్ లో ప్రయాణానికి సిద్ధంగా ఉండి చంద్రంను చివరిసారిగా చూడడానికి నిరీక్షిస్తూ ఉంటుంది. ఆ సమయంలో మీనాక్షికి చంద్రం నుండి వేరొకరి ద్వారా లేఖ అందుతుంది. దాంట్లో చంద్రానికి మీనాక్షిపై ఉన్న ప్రేమ ఆమె కోసం తాను కలలు కన్న జీవితానికి సంబంధించిన అభిప్రాయాలు ఉంటాయి. మీనాక్షి తన ప్రయాణాన్ని విరమించుకొని చంద్రాన్ని కలవడంతో కథ సుఖాంతం అవుతుంది.

కె.విశ్వనాథ్ గారి చిత్రాల్లో కథా నేపథ్యం చిన్నదైనా ప్రధాన పాత్రకు వ్యక్తిగత, అంతర్గత సంఘర్షణలను జోడించి, పాత్రను కథా లక్ష్యానికి విరుద్ధమైన రీతిలో తీర్చిదిద్ది కథలో పటుత్వాన్ని నింపేలా దర్శకత్వం వహిస్తారు. చిత్ర కథ అంతా ప్రధానంగా మీనాక్షి పాత్ర చుట్టూ తిరుగుతుంది. శాస్త్రీయ కళలైన సంగీతం, నృత్యాలలో మనసును పూర్తిగా నిమగ్నం చేసినప్పుడు సాక్షాత్తు ఆ పరమేశ్వరుడిలో ఐక్యం పొందే అనుభూతిని సాధించగలం అనే అంశాన్ని కథాంశంగా తీర్చిదిద్దిన విధానం ఆసక్తికరంగా వుంటుంది. సాంప్రదాయ జీవన విధానాన్ని ఆచార, వ్యవహారాలను కొనసాగించే కుటుంబానికి వ్యతిరేకంగా ఆధునికతను ఆహ్వానించి జీవించడానికి మథనపడే అమ్మాయి పాత్రలో భానుప్రియ నటించారు. ఈ చిత్రం చాలావరకు ప్రతి యువతి తన జీవితంలో తాను ఎదుర్కొనే సంఘర్షణను గుర్తుకు చేస్తుంది. ఇష్టం లేకపోయినా పెద్దలు అచ్చుపోసే జీవన శైలిలో ఇమిడిపోవడమా? నచ్చినట్టుగా

జీవించడమా? అనే ప్రశ్న చిత్రం చూసే ప్రతీ ప్రేక్షకుడు ఎదుర్కొనేదే?. కలల ప్రపంచంలో విహరించే యువతి పెద్ద చదువులు చదివి ఉద్యోగాన్ని చెయ్యాలని విలాసవంత మైన జీవితాన్ని కలలు కంటుంది. తండ్రి మాత్రం తన కూతురును నాట్యకారిణిగా తయారు చెయ్యాలని కలలు కంటాడు. నిత్యజీవితం లోనూ తల్లితండ్రుల ఆశయాలు, కలలకు అనుగుణంగా ముందుకు సాగడమా? తనదైన దారిలో ముందుకు సాగడమా? అనే మీమాంస అందరి జీవితాల్లోనూ తారసపడేదే.

చిత్రానికి ప్రధానబలం భానుప్రియ నటన. మీనాక్షి తాను రోజూ నాట్యశిక్షణ చేసే ప్రతిసారీ ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటుంది. ఆ సందర్భంల్లో 'అర్థం చేసుకోరూ' అంటూ చెప్పే డైలాగ్ సినీ ప్రేక్షకులకు ముచ్చట గొలిపేలా వుంటుంది. ఒక వైపు అల్లరి పిల్లగా నటిస్తూనే తండ్రి తాను చేసిన తప్పిదం వల్లే మరణించాడనే పశ్చాత్తాప భావం నటించే సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయి. ఆమె క్యారెక్టర్‌లో కొంత చిలిపితనం వుంటూనే చంద్రంపై ఆవేశాన్ని ప్రదర్శిస్తుంది. మరొక ప్రధాన పాత్ర చంద్రంగా వెంకటేష్ నటనలో సున్నితత్వం కన్పిస్తుంది. మరోవైపు తను నమ్మిన విషయం కోసం తాపత్రయ పడే సందర్భంలో ఎదురయ్యే సంక్లిష్టతలకు సహనం కోల్పోకుండా నిగ్రహంగా ముందుకు సాగే తత్వం తారసపడ్తుంది. పబ్లిసిటీ డిజైనర్‌గా పెయింటింగ్ వేసే చంద్రం మీనాక్షిలో నాట్య కళాకారిణిని దర్శిస్తాడు. దర్శకుడు చంద్రం పాత్రకు వేరొక వృత్తి కాకుండా పెయింటింగ్స్ వేసే చిత్రకారుడిగా ఎన్నిక చేసుకోవడం వల్ల ఆ పాత్రలో కళా హృదయం వుందనే విషయాన్ని చిత్రం చూసే ప్రేక్షకుడికి పరోక్షంగా చేరవేసాడు దర్శకుడు.

చిత్రంలో ప్రధానంగా రెండు సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలను తడి చేస్తాయి. పెన్షన్ కోసమై చంద్రం శేషేంద్రశర్మను గవర్నమెంట్ ఆఫీసుకు తీసుకెళ్ళినప్పుడు అక్కడ వుండే ఆఫీసర్ వయసుపైబడిన ఒక ఘనాపాటితో గౌరవ మర్యాదలు లేకుండా ప్రవర్తించినప్పుడు చంద్రం, శేషేంద్ర శర్మలు ఆ ఆఫీసర్‌కు మానవత్వం తాలూకు అంశాన్ని గుర్తు చేస్తూ ఆగ్రహించే సందర్భం. మరొక సన్నివేశం ఇష్టం లేకపోయినా వేదికపై మీనాక్షి కోసం నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినప్పుడు ఆమె ఆ వేదికపై తన ఆగ్రహాన్ని ప్రదర్శిస్తుంది. ఆ సమయంలో కూతురు తప్పిదానికి సభ, కళ పట్ల వున్న గౌరవంతో శేషేంద్ర శర్మ వయసును లెక్కచెయ్యకుండా నాట్యం చేసి ప్రాణాలు కోల్పోయే సందర్భం. ఈ సన్నివేశం చిత్ర కథలో తదనంతర సన్నివేశాలకు భూమికను ఏర్పాటు చేస్తుంది. ఆ సంఘటన తర్వాత చంద్రం పాత్ర తరచూ మీనాక్షి ఆగ్రహానికి బలవుతున్నా ఎక్కడా తొట్రుపాటు లేకుండా సహనంగా వుండడం కొత్త రకమైన హీరోయిజాన్ని ప్రదర్శించేలా చేస్తుంది. నిజానికి కె. విశ్వనాథ్ చిత్రకథల కథానాయకులు మిగతా చిత్రకథల కథానాయకు






లతో పోల్చినప్పుడు హింసతో హీరో వేసరిజాన్ని వ్యక్తం చెయ్యకపోవడం వల్ల వారితో విభేదించబడ్తూ ప్రత్యేకంగా నిలుస్తారు. ఇక ఈ చిత్ర పతాక సన్నివేశం 'తొలిప్రేమ', 'ఒక్కడు' వంటి ప్రేమ కథా చిత్రాలపై పరోక్ష ప్రభావాన్ని చూపినట్లుగా కూడా అనిపిస్తుంది.

మీనాక్షి అక్క పాత్రలో దేవీలలిత నటనలో నిశ్శబ్దంగా బాధ్యతలను మోస్తూ జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను ఒకే రీతిలో తీసుకునే మనోనిబ్బరం కన్పిస్తుంది. చిత్రంలో హాస్యానికి సంబంధించి మూడు పాత్రలే వున్నప్పటికీ ఆ పాత్రల స్వభావాలు, హావభావాలు, సంభాషించే విధానం ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తుతుంది. భర్తతో సాన్నిహిత్యానికి మించి దేవుడికి పూజలు చేస్తేనే సంతానం కలుగుతుందనే భ్రమలో శ్రీలక్ష్మి అఖిలం పాత్రలో పూజలు చేసే విధానం, ఆమె పూజలకు దేవుడి పటాలే కాదు భర్త పరిస్థితి కూడా మసిబారిపోవడం నవ్విస్తుంది. భార్య పూజలను భరిస్తూ సంగమమే లేని సంసార జీవనాన్ని నెట్టే ఓంకారం పాత్రలో సాక్షి రంగారావు నటించారు. మరొక పాత్ర పావలా శ్యామల. ఆమె శేషేంద్ర శర్మ నివసించే అద్దె ప్రాంగణంలోని కుటుంబాల్లో పనిమనిషిగా వుంటూ మాట్లాడే భాషోచ్చారణ విధానం విని తీరాల్సిందే.

చిత్రానికి ప్రధాన బలం భానుప్రియ నటనా, నాట్యాభినయనాలైతే అంతకుమించి ప్రధాన బలం సిరివెన్నెల సాహిత్యం, మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం. **'ఆకాశంలో ఆశల హరివిల్లు – ఆనందాలే విరిసిన పొదరిల్లు'** పాట ద్వారా మీనాక్షి పాత్రలో తన స్థాయికి మించిన కలల ప్రపంచంలో విహరించే యువతి ఆలోచనా తీరును వర్ణించారు. మరొక పాట **'ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపుల్లే తుళ్ళు'** ఈ పాటలో ఒక చరణం **'నటరాజ స్వామి జటాజూటిలోకి చేరకుంటె/ విరుచుకుపడు సుర గంగకు విలువేముందీ'** నృత్యానికి చిహ్నంగా నటరాజస్వామి (పరమేశ్వరుడు) ని చెప్పారు. ఆయనకు ప్రీతిపాత్రమైనది నృత్యం. గంగకు విలువ పరమేశ్వరుడి జడముడిలో కొలువై వుండడం అలాగే ఆయన సన్నిధి చేరాలంటే నాదోపాసనే కాదు నాట్యోపాసన కూడా మార్గమే. నాట్యాభినయం చేయగలిగే శక్తి వుండి ఆ పరమేశ్వరుని కృపకు నోచుకోలేక పోతే సహజంగా నీలో ఒదిగిన ఆ నృత్యకళకు విలువ లేదనే అర్థంలో రాశారు. అలాగే

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 56 హైదరాబాద్ మార్చి : 2023



**'శివపూజకు చిగురించిన సిరిసిరిమువ్వా' 'కొలువై వున్నాడే దేవ దేవుడు' 'కొత్తగా రెక్కలొచ్చెనా', 'అందెల రవమిది పదములదా– అంబరమంటిన హృదయముదా'** పాటలో సిరివెన్నెల శిఖర సమానంగా నిలిచింది. మనసును లగ్నం చేసి నాట్యం చెయ్యడమంటే సాక్షాత్తు పరమేశ్వరునిలో లీనం అయ్యేంత అనుభూతిని చెందడమే అనే అర్థంలో **నయన తేజమే 'న'కారమై, మనో నిశ్చయం 'మ' కారమై, శ్వాస చలనమే 'శి'కారమై, వాంచితార్థమే 'వ'కారమై , యోచన సకలం 'య'కారమై** అంటూ సాగే పాట నిజంగానే సంగీతం, సాహిత్య, నృత్యాల పరంగా తుహిన గిరులను కరిగించేంత స్థాయి ఉద్వేగాన్ని ప్రేక్షకుడిలో రేకెత్తిస్తుంది. ఏదేమైనా సంగీతం, సాహిత్యం, నృత్యంల పరంగా కె.విశ్వనాథ్ గారి ప్రధాన చిత్రాల్లో ఒకటిగా ఎన్నదగిన చిత్రం "స్వర్ణ కమలం". ఈ చిత్రానికి గాను ఉత్తమ చిత్రంగా నంది, ఫిలింఫేర్ అవార్డులు లభించాయి. ఉత్తమ నటిగా కూడా కథానాయిక భానుప్రియకు నంది, ఫిలింఫేర్ అవార్డులు లభించాయి.

చలన చిత్రం : స్వర్ణ కమలం
ప్రొడక్షన్ : భానూ ఆర్ట్ క్రియేషన్స్
తారాగణం : వెంకటేష్, భానుప్రియ, దేవీ లలిత, సాక్షి రంగారావు, శ్రీ లక్ష్మి , షరోన్ లోవెన్ తదితరులు
మాటలు : సాయినాథ్
సాహిత్యం : సిరివెన్నెల
సంగీతం : ఇళయరాజా
నిర్మాత : సి. హెచ్. వి. అప్పారావు
కథ, దర్శకత్వం : కె.విశ్వనాథ్

# చైత్ర ఉగాది – సంస్కృతి ప్రోది







ఉత్తరాయణంలో చైత్రమాసం
శుక్లపక్షపు తొలిరోజే సృష్ట్యారంభం
విశ్వాంబరంలోంచి –
నక్షత్రాల నడకల్నించి –
నడతలు నేర్చుకోవడం,
కాల గణనానికి కాలమానం!
ఉగాది ప్రాకృతిక సౌరభం – సంరంభం
మానవాభ్యుదయానికి –
హర్షం శ్రీకరం – శోభకృతు వర్షం
అరవై పేర్లలోని వైశిష్ట్యం
'ప్రభవ' నుంచి 'వ్యయ' వరకు
బ్రహ్మవింశతిగా
'సర్వజిత్తు' నుండి 'పరాభవ'కు
విష్ణు వింశతి గా
'ప్లవంగ' నుండి 'క్షయ' కు
శివ వింశతిగా ప్రయాణం
\+ \+ \+
పండుగలన్నీ పరమావధులే
సాంస్కృతిక వారధులే
వివేచన వివేకాలు
మేలు కలయికలతో
మానవాళి మనుగడకు
దశ – దిశ నిర్దేశించడం
భిన్నత్వంలో ఏకత్వం
భారతీయాత్మగా
మానవీయత
మాననీయతైనప్పుడే
కాలిక స్పృహలు
చింతనల్ని పాలితులకు శాపాల
కాపాలికుల్నించి రాబోయే
వసంతం – మనస్సంతస మివ్వాలి.

**సోమయాజులు వి.ఆర్.ఎస్.**
ఫోన్: 94411 48158

# తెలుగు స్వీయ చరిత్రలో కొత్త ఒరవడి – బాపట్ల వ్యవసాయ కళాశాల చరిత్ర

డా. మల్లెగోడ గంగాప్రసాద్, ఫోన్ : 738 638 7249

నేల ఒకటే. ఆకాశాలే అనేకం. ఈ రెండు వాక్యాలు చదవగానే ఒక కవితాత్మక భావనలోకి ప్రవేశిస్తాము. ఇటువంటి అనేక రకాల రసాత్మక వాక్యాలు, రసగుళికల్లాంటి యదార్థ సంఘటనలు ఏ రూపంలో కనబడినా వాటిని స్వీయ చరిత్ర అని అనడం సబబు.


తెలుగు సాహిత్య చరిత్రలో చాలా ప్రక్రియలు ఉన్నాయి. కాల గమనంలో అనేక కొత్త ప్రక్రియలు వచ్చాయి. వచ్చినవి వచ్చినట్టు కాలగర్భంలో కలిసిపోయాయి కూడా. అన్ని ఒడిదుడుకులకు తట్టుకుని ఇప్పటికీ విరాజిల్లుతున్న ప్రక్రియలు కొన్నే ఉన్నాయి. అటువంటి ప్రక్రియలలో స్వీయ చరిత్ర ఒకటి.

ఒక ప్రక్రియలో ఎప్పటికప్పుడు అంతర్గతంగా కొత్త కొత్త మార్పులు చోటుచేసుకుంటేనే అది ప్రకాశవంతంగా వెలుగుతుంది. అది వెలుతురు తొవ్వల దారి చూపిస్తుంది. వెలుగుల దివ్వెల కాంతిని పంచుతుంది. ఈ లక్షణాలు స్వీయచరిత్రలో ఉన్నాయనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

స్వీయ చరిత్రలో యాత్ర చరిత్రలు, చారిత్రక ప్రయాణాలు, నూతన ఆవిష్కరణలు, సైన్స్ సంబంధ విషయాలు, పొలిటిక్స్, ఆటలు, పాటలు, అనేక కళలు, వివిధ రంగాలలోని గొప్ప అనుభవాలు, రకరకాల చరిత్రలు, ప్రయాణాలు పొదిగి ఉన్నాయి.

కాలానుసారంగా స్వీయ చరిత్ర రచనా విధానంలో కూడా అనేక మార్పులు వచ్చాయి. తొలి దశలో స్వీయ చరిత్రలు స్వయంగా రాసుకునేవారు. క్రమంగా వీటిలో అనేక మార్పులు వచ్చాయి. స్వయంగా రాసుకున్న రాతలను ఎడిట్ చేయించడం, మౌఖికంగా తమ అనుభవాలను చెప్పి లేఖకుల సహాయంతో రాయించుకోవడం, సహృదయులైన రచయితల సహాయంతో తమ జీవిత ప్రయాణాన్ని, అనుభవాలను గొప్ప సాహిత్య శైలిలో కవితాత్మకంగానో, నవలాత్మకంగానో రాయించుకోవడం వంటి అనేక రకాల శైలీ విన్యాసాలు స్వీయ చరిత్రలో చోటు చేసుకున్నాయి.

ప్రయోగాలకు ఆలవాలం అయిన ఇటువంటి స్వీయ చరిత్ర ప్రక్రియలో మరో కొత్త శైలి ప్రవేశించింది. ఒక వ్యక్తి చరిత్రగా స్వీయ చరిత్ర రావడం సాంప్రదాయ పద్ధతి. ఆధునిక యుగం అయినా నేటి తరంలో ఒక సంస్థాగతంగా స్వీయ చరిత్ర రావడం కొత్త ఒరవడి. అది కూడా ఒక విద్యా సంస్థ తనకు తానుగా ఒక స్వీయ చరిత్రను రాసుకోవడం మంచి తరుణం. అన్నింటికంటే గొప్ప విషయం విద్యలో ప్రత్యేకమైన వ్యవసాయ విద్య కళాశాల అయిన బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి సంస్థాగత స్వీయ చరిత్ర రావడం




స్వీయ చరిత్రలోనే కొత్త మైలురాయిని నిలుపుకుందని చెప్పవచ్చు.

నాగరికత వ్యవసాయం నుండి ప్రారంభం అయ్యిందని ఒక సిద్ధాంతం ఉంది. ఇది వాస్తవం కూడా. మట్టిని నమ్ముకున్న రైతుల మనుగడ ఎల్లకాలం నిలిస్తేనే మానవ మనుగడ నిలుస్తుంది. అటువంటి రైతుల ఉనికి నిలవాలంటే ఆ మట్టిలో నుండి బంగారం పండించే విధానం కోసం అనేక అధ్యయనాలు, పరిశోధనలు జరగాలి. అటువంటి అనేక గొప్ప అధ్యయనాలను, పరిశోధనలను, ప్రయోగాలను బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రపంచానికి ప్రసాదించింది. గత 75 సంవత్సరాలుగా ప్రసాదిస్తూనే ఉంది. ఇందులో చదివిన అనేక మంది విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా, అధ్యాపకులుగా, వ్యవసాయ అనుబంధ పారిశ్రామిక వేత్తలుగా, ఆర్థిక వేత్తలుగా, విలువలున్న రాజకీయ నాయకులుగా, ఉద్యోగస్థులుగా అనేకానేక రంగాలలో తమదైన మట్టి ముద్రను వేశారు. వేస్తూనే ఉన్నారు. ఇటువంటి అరుదైన చారిత్రాత్మక సందర్భంలో వలేటి గోపిచంద్ గారు రాసిన ఒక చిన్న స్వీయ చారిత్రాత్మక వ్యాసం నాలుగు సంపుటాల స్వీయ చరిత్రా రచనకు ప్రేరణగా నిలిచింది.

సాధారణంగా ఒక కళాశాల చరిత్ర సావనీర్ గానో, డేటా కలెక్షన్‌లాగనో, ఒక విజ్ఞాన సర్వస్వ గ్రంథంగానో వచ్చిన సందర్భాలున్నాయి. కానీ బాపట్ల కళాశాల చరిత్ర వీటికి భిన్నమైనది. ఇది స్వీయ చరిత్రలో కొత్త రచనా విధానం. ఇందులో నిక్షిప్తం చేసిన విషయాలు దాదాపు అందరూ స్వయంగా వెలువరించినవే. అలా ఆయా వ్యక్తుల నుండి సేకరించిన సమాచారాన్ని ఏకసూత్రత శైలిలో కవితాత్మకంగా, కథానాత్మకంగా నిక్షిప్తం చేశారు. కొన్ని కారణాల వల్ల సమాచారం నేరుగా చెప్పలేని వారి గురించి వారికి

దగ్గరగా ఉన్న మనుషుల ద్వారానో, పత్రికల ద్వారానో సేకరించి వాటిలో నిజానిజాలను పరిశోధన చేసి అందులోని సత్యదృక్పథం ధృవీకరణ పొందాక వాటిని ఇందులో పొందుపరిచారు.


పొందు పరిచిన శైలి కూడా అద్భుతంగా ఉంది. ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాలకు, అభిరుచులకు అనుగుణంగా తెలుగు సాహిత్యంలోని ప్రముఖుల కవితలను, పాటలను ఆయా పుటల్లో పొందుపరిచారు. అంతే కాకుండా కొన్ని పుటలలో విషయానుగుణమైన, అందమైన చిత్రలేఖనాలను, ఛాయా గ్రహాలను కూడా పొందుపరిచారు.

ప్రతి స్వీయచరిత్ర వ్యాసానికి శీర్షికను అందంగా, భావస్ఫురకంగా పెట్టారు. ఆయా సంకలనాల శీర్షికలు కూడా సాహిత్య ప్రక్రియకు అనుగుణంగా తీర్చిదిద్దారు. తొలి సంపుటిని ఒక నేలా అనేక ఆకాశాలు అనడంలో ఒక బాపట్ల కళాశాల, అనేకమంది గొప్ప స్థాయిలలో ఉన్న విద్యార్థులు అనీ, తరువాత వచ్చిన వెలుతురు తొవ్వలు, వెలుగు పూలు, వెలుగు దివ్వెలు శీర్షికలు పెట్టడంలో ఉద్దేశం బాపట్ల కళాశాల చూపించిన గొప్ప తొవ్వలు, పరిమళాన్ని వెదజల్లిన పూలు, చీకటిని చీల్చిన దివ్వెలుగా కవితాత్మక భావం వ్యక్తం అవుతుంది.

ఇందులో పొందు పరిచిన విషయాలు ఒక కథనాత్మక రీతిలో గొప్ప అనుభూతికి లోను చేస్తాయి. ఆయా వ్యక్తుల జీవితాల్లోని గొప్ప ప్రయాణాలు, ఎదురైన మజిలీలు, మెలితిరిగిన మలుపులు, ఎదుర్కొన్న సవాళ్ళు, సాధించిన విజయాలు, గమ్యం కోసం తపిస్తున్న హృదయాలు అన్ని కోణాలు వాస్తవ కథనం చెడకుండా అందమైన శైలిలో పొందుపరిచారు. అందుకే ఇవి పాఠకులకు మంచి అనుభూతిని అందిస్తున్నాయి. చదువుతున్నంత సేపు ఒక కథానికలా అనిపిస్తుంది. అలా అనిపిస్తూనే స్వీయ చరిత్ర అనే విషయం స్ఫురణకు రాగానే మనలోని వ్యక్తిత్వ వికాస భావన మేల్కొంటుంది.

ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో, వ్యవసాయ విభాగంలో ఉన్నత ఉద్యోగంలో అనేక రకాల రైతుల కార్యక్రమాలు చేస్తున్న వలేటి గోపిచంద్ గారు వీటన్నిటికి మూల కర్త. వారి కష్టం, వారి ఇష్టం ఈ పుస్తకాల నిండా కనబడుతుంది. పెద్ద పెద్ద సంస్థలు స్వయంగా అనేక మంది నిర్వాహకులతో చేయవలసిన పనిని గోపిచంద్ గారు తన భుజస్కంధాలమీద నడిపించడం గొప్ప విషయం. వారి శ్రమకు తగిన విధంగానే బాపట్ల కళాశాల పూర్వ విద్యార్థులు చాలా మంది ఆర్థికంగా వారికి వెన్నెదన్నుగా నిలిచారు. అది ఒక విద్యాసంస్థ విద్యార్థులలో పెంపొందించిన క్రమశిక్షణకు నిదర్శనం.

మన చరిత్రను మనం రాసుకోకుంటే వేరే వారెవరూ రాయలేరు. ఒక వేళ రాసినా అందులో సత్యదృష్టి ఎంతుంటుందో చెప్పలేము. మనం రాసుకున్న చరిత్రలో నిజాయితి, నిష్కల్మషత, నిబద్ధత తొణికిసలాడుతుంది. బాపట్ల వ్యవసాయ కళాశాల తన స్వీయ చరిత్రను ఆ కళాశాల గోపిచంద్ గారి రూపంలో రాసుకుంది. ఇంకా రాసుకోవలసిన చారిత్రక సంఘటనలు అనేకం అలాగే మిగిలిపోయాయి. ఇది ఒక్క బాపట్ల కళాశాల వరకే ఆగిపోకూడదు. ప్రత్యేకమైన చరిత్ర కలిగిన ప్రతి కళాశాల, ప్రతి విద్యా సంస్థ, ప్రతి కార్యాలయం రాసుకోవలసిన అవసరం ఉంది. వందేళ్ళ చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం, దేశంలో గొప్ప విశ్వవిద్యాలయాల్లో ఒక్కటైన హైదరాబాద్ విశ్వవిద్యాలయం, అంతరించి పోతున్న ఓరియంటల్ కళాశాలల వ్యవస్థ, సంగీత కళాశాలల వ్యవస్థ ఇలా అనేక ప్రత్యేకమైన చరిత్ర ఉన్న అన్ని విద్యా సంస్థలు, ఇతర అనేక సంస్థలు రాసుకోవలసిన తరుణం ఇది. ఈ నాలుగు సంపుటాలు అనేక సంస్థలకు మార్గదర్శిగా ఉంటాయి. తెలుగు సాహిత్య చరిత్రలో కొత్త విషయంగా పరిఢవిల్లుతాయనడంలో ఏమాత్రం సందేహం లేదు.

శిలాక్షరం
(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)


ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-
సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 (59) హైదరాబాద్ మార్చి : 2023

# తెలంగాణ తొలి ద్విభాషా స్మృతి కావ్యం – "శ్రీవత్సాంకం"

**డా. అమ్మిన శ్రీనివాస రాజు**, ఫోన్ : 7729 883 223

తెలుగు సాహిత్యం భిన్న ప్రక్రియల కలబోత మాత్రమే కాదు భిన్న ప్రత్యేకతల వేదిక కూడా...!! సాధారణంగా సాహిత్యం అంటేనే హితం కోరేది అనే నానుడి, కేవలం హితం మాత్రమే కాక ఆత్మానందాన్ని ఆత్మస్థైర్యాన్ని కూడా అందించి అన్ని సందర్భాల్లో నేను ఉన్నాను అని నిరూపించుకుంటుంది. అన్నివేళలా స్పందించే శక్తి రచయితలకు మాత్రమే సొంతం, అది ఆనందమైన విషాదమైన ఆయా సందర్భాలకు అనుగుణంగా తనలోని మనోభావాలను అక్షరీకరించుకోవడం కవుల కర్తవ్యం కూడా.


ముఖ్యంగా తన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయిన సందర్భంలో కలిగే "మృత్యుదుఃఖం" ప్రతి వ్యక్తికి సర్వసాధారణమే, కానీ ఆ దుఃఖం తాలూకు భావనలు కూడా స్ఫూర్తిదాయకంగా అలాంటి సందర్భం ఎదురైన ప్రతి ఒక్కరికి మనోధైర్యం కూడగట్టేలా అక్షర సంధానం చేయగల మనోధైర్యం సృజన కారుడికే సొంతం.

ఆ క్రమంలోనే ఆధునిక తెలుగు కవిత్వం నిండా అనేక స్మృతి కావ్యాలు వెలువడ్డాయి, గణాంకాలు ఎలా ఉన్నా విశ్వనాథ సత్యనారాయణ తన శ్రీమతి వరలక్ష్మి మృతి చెందిన సందర్భంలో తన ఆవేదనను అక్షర రూపం చేస్తూ వ్రాసిన 300 పద్యాల "వరలక్ష్మి త్రిశతి" ఆధునిక తొలితెలుగు స్మృతి కావ్యంగా చెప్పవచ్చును, అనంతర కాలంలో అనేకమంది తెలుగు కవులు తమ మాతృ, పుత్ర, సతీ వియోగాలను తమ తమ స్మృతి కావ్యాలుగా వెలువరించారు.

ఇక తెలుగు భాషలోనే ఒక విశిష్ట స్థానం సంపాదించిన తెలంగాణ సాహిత్యంలో కూడా ఈ స్మృతి కావ్యాలు కనిపిస్తాయి అందులో ఒకటి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం(2014) అనంతరం 2016సం. లో వెలువడిన స్మృతికావ్యం "శ్రీవత్సాంకం", ఇది కేవలం తెలుగు భాషతోనే సరి పెట్టుకోక ఏకకాలంలో తెలుగు ఆంగ్ల భాషల్లో వ్రాయబడి తెలంగాణ తొలి స్మృతి కావ్యంగానే కాక, "ప్రథమ ద్విభాషా స్మృతి కావ్యం" గా చరిత్రలో నిలిచింది.

ఇక "శ్రీవత్సాంకం" నేపథ్యం పరిశీలిస్తే..... తెలంగాణలోని హన్మకొండ ప్రాంతానికి చెందిన "శ్రీవత్సాంక" అనే యువకుడు ఉన్నత విద్య కోసం ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ "సిడ్నీ" నగరంలో కారు ప్రమాదంతో మృత్యువాత పడ్డాడు, అతని తల్లిదండ్రులకు తను చాలా రోజుల తర్వాత ఏకైక పుత్ర సంతానంగా పుట్టడం, తన సహజ ప్రతిభాపాటవాలతో బహుముఖ ప్రజ్ఞాశీలునిగా ఎదుగుతున్న వేళ, పెళ్లీడు వయసులో అర్ధాంతరంగా అసువులు బాయటం ఏ తల్లి తండ్రి తట్టుకోలేని కడుపుకోత వ్యథ.

అయినా శ్రీవత్సాంక తండ్రి డా. ఎన్.వి.ఎన్ చారికి ఆ దైవమే అందించిన మనోధైర్యం సాయంతో తనలో పొంగిపొర్లుతున్న బాధలు తన కుమారునితో తనకు గల అనుబంధం అన్వయించుకుంటూ... రోజుకో పద్యం రూపంలో అక్షరీకరించారు, ఆయన వృత్తి రీత్యా వాణిజ్య శాస్త్ర సహాయ ఆచార్యుడైన, తెలుగు భాష పై సాధనతో పట్టు సాధించుకుని పద్యాలు సైతం వ్రాసే స్థాయికి ఎదిగారు, ఆ అర్హతతోనే ఈ "శ్రీవత్సాంకం" రాశారు. కేవలం తెలుగులో రాసేసి ఊరుకోకుండా తన కుమారుని మరణం తాలూకు "వ్యథాపూరిత సందేశం" విశ్వవ్యాప్తం చేయాలనే ఆలోచనతో తన సహ ఉద్యోగి, ప్రముఖ అనుసృజనకారుడు, ఎల్లటి తిరుపతి రెడ్డి గారితో ఆంగ్లం అనువాదం చేయించి తెలుగు ఆంగ్ల పద్య భావాల్ని పక్కపక్కనే వ్రాయించి ద్విభాషస్మృతి కావ్యంగా పాఠక లోకానికి అందించారు.




ఇక ఈ ద్విభాషస్మృతి కావ్యం రచనలో సృజన, అనుసృజన కారులు ఇద్దరు చేసిన అక్షర కృషిని విహంగ వీక్షణం చేయడమే ప్రస్తుతం మన పని. ఈ స్మృతి కావ్యం బాహ్యంగా ఎలాంటి విభాగాలు విభజనలకు గురి కాకపోయినా భావయుక్తంగా ఆ విభజన సూత్రం పాటించారు.

మొత్తం 162 పద్యాలు గల ఈ కావ్యం అంతా శ్రీవత్సాంక పుట్టుక కోసం తల్లిదండ్రులు పడ్డ ప్రయాస, బాల్యంలో యవ్వనంలో, అతడు చేసిన చిలిపి ప్రతిభా పనులు, అల్లరులు, కడు రమణీయంగా చెబుతూనే, అతడి మరణం తర్వాత వారికి కలిగిన దుఃఖం తాలూకు ఆవేదన కరుణ రసాత్మకంగా హృదయ భావంతో సహజ సిద్ధమైన కారుణ్యం జోడించి మనసుకు హత్తుకుపోయేటట్టు అక్షరీకరించారు, కావ్యకర్త డాక్టర్ చారి,

**శ్రీ వల్లభ! కరుణాలయ/ జీవేశ్వర చక్రపాణి శ్రీ నరసింహ/ మా వేదన వినిపింతును/ శ్రీ విజ్ఞుని మాకు నిమ్ము శ్రీ వత్సాంకున్....** అంటూ తమ కుమారుని తమకు ఇప్పించమని తమ ఇలవేల్పు,

మృత్యు బంధనకరుడు అయినా శ్రీనారసింహుని వేడుకుంటూ తన స్మృతి కావ్యానికి శ్రీకారం చుట్టారు కృతికర్త.

ఈ స్మృతి కావ్యం ప్రక్రియార్థం, పద్యయుతంగా ఉన్న అచ్చమైన ఆధునిక తెలుగు భాషా పదాలతో "స్వచ్ఛమైన సరళత" పుణికి పుచ్చుకుంది. ఇక ఆంగ్ల అనువాదంలో కూడా అదే సరళత కొనసాగి పాఠకులకు పట్టణా సౌలభ్యం విస్తృతంగా సమకూరింది అనుసృజన కారుడు ఎల్లటి తిరుపతి రెడ్డి గారు కూడా అంతే సరళమైన ఆంగ్ల భాషతో కొనసాగించారు.

తెలుగు పద్యం పక్కనే ఆంగ్ల పదభావన కూడా జత చేయబడి ఉండటం పాఠకులకు వరంగా భావించ వచ్చు. భిన్న ధ్రువాలు గల తెలుగు ఆంగ్ల భాషలను స్వచ్ఛమైన సరళత్వంతో అనువదించటం ఓ సాహసమే అది ఎలా జరిగిందో మచ్చుకు పద్యం గమనించండి.

**"ఉగ్గ పాలు జూపి, ఊరించి పట్టించి/ సంబరమున నిన్ను సాకినాము/ గుఱ్ఱ మాటలాడి గుండెక దుముకొంచు/ వెన్నెముద్దలెన్నో పెట్టినాము...**

Showing you uggu paalu/made you drink/ by making your mouth water/ and we fostered you our son/ having played a horse game/pressing you gently to our heart/ We gave you/ mini lumps of butter.....

ఇక్కడ ఏ భాషా పదాలకు ఉండే ప్రత్యేకత వాటికుంటుంది. అవి అనువాదకులు తలవంచవు అనే విషయం మనం ఇక్కడ గమనించాలి.

ఉగ్గుపాలు అనే స్వచ్ఛమైన తెలుగు పదాన్ని ఆంగ్లంలో కూడా uggupaalu గానే అనువదించి, (castor oil mixed with mother.... milk given to a newborn baby..) అంటూ సుదీర్ఘ వివరణ ఇచ్చారు అను సృజనాకర్త, ఇలాంటి భాషాపరమైన ప్రత్యేకతలు ఇందులో మనం అనేకం గమనించవచ్చు.

ఇక ఈస్మృతి కావ్యం అంతా.. "శ్రీ వత్సాంక" కు సంబంధించిన జ్ఞాపకాల దొంతరలే!! అయినా అందులో అంతర్భాగంగా బోలెడంత మనోధైర్యం, కనీ కనిపించని సందేశం, హెచ్చరికలు కనిపిస్తాయి.

ఈ పద్య స్మృతి కావ్యం అంతా వృత్త, జాతి, ఉపజాతుల మయంగా ఉంది, కావ్య కర్త తెలుగు పద్య రచనలో వ్యధా భరిత వేళలోనూ తనదైన ప్రతిభను, సడలించని స్థితప్రజ్ఞతను, చూపి ఆదర్శనీయుడయ్యారు.

కరుణ రసాత్మక, ఆధ్యాత్మిక, భావనల సమ్మేళనమైన ఈ స్మృతి కావ్యం ఆద్యంతం, హృద్యంగా సాగుతుంది.

సహజ ప్రతిభా సంపన్నుడైన శ్రీవత్సాంకుని గుణగణాలు దాతృ హృదయం, మాతృప్రేమ, స్నేహతత్వం, గురించి తండ్రి అయిన కావ్యకర్త తలపోసుకోవడం ఒక భాగం కాగా,... బంధు గణం, స్నేహ బృందం సైతం రెండు భాషల్లోనూ తమ తమ భావనలు పంచుకున్న వైనం ఈ కావ్యానికి అనుబంధమై.

శ్రీవత్సవాంకుని వ్యక్తిత్వం నేటి యువతకు సాక్షాత్కరిస్తుంది, హంసలా అల్పజీవితం గడిపిన, శ్రీవత్సాంక "ఆదర్శం"లో చిరంజీవిగా "నల్లాన్ చక్రవర్తుల" వంశాన నిలుస్తాడు అనడంలో అక్షర సత్యం ఉంది.

---

**"ఉద్ధరేదాత్మనాఽఽత్మానం నాత్మానమవసాధయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనోబంధు: ఆత్మైవ రిపురాత్మన: ॥"**


**(భగవద్గీత 6-4)**

అందరూ తమను తామే ఉద్ధరించుకోవాలి. వారిని వారు అధోగతిని పొందించుకోకూడదు. ఇంద్రియాలను జయించుకునే ప్రయత్నం చేస్తే తనకు తానే బంధువు అవుతాడు. అదేవిధంగా జయించక పోతే తనకు తానే శత్రువు అవుతాడు.


ఈ లోకంలో పుట్టిన అందరూ ఏవో కర్మల కొరకు మాత్రమే పుడుతుంటారు. పుట్టిన ప్రతివారు తప్పనిసరిగా తామున్న స్థితి నుండి ఉన్నతస్థితివైపు ఎదగడానికి మాత్రమే ప్రయత్నించాలి. ఎవరో వచ్చి తమను ఉద్ధరించే అవకాశం లేదు. తమ కర్మల ప్రకారమే ఎవరైనా తమ చుట్టూ చేరుతారు. అయినా తమకున్న పుణ్యం వల్లనే వారు తమకు ఉపయోగపడతారు. అందువల్ల అనవసరమైన విషయాలపై మనసు కేంద్రీకరించకుండా, ఉన్నతశక్తిపై దృష్టి సారించినప్పుడు మాత్రమే తమను తాము ఉద్ధరించుకునే అవకాశం కలుగుతుంది.

మన చుట్టూ ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. సమస్యలను చూస్తూ, ఇంద్రియాలకు లోలత్వము పొందుతూ స్వల్ప సంతోషాలకు పొంగిపోవడం, చిన్న బాధలకే కుంగిపోవడం వల్ల ఎదగడం కష్టం. అసలు సమస్యలు ఎందుకు వస్తుంటాయి? తమకే అనేక రూపాల్లో కష్టాలు వస్తుంటాయని ఎందుకు మనం భావిస్తున్నాం? ఇవి మనని వేధిస్తున్న ప్రశ్నలు. తట్టుకునే శక్తి ఉన్నంతవరకు ఏదీ సమస్య కాదు. తట్టుకునే శక్తి లేనప్పుడు మాత్రమే ఏ విషయమైన సమస్యగా భావించడం జరుగుతుంది. ఒక చిన్నపిల్లవాడికి ముల్లు గుచ్చుకుంటే బాగా ఏడుస్తాడు. అదే కొంత పెద్దవానికి గుచ్చుకుంటే అంత ఎక్కువగా బాధపడడు. ఇద్దరికీ జరిగిన నొప్పి ఒక్కటే అయినా చిన్నపిల్లవానికి తట్టుకునే శక్తి ఉండకపోవడం వల్ల ఏడవడం జరుగుతుంది. అందుకే మన ప్రయత్నం ద్వారా మనం అన్ని సమస్యలను తట్టుకునే శక్తిని పెంచుకోవాలి.


## స్వీకృతి





**ఆమె మార్పు ఎజండా (కవిత్వం)**
మహమ్మద్ ఖాజామైనద్దీన్
వెల : 50 /-
**ప్రతులకు :** తెలంగాణ సాహితి, 1-10-85/18,
షాసాబ్ గుట్ట, మహబూబ్‌నగర్.
ఫోన్ : 939 662 6276




**కతల చెట్టు (తెలంగాణ బడి పిల్లల కతలు)**
ప్రధాన సంపాదకులు : డా. పత్తిపాక మోహన్
వెల : 100 /-
**ప్రతులకు :** రంగినేని ఎస్ఎమ్ఇసి ట్రస్ట్
కరీంనగర్ రోడ్, సిరిసిల్ల - 505 301.
ఫోన్ : 98490 12459




**చల్లారని నిప్పు రవ్వలు (కవిత్వం)**
మహమ్మద్ ఖాజామైనద్దీన్
వెల : 50 /-
**ప్రతులకు :** తెలంగాణ సాహితి,
1-10-85/18,
షాసాబ్ గుట్ట, మహబూబ్‌నగర్.
ఫోన్ : 939 662 6276




**నిరుద్ధ భారతము (అస్పృశ్యతా ఖండనము)**
- మంగిపూడి వేంకటశర్మ
వ్యాఖ్యాత : ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు
వెల : 252 /-
**ప్రతులకు :** ఎస్.ఆర్. పబ్లికేషన్స్, డోర్ నెం. 2-1-532, 533, కల్యాణలక్ష్మి నిలయం, స్ట్రీట్ నెం. 9, బ్యాంక్ ఆఫ్ ఇండియా లేన్, నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 903 242 8516




**నిర్వేద స్థలం (కవిత్వం)**
బాల సుధాకర్
వెల : 100 /-
**ప్రతులకు :** పి. పల్లవి, తెలుకల వీధి క్రింద, నెల్లిమర్ల ఎస్.ఓ., విజయనగరం జిల్లా. 535217
ఫోన్ : 9676493680

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్‌అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -26 : సంచిక - 5 హైదరాబాద్ మార్చి : 2023


# బాకీ...



**ఎన్. గోపి**
**939 102 8496**

చార్మినార్
నాలుగు చేతులు సాచి
కౌగిలించుకున్నంత పని చేస్తుంది
ఇది నాకెదురయ్యే నిత్యకృత్యమే
చాలాకాలం తర్వాత
పత్తర్‌గట్టిలో ప్రవేశంచగానే
గుర్తుపట్టి పలకరించింది
పైనుండి ఓ మబ్బుతునకను
దస్తీలా ఊపింది

మదీనా దాటగానే
కుడివైపు మళ్లాను
ఆశ్చర్యం! అక్కడ ఆరేండ్లు
నేను పనిచేసిన కాలేజీ లేదు
లేదా అంటే అలా లేదు
కూల్చేసి కార్పొరేట్ మందిరాలు నిర్మించారు
మనస్సు కలుక్కుమంది
నా కెరీరంతా
ఇక్కడే తయారయ్యింది
వేమన కోసం నేను చేసిన అప్పులన్నీ
తిప్పలను మరిపించేవి
సీనియర్ అధ్యాపకులు నన్ను
ప్రేమగా చూసుకునేవాళ్ళు

అప్పటి పేదరికం
అసలు పేదరికమే కాదు
బస్సుకు పైసలు చాలకపోతే
పదిమైళ్ళు నడిచిన రోజులున్నాయి
అప్పుడు సంపాదించుకున్న విద్యార్థులెందరో
ఇప్పుడు ఉన్నతస్థితిలో వున్నారు

నయాపూల్, హైకోర్టు భవనం, పురానాపూల్
నన్ను సాదరంగా పలకరించాయి
మదీనా హోటల్ చాయ్
ఇప్పటికీ అదో మాయ!

నాకు రెండు రూపాయలు అప్పిచ్చిన
గణితం సార్ కోసం
యాభైయేండ్ల తర్వాత వెళ్తున్నాను
మొన్న కలలోకొచ్చి
'మేరే దో రూపియా కబ్ దేతేరే' అన్నాడు

తీర్చాలి తీర్చాలి అంటూ
అతణ్ని వెతుక్కుంటూ వెళ్లాను
అప్పటి అధ్యాపకులు ఎవరికీ గుర్తులేరు
ఓ రిటైర్డ్ వృద్ధ చప్రాసి కలిస్తే
మిత్రుని ఇల్లు కోసం అడిగాను

'అయ్యో అమర్‌చంద్ ముక్తా
చనిపోయి ఐదేళ్ళయ్యింది' అన్నాడు
హఠాత్తుగా శూన్యమంటే ఏమిటో తెలిసింది
చార్‌కమాన్లు
ఏదో గొడుగుతున్నాయి గాని
మెల్లగా మొదలైన చినుకుల రొదలో వినపడలేదు.
భారంగా నడుస్తున్నాను
అప్పుడు దొంగతనంగా
సిగరెట్లు తాగిన మూల నిలబడి పైకి చూశాను
అతని రూపమే ఆకాశం నిండి అలుముకుంది

రెండు రూపాయలు తీర్చకుండానే
కారులోకొచ్చి కూర్చున్నాను
ఆనాటి నడక ముందు
ఆ కారు పరుగేపాటి!
జేబులో రెండు రూపాయలు
అంతులేని బరువై
నన్ను వెక్కిరిస్తున్నాయి!

## ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే**
**ప్రతి నిర్ణయానికి**
**మా ప్రేమ, సేవ**
**అంకిత భావం మీకు**
**తోడుగా ఉంటుంది.**

**IUI** **IVF** **ICSI** **IMSI** **HSG**



**ఫర్టీ 9** హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం
మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్